www.peoplesnews.in

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 199 మంగళవారం, ఏప్రిల్ 14, 2026, పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

# మహిళా రిజర్వేషన్లతో పునర్విభజన లింక్

● ఇందులో బిజెపి రాజకీయ కుట్ర దాగి ఉంది ● పునర్విభజనను రాజకీయ పావుగా వాడుకుంటున్న మోడీ ● జనాభా లెక్కల అనంతరం మహిళా బిల్లు అని చెప్పారు ● ఆ మేరకే గతంలో బిల్లు పెట్టి..ఇప్పడీ హడావిడి ఎందుకు? ● పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై అనుమానాలు ఉన్నాయి ● 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి ● జనాభా లెక్కల తరవాత నియోజకవర్గాల పునర్విభజనపై చర్చించాలి ● దక్షిణాదిని దెబ్బతీసే కుట్రలో భాగంగానే ఉత్తరాది సీట్ల పెంపు ● 50శాతం సీట్ల పెంపు ఏ ప్రాతిపదకనో ఎందుకు చెప్పడం లేదు ● మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం



**హైదరాబాద్,ఏప్రిల్ 13 :** మహిళారిజర్వేషన్లు, పునర్విభజనను కలపడంతో రాజకీయ కుట్ర ఉందని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2026 జనాభా లెక్కల ప్రకారం మహిళారిజర్వేషన్లబిల్లు తీసుకువస్తే కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇవ్వడంతో పాటు కట్టుబడి ఉంటామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. హిళలరాజకీయసాధికారితకు కాంగ్రెస్ మొదటి నుంచి కట్టుబడి ఉంది..నియోజకవర్గాల పునర్వభజనను ప్రధాని మోదీ రాజకీయ పావుగా ప్రమాదకరంగా వాడుకుంటున్నాడని ఆరోపించారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. డీలిమిటేషన్ అనేది రాజకీయ పార్టీలకో, ప్రభుత్వానికో సంబంధించిన అంశం కాదని స్పష్టం చేసిన సీఎం రేవంత్, దీనిని మహిళా రిజర్వేషన్లతో కలిపి చూపించడం సరైంది కాదన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ రెండు అంశాలను కలిపి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని విమర్శించారు. సోమవారం సాయంత్రం సచివాలయంలో ఆయన మత్రులు, ఎంపిలు, ఇతర నాయకులతో కలసి మీడియా సమావేశంలో మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా దుష్ప్రచారం జరుగుతోందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మహిళలకు ఓటుహక్కు, రాజకీయ రిజర్వేషన్లు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలోనే మహిళలు ముఖ్యమైన పదవులు చేపట్టిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ రెండూ వేర్వేరు అంశాలని స్పష్టం చేసిన రేవంత్ రెడ్డి, వీటిని కలిపి బీజేపీ మిగతా2లో...

## బిఆర్ఎస్‌తో పొత్తు ఇక్కడికే పరిమితం

● ఖానాపూర్ సభలో బిజెపి అధ్యక్షుడు రాంచంద్రరావు



**నిర్మల్,ఏప్రిల్ 13 :** పొత్తులపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఖానాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయం సాధించడాన్ని పురస్కరించుకుని నిర్మల్‌లో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదని స్పష్టం చేశారు. ఖానాపూర్‌లో బీఆర్ఎస్‌తో జరిగిన పొత్తు స్థానిక నాయకుల మధ్య మాత్రమే జరిగిందని.. పార్టీ స్థాయిలో కాదని వివరించారు. ఖానాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు, పోలీసుల బలంతో గుండాయిజం చేసినా ప్రజలు బీజేపీకి మద్దతు ఇచ్చి పట్టం కట్టారని మిగతా2లో...

## రాష్ట్రపతిని కలిసిన లోకేశ్ బృందం



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 13 :** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఎపి ప్రతినిధి బృందం కృతజ్ఞతలు తెలిపింది. అమరావతి బిల్లు అమల్లోకి రావడంతో మిగతా2లో...

## పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధమేఘాలు

● ఇరాన్‌పై దాడికి ట్రంప్, ఇజ్రాయిల్ సమాలోచనలు ● ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న ఆందోళన




**వాషింగ్టన్,ఏప్రిల్ 13 :** అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమవడంతో పశ్చిమాసియా మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారింది. ఏ క్షణాన ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మరోవైపు, ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభించేందుకు అమెరికా, ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నట్లు వార్తలు రావడం ఆందోళన కలిగిస్తోంది. హర్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తామని అమెరికా సెంట్రల్ కమాండ్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో పాటు ఇరాన్‌పై పరిమిత స్థాయిలో సైనిక దాడులను పునరుద్ధరించేలా అగ్రరాజ్య మిగతా2లో...



2లో

## కూల్చివేతలు ఆపండి

### - హైడ్రాకు హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్,ఏప్రిల్ 13 :** అక్రమ నిర్మాణాలు, అనుమతి లేని నిర్మాణాల కూల్చివేతలకు అమలు చేసే విధివిధానాలు ఏమిటో చెప్పే వరకు కూల్చివేత చర్యలు ఆపాలని హైడ్రాను హైకోర్టు ఆదేశించింది. సోమవారం మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. మిగతా2లో...

## 48 గంటల్లో క్షమాపణ చెప్పాలి


### - లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు




**హైదరాబాద్,ఏప్రిల్ 13 :** అంగన్వాడీలకు సంబంధించిన మొబైల్ ఫోన్ల కొనుగోళ్ల విషయంలో నిరాధార ఆరోపణలు చేస్తూ తన ప్రతిష్టను దెబ్బతీసేలా బీఆర్ఎస్ పార్టీ వ్యవహరిస్తోందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి 48 గంటల్లో తనకు క్షమాపణ చెప్పాలనీ, లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఈ మేరకు మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సీతక్క సోమవారం లీగల్ నోటీసులు పంపారు. మంత్రి తరపున అడ్వకేట్ నాగులూరి కృష్ణ కుమార్ రిజిస్టర్ పోస్ట్ ద్వారా కేసీఆర్‌కు నోటీసు పంపారు. అంగన్వాడీ మొబైల్ ఫోన్ల కొనుగోలు ప్రక్రియను తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ (టీజీటీఎస్) నిర్వహించిందని నోటీసులో సీతక్క పేర్కొన్నారు. టెండర్ ఎవాల్యుషన్ మిగతా2లో...

## ఐటి ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక దృష్టి

- ఉద్యోగులపై మతపరమైన ఒత్తిళ్లు ఉండరాదు
- ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్న బండి సంజయ్



**హైదరాబాద్,ఏప్రిల్ 13 :** నాసిక్‌లో జరిగిన 'లవ్ జిహాద్' ఆరోపణల కేసు నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్ ఐటీ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఈ మేరకు బండి సంజయ్ కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఐటీ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులపై మతపరమైన ఒత్తిళ్లు, వేధింపులు, రహస్య నెట్‌వర్క్‌ల ప్రభావం ఉండకూడదని తెలిపారు. హైదరాబాద్‌లో లక్షలాది మంది ఐటీ మిగతా2లో...

## వికసిత భారత్ లక్ష్య సాధనలో మినరల్స్ కూడా కీలకమే...

● మినరల్ రంగంలో ఆత్మనిర్భరత భారత్‌పై ప్రత్యేక దృష్టి
● కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, 13 :** ప్రపంచ వ్యాప్తంగా క్రిటికల్ మినరల్స్ ప్రాముఖ్యం పెరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 2047 వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడంలో మినరల్స్ కీలకమని చెప్పుకొచ్చారు. మినరల్ రంగంలో ఆత్మనిర్భరత సాధించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. సోమవారం హెచ్ఐసీసీలో భారత ప్రభుత్వ గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2వ విడత ఎక్స్‌ప్లోరేషన్ లైసెన్స్ వేలం, 7వ విడత క్రిటికల్, మిగతా2లో...



2లో

## భూ పరిపాలనకు కొత్త దిక్సూచి భూభారతి

- చరిత్రాత్మక చట్టానికి నేటితో ఏడాది పూర్తి
- ఏడాదిలో 5కోట్లకు పైగా భూభారతి పోర్టల్ సందర్శన
- 70 లక్షల మంది పోర్టల్ ద్వారా లాగిన్
- 3.80లక్షల మందికి పాస్‌బుక్‌ల జారీ: మంత్రి పొంగులేటి

## సంగారెడ్డి జిల్లాలో అరుదైన ఖనిజాలు.. పర్వతపూర్ బ్లాక్‌లో టైటానియం, లేటరైట్ నిక్షేపాలు

వివరాలు లోపలి పేజిలో..

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధమేఘాలు

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షుడు ట్రంప్ సలహాదారులు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే, ఈ దాడులకు ట్రంప్ అంగీకరిస్తారా? లేదా అనేదానిపై ఇంకా స్పష్టత లేదు. ఇరాన్ (ఎసజీని)ను నలువైపులా నిర్బంధించి, హర్మూజ్ జలసంధిపై నియంత్రణ తెచ్చుకోవాలని ట్రంప్ భావిస్తున్నట్లు సమాచారం. మిత్ర దేశాలతో కలిసి ఈ మార్గంలో ప్రయాణించే నౌకలకు భద్రత కల్పించే అంశంపై అమెరికా అధ్యక్షుడు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అటు, ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ కూడా ఇరాన్‌పై దాడులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఐడీఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జమీర్ తన సైన్యాన్ని ఆదేశించినట్లు ఇజ్రాయెల్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇరాన్‌పై దాడుల పునరుద్ధరణ విషయంలో ట్రంప్ నిర్ణయం కోసం ఇజ్రాయెల్ ఎదురు చూస్తున్నట్లు ఆ కథనాలు తెలిపాయి. అయితే, ఈలోగా టెహ్రాన్ తమపై దాడి చేస్తే మాత్రం ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఐడీఎఫ్ హెచ్చరిస్తోంది. ఇదిలా ఉండగా.. యూఎస్-ఇరాన్ చర్చలు విఫలం కావడంతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు చెలరేగాయి. ఇరాన్ పోర్టుల నుంచి నౌకలు హోర్ముజ్ మీదుగా రాకపోకలు సాగించకుండా నేటి సాయంత్రం 7.30 (భారత కాలమానం ప్రకారం) నిర్బంధం విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దీంతో పాటు ఇరాన్‌పై యూఎస్, ఇజ్రాయెల్‌లు మళ్లీ దాడులు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.అణు కార్యక్రమాన్ని వదులుకునేలా ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ఇజ్రాయెల్ దాడులను ప్లాన్ చేస్తున్నట్టు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఆర్మీ సిద్ధంగా ఉండాలని ఇప్పటికే ఇజ్రాయెల్ రక్షణ దళం చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ జమీర్ ఆదేశించారు. మరోవైపు, ఇరాన్‌పై పరిమిత స్థాయిలో దాడులు చేసేందుకు ట్రంప్, ఆయన సలహాదారులు యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇరాన్‌ను అన్ని వైపుల నుంచి దిగ్బంధించి చర్చల్లో ప్రతిష్టంభనను తొలగించాలనేది యూఎస్ ప్రభుత్వం ఉద్దేశమని కథనాలు వెలువడ్డాయి. ఈ దిశగా నాటో దేశాలను కూడా రంగంలోకి దింపేందుకు అమెరికా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే హోర్ముజ్ మీదుగా నౌకల రాకపోకలను ఇరాన్ నిలిపివేసిన విషయం తెలిసిందే. హోర్ముజ్ జలాల్లోకి యూఎస్ యుద్ధ నౌకలు వస్తే దాడులు తప్పవని హెచ్చరించింది. చర్చలు విఫలం కావడానికి అమెరికానే కారణమని తేల్చి చెప్పింది. యూఎస్ పెట్టిన అసమంజసమైన డిమాండ్స్ కారణంగానే చర్చల్లో పీటముడి పడిందని పేర్కొంది. అణు కార్యక్రమం వదులుకునే దిశగా ఇరాన్ నుంచి స్పష్టమైన హామీలు రాలేదని యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు

# మహిళా రిజర్వేషన్లతో పునర్విభజన లింక్

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తోందని విమర్శించారు. ముఖ్యంగా 2011 జనాభా లెక్కల ఆధారంగా ఈ రెండు అంశాలను అనుసంధానించడం వెనుక రాజకీయ కుట్ర, వివక్ష ఉన్నాయని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు తమ పూర్తి మద్దతు ఉందని ప్రకటించిన సీఎం రేవంత్, ప్రస్తుతం ఉన్న పార్లమెంట్ సీట్ల ఆధారంగానే ఈ బిల్లును అమలు చేయాలని కేంద్రాన్ని కోరారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలోనే ఈ బిల్లును అమలు చేసి ఉంటే, మరింత మంది మహిళలు పార్లమెంట్‌కు ఎన్నికయ్యేవారని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలోనే పురుషులతో పాటు మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. అప్పటికిప్రపంచంలోని చాలా దేశాల్లో మహిళలకు ఓటు హక్కు లేదు.పురుషులతో పాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించింది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. దేశ ప్రధానిగా, రాష్ట్రపతిగా, లోక్ సభస్పీకర్ గా, ముఖ్యమంత్రులుగా, గవర్నర్లుగా చాలా రాజ్యాంగబద్ధమైన పదవుల్లో మహిళలకు కాంగ్రెస్ అవకాశం కల్పించిందని గుర్తు చేశారు. మహిళలనాయకత్వంలోపనిచేసిన పార్టీ కాంగ్రెస్.. రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల్లోమహిళలకు రిజర్వేషన్లు తీసుకువచ్చారు.. సోనియా గాంధీ నాయకత్వంలో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువచ్చారు.. అప్పుడు రాజ్యసభలో ఆమోదించారు..బీజేపీ సహకరించక పోవడం వల్లనే లోక్ సభలో మహిళారిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందలేదన్నారు. ఇంతకాలం ప్రధాని మోదీ ఈ బిల్లును పట్టించుకోలేదు. 2023 లో మహిళారిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతుఇచ్చింది.. 2026 జనాభాలెక్కల తర్వాతగెజిట్ ఆధారంగా మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తామని చట్టం చేశారు... 2026జనభా లెక్కలు పూర్తి చేసి అమలు చేయకుండా 2011జనాభాలెక్కల ఆధారంగా చట్టం ముందుకు తెస్తున్నారు.. 2026జనాభా లెక్కలప్రకారం నిబంధనను సవరించుకుంటే 2029 లోక్ సభతో పాటు వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలుచేయొచ్చన్నారు. ఇకపోతే 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ చేయాలని ఎన్డీయే చూస్తోందన్నారు. కానీ, 2026 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలన్నది కాంగ్రెస్ డిమాండ్ అని చెప్పారు. ఈ రెండింటినీ కలపడం, పాత జనాభా లెక్కల ప్రకారం వెళ్లడంలో కుట్ర ఉందని ఆక్షేపించారు. 33శాతం మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. చిన్న రాష్ట్రాలు, దక్షిణాదికి అన్యాయం జరిగేలా మోదీ కుట్ర చేస్తున్నారు. కుటుంబ నియంత్రణను దక్షిణాది రాష్ట్రాలు సమర్థంగా అమలు చేశాయి. ఉత్తరాదిలో అది సరిగ్గా అమలు కాకపోవడం వల్లే జనాభా విపరీతంగా పెరిగింది. జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు వద్దని దక్షిణాది రాష్ట్రాలు గట్టిగా చెప్పాయి. దక్షిణాది రాష్ట్రాల వ్యతిరేకత వల్ల మోదీ కొత్త ప్రతిపాదన తీసుకొచ్చారు. ప్రతి రాష్ట్రంలో 50శాతం సీట్లు పెంచుతామని చెబుతున్నారు. ఇలా చేస్తే.. యూపీ, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో సీట్లు బాగా పెరగనున్నాయి. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య లోక్‌సభ సీట్లలో అంతరం భారీగా పెరుగుతుందన్నారు. సీట్ల పెంపు తర్వాత దక్షిణాదిలో 195 లోక్‌సభ స్థానాలు అవుతాయి. ఉత్తరాదిలో సీట్లు 620కి పెరుగుతాయి. ఉత్తర, దక్షిణాది మధ్య ప్రస్తుతం ఉన్న 210 సీట్ల అంతరం 412కి పెరుగుతుంది. ఎన్డీయే ప్రభుత్వంలో దక్షిణాది రాష్ట్రాలకు ఏమాత్రం ప్రాధాన్యం దక్కడం లేదు. కేంద్రంలోని కీలక శాఖలు ఏవీ దక్షిణాది రాష్ట్రాలకు ఇవ్వడం లేదు.దీనికి మేం వ్యతిరేకం. దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఫైనాన్షియల్ కేపిటల్స్. ఉత్తరాది రాష్ట్రాలు పొలిటికల్ కేపిటల్స్. పొలిటికల్ కేపిటల్స్ ఎప్పుడూ ఫైనాన్షియల్ కేపిటల్స్‌ని తక్కువగా చూస్తాయి.

దక్షిణాది రాష్ట్రాలు ద్వితీయ శ్రేణి పౌరులుగా మిగిలిపోతారని అన్నారు. హైబ్రిడ్ ప్రాతిపదికన సీట్లు పెంచాలనేది మా డిమాండ్. కొత్తగా పెంచే సీట్లలో 50 శాతానికి జీడీపీని ప్రాతిపదికగా తీసుకోవాలి. కొత్తగా పెంచే సీట్లలో 136 సీట్లు జీడీపీ వృద్ధి ఆధారంగా పెంచాలి. మరో 136 సీట్లను జనాభా ప్రాతిపదికగా పెంచాలి. దేశానికి ఆదాయం ఇస్తున్న రాష్ట్రాలను గౌరవించాలి. చిన్న రాష్ట్రాలకు కూడా న్యాయం జరిగేలా గతంలో సీట్ల కేటాయింపు జరిగిందని రేవంత్‌రెడ్డి అన్నారు. మీడియా సమావేశంల మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి, సీతక్క, పొంగులేటి, ఎంపిలు రఘురామిరెడ్డి, మల్లు రవి, సలహాదారు కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

# వికసిత భారత్ లక్ష్య సాధనలో మినరల్స్ కూడా కీలకమే...

(మొదటి పేజీ తరువాయి)

స్ట్రాటజిక్ మినరల్ బ్లాక్స్ వేలం కార్యక్రమానికి కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. జియోపాలిటిక్స్, క్లైమేట్ మార్పు, ఆర్థిక భద్రతలో ఈ మినరల్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. ఇప్పటివరకు 46 బ్లాక్స్ వేలం విజయవంతంగా పూర్తి చేశామని కేంద్ర మంత్రి వెల్లడించారు. 7వ విడతలో 19 బ్లాక్స్‌ల వేలం ప్రారంభమైందన్నారు. మినరల్ ఎక్స్‌లో రేషన్ లైసెన్స్ మొదటి విడత ప్రారంభమైందని.. త్వరలోనే 11 బ్లాక్స్‌లకు రెండో విడత లైసెన్స్ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణలో 2 వెనేడియం, టైటానియం బ్లాక్స్ సిద్ధం చేసినట్లు మంత్రి ప్రకటించారు. మైనింగ్ కార్యకలాపాలను వేగవంతం చేయడం కోసం చట్టాల్లో మార్పులు తీసుకొస్తున్నామని చెప్పారు. రాష్ట్రాలు స్వతంత్రంగా వేలం నిర్వహించే అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. పర్యావరణ అనుమతుల పక్రియను సరళీకరించడం, 24 మినరల్స్‌పై కస్టమ్స్ డ్యూటీ రద్దు చేయడం, త్వరగా ఉత్పత్తి ప్రారంభించే కంపెనీలకు ప్రోత్సాహకాలు అందించడం వంటి చర్యలు తీసుకోనున్నట్లు కిషన్ రెడ్డి వివరించారు. స్క్రాప్ నుంచి మినరల్స్ రీసైక్లింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. విదేశాల్లో మైనింగ్ ప్రయత్నాలు చేపట్టామని తెలిపారు. రక్షణ రంగం, ఎలక్ట్రిక్ వెహికల్స్, గ్రీన్ ఎనర్జీకి క్రిటికల్ మినరల్స్ కీలకమని.. ప్రైవేట్ సంస్థలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. భారత్‌ను గ్లోబల్ మైనింగ్ లీడర్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# భూ పరిపాలనకు కొత్త దిక్సూచి భూభారతి

**హైదరాబాద్,ఏప్రిల్ 13 :** ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వంలో కుప్పకూలిన రెవెన్యూ వ్యవస్థను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పునర్నిర్మిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భూహక్కుల పరిరక్షణ, పారదర్శకత, అవినీతి రహిత సేవలు సామాన్యుడికి సులభంగా అందేలా గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం తెలంగాణ చరిత్రలో కీలక సంస్కరణగా నిలుస్తోందన్నారు. ఈనెల 14వ తేదీతో భూభారతి చట్టం అమలులోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి గారు అధికారులతో భూభారతి చట్టంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది కేవలం ఒక చట్టానికి ఏడాది పూర్తైన సందర్భం మాత్రమే కాదని, తెలంగాణ రాష్ట్రంలో భూహక్కుల రక్షణకు ప్రారంభమైన కొత్త శకానికి నాందిపలికిన రోజని వ్యాఖ్యానించారు. భూభారతి చట్టానికి ముందు ఆ తర్వాత ఉన్న పరిస్థితులపై అధికారులతో చర్చించారు. ఈ చట్టం తీసుకువచ్చే నాటికి ధరణి పోర్టల్ వల్ల తెలంగాణ ప్రజానీకం ఎదుర్కొన్న పరిస్థితులను ఈ సందర్భంగా మంత్రిగారు గుర్తు చేశారు. 'నాటి పరిస్థితిని పూర్తిగా మార్చాలన్న సంకల్పంతో పారదర్శకత, బాధ్యతాయుత, వేగం అనే మూడు ప్రధాన సూత్రాలతో రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు చేరువచేస్తున్నాం. ఈ క్రమంలోనే చారిత్రాత్మకమైన భూభారతి చట్టాన్ని తీసుకువచ్చాం. ఈ చట్టం రాష్ట్రంలోని భూ పరిపాలనను పారదర్శకంగా సులభంగా మార్చింది. బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో సరైన విధివిధానాలు లేకుండా తీసుకొచ్చిన 2020 ఆర్వోఆర్ చట్టం, ధరణి పోర్టల్ వల్ల లక్షలాది మంది ప్రజలు తమ భూముల హక్కుల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భూమి తమదే అయినప్పటికీ హక్కులను నిరూపించుకునేందుకు అధికారుల, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. ఆనాటి పరిస్థితులను చూసి అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలుపుతామని ఇచ్చిన మాటను నిలబెట్టుకొని గత ఏడాది ఏప్రిల్ 14న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి రోజున గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి చేతుల మీదుగా భూభారతి పోర్టల్‌ను ఆవిష్కరించుకున్నాం. తెలంగాణ రైతాంగానికి భూ భద్రత కల్పించడంలో భూభారతి ఒక బలమైన ఆయుధంగా మారింది. భూ వివాదాలకు చరమగీతం పాడుతూ, సామాన్యుడికి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే తిప్పలు తగ్గించడంలో ఈ ఏడాది కాలం ఒక గొప్ప ముందడుగుగా నిలిచింది. ఈ 12 నెలల కాలంలో భూభారతి పోర్టల్ పాత చిక్కుముడులను విప్పడంలో కీలక పాత్ర పోషించింది. ఈ పోర్టల్ ప్రారంభించిన ఏడాదిలోపే 5.20 కోట్లకు పైగా ప్రజలు ఈ పోర్టల్‌ను సందర్శించారు. సుమారు 67 లక్షల మంది పోర్టల్ ద్వారా లాగిన్ అయ్యారు. ప్రజల కోసం రెవెన్యూ శాఖ లో గణనీయమైన మార్పులు తెస్తున్నాం. రైతులకు పారదర్శకంగా సులభతరమైన సేవలు అందించడానికి రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి కేంద్ర ప్రభుత్వం సంస్థ ఎన్.ఐ.సి.తో కలిసి రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను ఈనెల 2వ తేదీ నుంచి ఐదు జిల్లాల్లోని ఐదు మండలాల్లో? ప్రయోగాత్మకంగా ప్రారంభించడం జరిగింది. ఇక్కడ ఎదురయ్యే మంచి చెడులను పరిగణనలోకి తీసుకొని అవసరమైన మార్పులు చేర్పులు చేసి వచ్చే నెలలో జిల్లాకు ఒక మండలంలో ప్రారంభిస్తాం.ఈ ఐదు మండలాల్లో కూడా ప్రతి సర్వే నెంబరుకు భూధార్ నెంబర్‌ను కేటాయిస్తాం. రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో మా ప్రభుత్వం పనిచేస్తోంది. రాష్ట్రంలో నిజాం కాలం నుంచి 378 గ్రామాలను నక్షాలు లేవు. ఇందులో ఐదు గ్రామాలలో రీ సర్వే పూర్తి చేసి భూదార్ నెంబర్ కేటాయించాం.మిగిలిన 373 గ్రామాల్లో రోవర్స్ వంటి ఆధునిక సర్వే సాంకేతికతను ఉపయోగించి రీసర్వే పనులు కొనసాగిస్తున్నాం. ఇప్పటికే 411 రోవర్లను కొనుగోలు చేశాం. త్వరలో మరో 400 కొనుగోలు చేయబోతున్నాం. భూ భారతి పోర్టల్ ప్రారంభించిన గత ఏడాది ఏప్రిల్ 14 నుంచి ఇప్పటి వరకు 3.80 లక్షల పాస్ బుక్ లు జారీచేశాం.'అని వివరించారు

# ఐటి ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగులు ఉన్నందున వారి పని వాతావరణం కేవలం కెరీర్ అభివృద్ధికి మాత్రమే పరిమితం కావాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వానికి బండి సంజయ్ కొన్ని కీలక సూచనలు చేశారు. అన్ని ప్రధాన ఐటీ కంపెనీల హెచ్‌ఆర్ బృందాలతో తక్షణ సమావేశం నిర్వహించాలని సూచించారు. ఉద్యోగుల భద్రతపై స్పష్టమైన విధానాలు రూపొందించాలని అన్నారు. ఉద్యోగుల ఫిర్యాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఏ కేసును కూడా దాచిపెట్టకూడదని చెప్పుకొచ్చారు. ఉద్యోగులు కార్యాలయాల్లో స్వేచ్ఛగా, భద్రతతో పనిచేసే వాతావరణం ఉండాలని బండి సంజయ్ కుమార్ సూచించారు. ఏ రకమైన ఒత్తిడి, వేధింపులు, దోపిడీకి అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. అలాగే, బాధితులు ఒంటరిగా ఉండకుండా వారికి తగిన రక్షణ, మద్దతు అందించాలని సూచించారు. పలువురు ఉద్యోగులు ఇప్పటికే కార్యాలయాల్లో జరిగిన అనుభవాలను సోషల్ మీడియాలో పంచుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ హెచ్చరిక సంకేతాలను ప్రభుత్వం, కంపెనీలు నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ఐటీ కంపెనీల యాజమాన్యాలు, హెచ్‌ఆర్ విభాగాలు ఉద్యోగుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని బండి సంజయ్ కుమార్ కోరారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా, వేగంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. నాసిక్ కేసు నేపథ్యంలో వచ్చిన ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా ఐటీ రంగ భద్రతపై చర్చను మరింత పెంచాయని తెలిపారు. ఉద్యోగుల రక్షణ, కార్యాలయాల్లో పారదర్శకత, ఫిర్యాదు వ్యవస్థ బలోపేతం వంటి అంశాలు ఇప్పుడు కీలకంగా మారాయని పేర్కొన్నారు.

# బిఆర్ఎస్‌తో పొత్తు ఇక్కడికే పరిమితం

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. కాంగ్రెస్ అధికారబలం ఖానాపూర్‌లో పనిచేయలేదని ఆయన పేర్కొన్నారు. తలసరి ఆదాయం ఉంటేనే అసెంబ్లీ సీట్లు పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని రాంచందర్ రావు విమర్శించారు. ఈ వ్యాఖ్యలు పేదవారిని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని అణచివేయాలనే ఉద్దేశంతో చేసినట్లుగా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ మహిళల హక్కుల గురించి మాట్లాడలేదని వ్యాఖ్యానించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బీజేపీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యంతో ఏప్రిల్ 16న మహిళా రిజర్వేషన్ కోసం ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టనుందని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు వెల్లడించారు.

# రాష్ట్రపతిని కలిసిన లోకేశ్ బృందం

(మొదటి పేజీ తరువాయి)

ఏపీ మంత్రి నారా లోకేశ్, కూటమి ఎంపీలు ముర్ముతో భేటీ అయ్యారు. అమరావతి బిల్లు చట్టరూపం దాల్చడంతో.. లోకేశ్ బృందం రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపింది. ఈ సందర్భంగా అమరావతి చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని రాష్ట్రపతికి లోకేశ్ వివరించారు. అమరావతి రాజధాని ప్రజల కల అన్నారు. ఇందుకోసం రైతులు 33 వేల ఎకరాలు ఉదారంగా ఇచ్చారని అన్నారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో జరిగిన నష్టాన్ని వివరించారు.

# 48 గంటల్లో క్షమాపణ చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. అయినప్పటికీ తన ప్రతిష్టను దెబ్బతీసేలా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం టెండర్ విలువ రూ.44.42 కోట్లేనని గుర్తుచేశారు. అందులో రూ.30 కోట్ల అవినీతి జరిగిందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది పూర్తిగా ఆధారాలు లేని ఆరోపణ అని కొట్టిపారేశారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఒక్కో మొబైల్‌ను రూ.11,650కే కొనుగోలు చేశామని వివరించారు. ఇతర రాష్ట్రాల కంటే తక్కువ ధరకు టీజీటీఎస్ ద్వారా వాటిని కొనుగోలు చేశామని వివరించారు. బీఆర్ఎస్ తన అధికారిక సోషల్ మీడియా వేదికగా తనపై చేస్తున్న దుష్ప్రచారానికి పార్టీ అధినేతగా కేసీఆరే బాధ్యత వహించాలని సీతక్క డిమాండ్ చేశారు. 48 గంటల్లో ఆయా సోషల్ మీడియాల్లో పోస్టుల ను తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే కేసీఆరే స్వయంగా క్షమాపణ చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. గతంలో కూడా తనపై ఇలాగే తప్పుడు ఆరోపణలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా కేటీఆర్ ప్రశ్నలకు తాను గట్టిగా సమాధానం చెప్పిన తర్వాతనే తనపై ఇలాంటి దాడి మొదలైందని సీతక్క గుర్తుచేశారు.

# కూల్చివేతలు ఆపండి

(మొదటి పేజీ తరువాయి)

ఏ చట్ట ప్రకారం కూల్చివేస్తున్నారో, కూల్చివేతలకు అమలు చేసే విధివిధానాలు ఏమిటో, అనుసరించే మార్గదర్శకాలు ఏమిటో తెలియజేసే వరకు కూల్చివేతలు ఆపాలని కోరింది. ప్రజావసరాలైన చెరువులు, కుంటలు, ఇతర నీటివనరులు, నాలాలు, పార్కులు, రోడ్లు వంటివి ఆక్రమణలకు గురైతే వాటి విషయంలో ముందుకు వెళ్లవచ్చని స్పష్టం చేసింది. నోటీసు ఇవ్వకుండా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన రైతు ఎంఎ షరీఫ్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై జస్టిస్ బి విజయసేన్‌రెడ్డి సోమవారం విచారించి ఈ ఉత్తర్వులను జారీ చేశారు. పది దశాబ్దాలనాటి ఆస్తిలో నిర్మాణమైన నీటి ట్యాంక్, కాంపౌండ్ వాల్ వంటివి హైడ్రా స్టాఫ్ తెల్లవారు జామున కూల్చేశారని లాయర్ చెప్పారు. సర్వే నెంబర్ 165 నుంచి 175, 212, 213లోని 36.37 ఎకరాల విషయంలో హైకోర్టు ఆర్డర్‌ను అడ్డంపెట్టుకుని మిగిలిన వెయ్యి ఎకరాలను కబ్జా చేసిన వాళ్లు కూడా అక్రమ నిర్మాణాలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని ప్రభుత్వ న్యాయవాదులు చెప్పారు.దీనిపై హైకోర్టు పిటిషనర్లు సమర్పించిన వీడియోను పరిశీలించి హైడ్రా తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీల చట్టం లేదంటే ఏ ఇతర చట్టాల కింద హైడ్రా విధులకు సంబంధించి ప్రామాణిక కార్యాచరణ విధానాలు లేదా మార్గదర్శకాలను కోర్టుకు నివేదించే వరకు కూల్చివేతలు చేయరాదని హైడ్రాను ఆదేశించింది. అంతర్గత రహదారులు, ప్రహరీ గోడల తొలగింపు వంటివి బలవంతపు చర్యలు చేపట్టరాదని కూడా ఆదేశించింది. సుప్రీం కోర్టుతో సహా ఇదే హైకోర్టు ఇచ్చిన పలు తీర్పుల్లో అక్రమ నిర్మాణాల తొలగింపుపై మార్గదర్శకాలను అమలు చేయాలన్న ఉత్తర్వులను అమలు చేయలేదని తప్పుపట్టింది. జీహెచ్ఎంసీ చట్టంలోని సెక్షన్ 374బి కింద హైడ్రాకు అధికారం దఖలైందనీ, అయితే హైడ్రా చేపట్టే చర్యలకు సరైన ప్రామాణిక విధానం ఏమిటో వందకుపైగా ఉన్న కేసుల్లో హైడ్రా హైకోర్టుకు చెప్పలేదని తేల్చింది. అందుకే ఆ విధానాలు చెప్పే వరకు కూల్చివేతలకు పాల్పడరాదని ఆదేశించింది. ఐలాపూర్ భూములకు సంబంధించి యథాతథస్థితి కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను వాయిదా వేసింది. **హైడ్రాపై హైకోర్టు ఆగ్రహం** సూరారం గ్రామం సిద్ధివినాయక నగర్‌లోని సర్వే నెంబర్ 105 పరిధిలో ఉన్న భూమి వివాదంపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ముందస్తు నోటీసులు జారీ చేయకుండా పిటిషనర్ల భూమిలోకి ప్రవేశించి పబ్లిక్ నోటీస్ బోర్డు ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. భూమి చుట్టూ ఫెన్సింగ్ వేయడం వంటి చర్యలు తీసుకోవడాన్ని ఆక్షేపించింది. ఈ విషయాలను సీరియస్‌గా పరిగణిస్తున్నట్టు ప్రకటించింది. హైడ్రా అధికారులు ఈనెల ఆరున ముందుగా నోటీసు ఇవ్వకపోగా కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా స్థలాల వద్దకు వచ్చి ఫెన్సింగ్, బోర్డులను ఏర్పాటు చేశారనీ, కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి చట్టపరమైన ప్రక్రియలను ఉల్లంఘించారని పిటిషనర్ న్యాయవాది హైకోర్టు దృష్టికి తెచ్చారు. దీనిపై హైడ్రా న్యాయవాది స్పందిస్తూ ఈ లేఅవుట్ 1978లో ఏర్పాటైందనీ, మొత్తం 102 ప్లాట్లు మాత్రమే ఉన్నాయని వివరించారు. రెండు స్థలాలు పార్కు, ప్రజావసరాలకు చెందినవి ఉన్నాయని అన్నారు. పిటిషనర్లు రెగ్యులరైజేషన్‌కు దరఖాస్తు చేసుకున్నప్పటికీ, ఆ భూమి పార్కు కోసం నిర్దేశించినది కాబట్టి దరఖాస్తును పరిగణనలోకి తీసుకోలేదని చెప్పారు. రక్షణ చర్యగా ఫెన్సింగ్ చేసినట్టు వివరణ ఇచ్చారు.

# టౌన్ లీడర్ ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నిక



**ములుగు జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 13 ( పీపుల్స్ న్యూస్):**పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ములుగు మున్సిపాలిటీల పరిధిలోని మహిళా సమైక్య సమావేశం సోమవారం ములుగు మున్సిపాలిటీ కార్యాలయంలో ఏడిఎంసి, వహిదా,ఆధ్వర్యంలో జరిగింది ఈ సమావేశంలో, టౌన్ లీడర్ ఫెడరేషన్ కు శ్రీ మొక్ష పేరు ఏర్పాటు చేసుకొని నూతన కమిటీని సమైక్య సభ్యులు ఓటింగ్ ద్వారా ఎన్నుకు న్నారు అధ్యక్షురాలుగా బండారి రజిత,ఉపాధ్యక్షుడిగా అమీనా సుల్తాన్, కార్యదర్శిగా జరీనా, కోశాధికారిగా సుంకరి హైమావతి, సహాయ కార్యదర్శిగా దాసు రాజేశ్వరి, లను ఎన్నుకున్నారు ,ఈ కార్యక్రమంలో, మహిళా సమైక్యల అధ్యక్షురాలు ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు

# రామప్ప దేవాలయం ను సందలర్శించిన తెలంగాణ పారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్





**(రామప్ప)ములుగు జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 13. (పీపుల్స్ న్యూస్)** మండలంలోని పాలంపేట గ్రామంలో గల ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప దేవాలయాన్ని సోమవారం తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ అభివృద్ధి సంస్థ(టీ జి ఎఫ్ డి సి) జనరల్ మేనేజర్ జి స్కైలాబ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమా శంకర్ లు వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్ర శిల్పకళ విశిష్టతను టూరిజం గైడ్ గోరంట్ల విజయకుమార్ వారికి వివరించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి పర్యాటక శాఖ వారి బోట్లలో బోటింగ్ చేశారు. వారి వెంట ములుగు జిల్లా ఇన్చార్జి డివిజనల్ మేనేజర్ శైలజ, భూపాలపల్లి జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ బి కరుణాకర్ రావు, వాచర్ శంకర్, టూరిస్ట్ పోలీస్ శ్రీనివాస్, దేవాదాయ, పురావస్తు, టూరిజం శాఖల సిబ్బంది ఉన్నారు

# నల్ల గుంట గ్రామంలో హిందూ సమ్మేళనం కరపత్రం ఆవిష్కరణ



**ములుగు జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 13( పీపుల్స్ న్యూస్):**సోమవారం నల్లగుంట రామాలయం వద్ద నల్లగుంట గ్రామంలో జరిగే హిందూ సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో ఆవిష్కరించడం జరిగింది హిందూ సమ్మేళనం నల్లగుంటలో 15 4 2026 బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు ఈ కార్యక్రమం ఉంటుంది ఈ కార్యక్రమానికి వెలుతుర్లపల్లె ఎల్లారెడ్డి పల్లె గ్రామాల హిందూ బంధువులందరూ కుటుంబ సభ్యులతో హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని హిందూ సమ్మేళన సమితి అధ్యక్షుడు జనగాం రవి కోరారు ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళన సమితి ఉపాధ్యక్షుడు మెరుగు మల్లయ్య కోశాధికారి కాంతాల నరసింహారెడ్డి భూక్య జవహర్ లాల్ రామగిరి శ్రీనివాస్ పిన్ రెడ్డి సంజీవరెడ్డి ఎలిగేటి రాజయ్య సంఘ సాంబయ్య మండల భాగ్యమ్మ బొజ్జం జయమ్మ మండల శ్రీదేవి మండల విద్య ఎలిగేటి కమల లు పాల్గొన్నారు

# రోడ్డు భద్రతపై పస్రా ఎస్సై తాజుద్దీన్ 'ఆరెవ్ అలైవ్

### అలెర్ట్-2026'..18 గ్రామాల్లో ప్రత్యేక సేఫ్టీ కమిటీల ఏర్పాటు.




**ములుగు జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 13( పీపుల్స్ న్యూస్):**ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో ఎస్పీ రామ్నాథ్ కేకన్ ఆదేశాలతో, డిఎస్పి కిషోర్ సూచనలతో, సిఐ పత్తిపల్లి దయాకర్ అధ్వర్యంలో పస్రా ఎస్సై తాజుద్దీన్ ప్రమాదం జరిగిన తర్వాత విలపించడం కంటే.. జరగకుండా జాగ్రత పడటమే నిజమైన విజయం అని ఎస్సై తాజుద్దీన్ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక "ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో" భాగంగా,ములుగు జిల్లా ఎస్పీ రామ్నాథ్ కేకన్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న "ఆరెవ్ అలెర్ట్ – 2026" కార్యక్రమాన్ని మండలంలో ఉద్యమంలో చేపట్టనున్నట్లు ఆయన పకటించారు. ఈ సందర్భంగా ఎస్సై తాజుద్దీన్ మాట్లాడుతూ..మీ కోసం ఎదురుమాసే కళ్ళను మర్చిపోవద్దు చట్టం మిమ్మల్ని శిక్షించకముందే.. ప్రమాదం విమ్మల్ని హెచ్చరించకముందే మేల్కొందాం! హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం పోలీసుల కోసం కాదు.. మీ కోసం ఇంట్లో ఎదురుచూసే మీ కుటుంబ సభ్యుల కోసం అని ఎస్సై భావోద్వేగంతో గుర్తు చేశారు. గ్రామీణ రోడ్లపై గజగండం – అతివేగం వద్ద గోవిందరావుపేట మండలంలోని 18 గ్రామీణ మార్గాల్లో ఆకస్మికంగా జరుగే ప్రమాదం ఉంది.వేగాన్ని నియంత్రించుకోలేక ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. "వేగాన్ని నియంత్రించండి ప్రాణాలను రక్షించండి" అని సూచించారు. ఊరికి 'సేఫ్టీ కమిటీ' – యువతకు బాధ్యతగా మండలంలోని గ్రామాల్లో ప్రత్యేకంగా 'రోడ్డు సేఫ్టీ కమిటీలను' ఏర్పాటు చేయడం విశేషం. ఇందులో సర్పంచ్ లు ఉపాధ్యాయులతో పాటు విద్యారంతులైన యువకులను భాగస్వామ్యులను చేశారు. వీరు ప్రతిరోజూ గ్రామాల్లో వాహనదారులకు అవగాహన కల్పిస్తూ 'రక్షణ కవచం'లా పనిచేస్తారని ఎస్సై తెలిపారు.నిబంధనలు అతిక్రమిస్తే 'నో ఫాస్ట్' మండల వ్యాప్తంగా వాహనదారుల వేగాన్ని నేటి నుండి మండల వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలను ముమ్మరం చేయనున్నామని, నిబంధనలు పాటించని వాహనలపై కఠిన చర్యలు ఉంటాయని, ప్రజల క్షేమమే పోలీసుల ప్రథమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. "పోలీసుల లక్ష్యం – మీ క్షేమం! అప్రమత్తంగా ఉండండి.. సురక్షితంగా ఇంటికి చేరండని తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రైని ఎస్సైలు నాగరాజు,ఎర్రయ్య,సతీష్, అంజనేయులు,ఫారెస్ట్ సిబ్బంది,గ్రామ పంచాయతీ సిబ్బంది,మండల వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్లోన్నారు.

# నేడు మంగళవారం రాయని గూడెం, సర్వాపురం, రేపు రాజుపేట, మల్లూరు గ్రామాల్లో 'ప్రజా దర్బార్' కార్యక్రమం

### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.





**ములుగు జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 13( పీపుల్స్ న్యూస్):**ములుగు మండలం రాయని గూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు, సర్వాపురం మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ సాయంత్రం 6 గంటలకు, మంగపేట మండలం రాజుపేట గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్ లో బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు, మల్లూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో సాయంత్రం 6 గంటలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆధ్వర్యం లో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కార మార్గం చూపడానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క సమక్షంలో ములుగు మండలంలోని రాయినిగూడెం సర్వపూర్, మంగపేట మండలం రాజుపేట మల్లూరు గ్రామాలలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, నాలుగు గ్రామాలకు చెందిన ఫిర్యాదుదారులు తమ స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన విన్నపాలను ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలపై దరఖాస్తులను అందజేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు.ప్రజా దర్బార్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా ఎస్ పి, డి ఎఫ్ ఓ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, ఆర్డీఓ అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని శాఖ ల ఇంజనీరింగ్ ఉన్నత అధికారులు, సంబంధత మండలాల తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీ ఓలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

# జియో కోఆర్డినేషన్ లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.









**ములుగు జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 13 (పీపుల్స్ న్యూస్):**రామచంద్రపురం భూముల సర్వేలో ఏర్పాటు చేసే జియో కోఆర్డినేషన్ లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మల్లంపల్లి మండలం రామచంద్రపురం గ్రామ శివారు లోని రాజేశ్వరరావు పల్లె లో జరుగుతున్న సర్వేను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సర్వే జరుగుతున్న తీరును, డేటా ఎంట్రీ, జియో కోఆర్డినేషన్ ఏర్పాటు పనులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రామచంద్రపురం భూముల సర్వే ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతో నిర్వహిస్తుందని జియో కోఆర్డినేషన్ ఏర్పాటు లో, సర్వే నిర్వహించడంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, తహసిల్దార్ విజయభాస్కర్ సంబధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ నూర్జన్‌కు తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఘన నివాళులు

### --- పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం తెలంగాణ రాష్ట్ర ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు సబియా



**బాలానగర్ ఏప్రిల్ 14 ( పీపుల్స్ న్యూస్):**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కూకట్‌పల్లి నియోజకవర్గంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కామ్రేడ్ నూర్జన్‌కు తెలంగాణ రాష్ట్ర ఆశా వర్కర్స్ యూనియన్ సోమవారం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్థానికంగా నిర్వహించిన ఈ స్మారక కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆమె సేవలను స్మరించుకున్నారు. నూర్జన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆశా వర్కర్స్ యూనియన్ కూకట్‌పల్లి నాయకురాలు సబియా మాట్లాడుతూ నూర్జన్ మరణం కార్మిక ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆశ, అంగన్వాడీ, బీడీ కార్మికులు, మధ్యాహ్న భోజన సిబ్బంది వంటి అట్టడుగు వర్గాల సమస్యల పరిష్కారం కోసం ఆమె జీవితాంతం అహర్నిశలు శ్రమించారని తెలిపారు. కష్టకాలాల్లో కూడా వెనుదిరగకుండా, కార్మికుల హక్కుల కోసం పోరాడిన ధైర్యవంతురాలిగా ఆమెను గుర్తుచేశారు. నూర్జన్ తన చివరి శ్వాస వరకు కార్మికుల సంక్షేమం కోసం కృషి చేశారని, ఆమె ఆశయాలను కొనసాగించడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినట్టవుతుందని సబియా అన్నారు. నేటి తరానికి ఆమె పోరాట స్ఫూర్తి మార్గదర్శకమని, సమాన హక్కులు సాధించే దిశగా అందరూ కట్టుబడి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల, సోమలత, మంజుల, పుష్ప, నజియా తదితరులు పాల్గొన్నారు.

# ఆసరా పింఛన్ల ను అర్హులైన వారికి వెంటనే మంజూరు చేయాలి

### -- డిప్యూటీ కమిషనర్. జి. ఆంజనేయులుకు వినతి...
### -- సీపీఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ డిమాండ్




**బాలానగర్ ఏప్రిల్ 14 ( పీపుల్స్ న్యూస్):**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆసరా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని సీపీఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్ పరిధిలో. మూసాపేట్ సర్కిల్ నెంబర్ 53 డిప్యూటీ కమిషనర్. జి. ఆంజనేయులుకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 1వ తేదీ నుండి10వ తేదీ వరకు "ఇంటింటి సీపీఐ" కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో భాగంగా పలు కాలనీల్లో నెలకొన్న ముఖ్య సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ప్రధాన సమస్యలను ఇందిరానగర్‌లో 50 ఏళ్లుగా నివసిస్తున్న వారికి ఇండ్ల పట్టాలు మంజూరు చేయాలి రాజీవ్ గాంధీ నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలి రాజు కాలనీ కమిటీ హాల్‌ను ఈఎస్ఐకి అప్పగించి అభివృద్ధి చేయాలి ఏవీపురంలో నీటి బిల్లులు అధికంగా వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారు. వెంటనే తగ్గించే చర్యలు తీసుకోవాలి వివిధ కాలనీలలో ప్రాథమిక సదుపాయాల లోపాలను పరిష్కరించాలి అదేవిధంగా, ఆసరా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వికలాంగులు, మహిళలు, వృద్ధులు ఇప్పటికీ పింఛన్లు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాబట్టి అర్హులైన వారందరికీ ఆలస్యం చేయకుండా వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కె. మనోచారి, జి. గంగన్న, జి. రాములు తదితరులు పాల్గొన్నారు.

# టౌన్ లీడర్ ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నిక



**ములుగు జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 13 ( పీపుల్స్ న్యూస్):**పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ములుగు మున్సిపాలిటీల పరిధిలోని మహిళా సమైక్య సమావేశం సోమవారం ములుగు మున్సిపాలిటీ కార్యాలయంలో ఏడిఎంసి, వహిదా,ఆధ్వర్యంలో జరిగింది ఈ సమావేశంలో, టౌన్ లీడర్ ఫెడరేషన్ కు శ్రీ మొక్ష పేరు ఏర్పాటు చేసుకొని నూతన కమిటీని సమైక్య సభ్యులు ఓటింగ్ ద్వారా ఎన్నుకు న్నారు అధ్యక్షురాలుగా బండారి రజిత,ఉపాధ్యక్షుడిగా అమీనా సుల్తాన్, కార్యదర్శిగా జరీనా, కోశాధికారిగా సుంకరి హైమావతి, సహాయ కార్యదర్శిగా దాసు రాజేశ్వరి, లను ఎన్నుకున్నారు ,ఈ కార్యక్రమంలో, మహిళా సమైక్యల అధ్యక్షురాలు ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు

## పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు








**ములుగు జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 13 (పీపుల్స్ న్యూస్):**ములుగు జిల్లా జంగాలపల్లి సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మరణించిన జాకారానికి చెందిన కీర్తి శంకర్ యాక్సిడెంట్లో మరణం చెందారు. ఈ విషయం తెలియగానే బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు నేడు మృతుని నివాసానికి చేరుకున్న లక్ష్మణ్ బాబు వారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. వారి అంతిమయాత్రలో పాల్గొని ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకొని, కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో కాకులమర్రి ప్రతీప్ రావు , గ్రామ శాఖ అధ్యక్షులు గంద్రత్ దామోదర్, గ్రామ సర్పంచ్ దాసరి సమతరమేష్, మాజీ ఎంపిటిసి చంద్రమౌళి, సీనియర్ నాయకులు ఈర్ల చేరాలు, పాలేపు శ్రీనివాస్,యాద శ్రీనివాస్, మామిడి చెట్టు నారాయణ, వనం ఐలుకోమురు, వార్డు సభ్యులు కొమ్మరాజు వెంకన్న, బండారి ఉమారమేష్, వనం కుమార్, నాయకులు బొచ్చు చక్రపాణి, ఒద్దుల ఐలయ్య,జెట్టి రామస్వామి,, కాలే సంపత్, కలువల శ్రీను, తోటరాజు, తోట లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

## పోడు భూముల్లో ఫారెస్ట్ దాడులు ఆపాలి

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి నాగయ్య డిమాండ్**








**ములుగు జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 13( పీపుల్స్ న్యూస్):**సిపిఎం పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశం ఏటూర్ నాగారం మండల కేంద్రంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి దావూద్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈ నాగయ్య హాజరై మాట్లాడుతూ గత వారం రోజులుగా ఫారెస్ట్ అధికారులు వలస ఆదివాసి గుడాలపై పడి దౌర్జన్యంగా సాగు భూముల్లో కందకాలు తవ్వుతున్నారని ఇదేమి పద్ధతి అని నిలదీస్తే మిమ్మల్ని ఇక్కడ నుండి వెళ్ళగొట్టి గుడిసెలు జెసిబి లతో కొలగొట్టి మీ భూముల్ని మొత్తం ఆక్రమించుకుంటామని బెదిరిస్తున్నారని నాగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఫారెస్ట్ అధికారులకు పోడు భూముల పై ఉన్న శ్రద్ధ తునికాకు మోడు నరికించడంపై లేదు కానీ కోట్లాది రూపాయలు 2020 నుండి రావలసిన తునికాకు బోనస్ ను ఫారెస్ట్ ఉన్నత అధికారులు వాళ్ళ ఖజానాల్లో పెట్టుకుంటే సిపిఎం రాష్ట్ర నాయకులు పోరాడి ఆ డబ్బులు క్రిందికి తీసుకువస్తే అట్టి డబ్బులు తునికి ఆకు సేకరణ చేసిన కూలీలకు పంచకుండా కుంభకోణం చేసి అధికారులే దండుకున్నారని(మాయం) చేశారని తునికాకు మోడెం (ప్రునింగ్) చేయకుండా చేసినట్లు లేదంటే ఎంతోకొంత చెల్లించి చేయించినట్లు నమోదు చేయించుకుంటున్నారని ఎవరైనా ప్రజాస్వామ్యవాదులు ప్రశ్నిస్తే వాటికి సంబంధించిన లిస్టు కలలేదార్ల వద్ద ఉంటుంది ఆ లిస్టులు తీసుకురండి అని బుకాయిస్తున్నారని ఫారెస్ట్ అధికారులపై మండిపడ్డారు అదేవిధంగా జాతీయ రహదారులపై ఎలాంటి టోల్గేట్స్ పెట్టే అర్హత లేకున్నా అది ఏర్పాటు చేసి కోట్లాది రూపాయలు ప్రజాధనాన్ని దండుకుంటున్నారని ఆయన అన్నారు. వెంటనే ప్రభుత్వం పునరాలోచన చేసి ఎంతవరకు అయితే సాగులో ఉందో అట్టి భూమిని వదిలేసి ట్రెంచ్ ఏర్పాటు చేసుకొని వాళ్ళని ఆందోళనకు గురి చేయొద్దని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోడు వ్యవసాయదారున్ని సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బి రెడ్డి సాంబశివ. పోదిల్లా చిట్టిబాబు. టిఎల్ రవి. ఎండి యాకూబ్. బండారి నరసింహులు. తోలెం కృష్ణయ్య. అంకుషావలి. బాలాజు రమేష్. లాజర్. రెడ్డి వెంకట్ రెడ్డి. సమ్మయ్య. దేవయ్య. గంగరాజు. సంజీవ తదితరులు పాల్గొన్నారు

## డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా నగరంలో ట్రాఫిక్ మళ్లింపులు.

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, ఏప్రిల్ 13 (పీపుల్స్ న్యూస్) :** ఓల్డ్ అంబేద్కర్ జంక్షన్ నెక్లెస్ రోడ్‌లోని అంబేద్కర్ స్క్వేర్ వద్ద నిర్వహించనున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకల దృష్ట్యా, ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తమయ్యారు. నెక్లెస్ రోడ్ , లోయర్ ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, మంగళవారం ఉదయం 10:00 గంటల నుండి రాత్రి 08:00 గంటల వరకు పరిస్థితిని బట్టి ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటాయన్నారు.ఓల్డ్ పిఎస్ సైఫాబాద్ నుండి లిబర్టీ జంక్షన్ మార్గంలో వాహనాలను అనుమతి లేదని, వీటిని ఇక్బాల్ మినార్ వద్ద రవీంద్ర భారతి వైపు మళ్లిస్తారన్నారు. ఇక్బాల్ మినార్ నుండి లిబర్టీ (అంబేద్కర్ జంక్షన్ మీదుగా మార్గంలో వాహనాలను అనుమతిలేదని, వీటిని తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ ప్రారంభం వద్ద ఫ్లైఓవర్ మీదుగా మళ్లిస్తారన్నారు. బషీర్‌బాగ్ నుండి సెక్రటేరియట్ (అంబేద్కర్ జంక్షన్ మీదుగా): ఈ వాహనాలను హోప్ హాస్పిటల్ లేన్ వద్ద క్రిస్టల్ జంక్షన్ , ఐటి జంక్షన్ మీదుగా సెక్రటేరియట్ వైపు మళ్లిస్తారన్నారు. లిబర్టీ నుండి ఓల్డ్ అంబేద్కర్ జంక్షన్ వాహనాలను అనుమతించరు. వీటిని జిహెచ్ఎంసి కార్యాలయం (బిఆర్కె భవన్ లేన్) వద్ద సెక్రటేరియట్ జంక్షన్ వైపు మళ్లిస్తారన్నారు. అప్పర్ ట్యాంక్ బండ్ నుండి లిబర్టీ: ఈ వాహనాలను అంబేద్కర్ విగ్రహం వద్ద సెక్రటేరియట్ జంక్షన్ వైపు మళ్లిస్తారన్నారు. సెక్రటేరియట్ జంక్షన్ నుండి నెక్లెస్ రోటరీ వాహనాలను అనుమతించరు. వీటిని సెక్రటేరియట్ ఈశాన్య గేటు వద్ద బనియన్ ట్రీ , సైఫాబాద్ ట్రాఫిక్ పిఎస్ వైపు మళ్లిస్తారన్నారు. వివి విగ్రహం నుండి లిబర్టీ ఈ వాహనాలను సెక్రటేరియట్ జంక్షన్ వైపు అనుమతించరు. వీటిని నెక్లెస్ రోటరీ వద్ద ఐమ్యాక్స్ సైఫాబాద్ ట్రాఫిక్ పిఎస్ ఎదురుగా, బనియన్ ట్రీ , మింట్ లేన్ వైపు మళ్లిస్తారన్నారు. రూట్ నెం. 113, 6, 83 (ఓల్డ్ సైఫాబాద్ పిఎస్ నుండి హిమాయత్‌నగర్/అబిడ్స్): ఈ బస్సులను సెక్రటేరియట్ జంక్షన్ వైపు అనుమతించరు. వీటిని ఇక్బాల్ మినార్ నుండి రవీంద్ర భారతి వైపు మళ్లిస్తారన్నారు. రూట్ నెం. 113, 6, 83 నారాయణగూడ/హిమాయత్‌నగర్ నుండి అప్పర్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వైపు అనుమతించరు. లిబర్టీ నుండి బషీర్‌బాగ్ ఫ్లైఓవర్, బిజేఆర్ విగ్రహం , ఏఆర్ పెట్రోల్ పంప్ వైపు మళ్లిస్తారు. రూట్ నెం. 7, 8ఎ (బషీర్‌బాగ్ ఫ్లైఓవర్ నుండి అప్పర్ ట్యాంక్ బండ్): వీటిని అంబేద్కర్ విగ్రహం వైపు అనుమతించరు. లిబర్టీ నుండి హిమాయత్‌నగర్ వైపు మళ్లిస్తారు. వాహనదారులు మంగళవారం ఉదయం 10:00 నుండి రాత్రి 08:00 గంటల మధ్య జంక్షన్లలో నివారించి, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని కోరారు. అంబేద్కర్ జంక్షన్, సెక్రటేరియట్ జంక్షన్, ఇక్బాల్ మినార్ జంక్షన్, ఓల్డ్ పిఎస్ జంక్షన్, నెక్లెస్ రోటరీ జంక్షన్, ఎన్టీఆర్ మార్గ్, బిఆర్కె భవన్ లేన్ , ఆదర్శ్ నగర్ రోడ్ (హిల్ ఫోర్ట్ రోడ్ వాహనదారులు తాజా ట్రాఫిక్ అప్‌డేట్ల కోసం మా సోషల్ మీడియా వేదికలను (Facebook: HYDTP, X: @HYDTP) అనుసరించాలన్నారు. ఏదైనా అత్యవసర ప్రయాణ సహాయం కోసం మా ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ 9010203626 కు కాల్ చేయవచ్చు. నగర ప్రజలు ,వాహనదారులు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులకు సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

## ఇండ్ల గణన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

**జన గణన తెలంగాణ రాష్ట్ర సంచాలకులు భారతి హోళ్ళికేరి.**






**ములుగు జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 13 (పీపుల్స్ న్యూస్):**జన గణనలో భాగంగా చేపట్టనున్న ఇండ్ల గణన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జన గణన తెలంగాణ రాష్ట్ర సంచాలకులు భారతి హోళ్ళికేరి అన్నారు.సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ఇండ్ల గణన కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర సంచాలకులు మాట్లాడుతూ జనగణన కార్యక్రమంలో భాగంగా మే 11వ తేదీ నుండి నిర్వహించే ఇండ్ల గణన ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ప్రక్రియ నిర్వహణలో భాగంగా ఇండ్ల జాబితా బ్లాక్ లను రూపొందించాలని, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం, మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయాలని తెలిపారు. ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, ఇండ్ల గణన, జనగణన జాబితా ప్రకారం అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో దోహదపడతాయని తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జన గణన కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న ఇండ్ల గణన కార్యక్రమాన్ని నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో పకడ్బందీగా చేపడతామని తెలిపారు. జిల్లాలో గుర్తించబడిన ఇండ్ల జాబితా బ్లాక్ లలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల సమన్వయంతో ఇండ్ల గణన ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందు కొరకు నియమించబడిన ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు త్వరలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో అరైవ్ - అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమం

**రోడ్డు ప్రమాదాల తగ్గింపే లక్ష్యంగా అవగాహన సదస్సులు**
**యువతను చైతన్యవంతులుగా మార్చేందుకు అన్ని శాఖలతో కలిసి సమష్టి ప్రణాళిక**





**ములుగు జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 13( పీపుల్స్ న్యూస్):**"ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా, ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కే ఖాన్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై అవగాహన పెంపు లక్ష్యంగా వివిధ గ్రామాలలో గ్రామ సభలు, రోడ్డు భద్రత కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోంది. ములుగు జిల్లా కేంద్రం లో నిర్వహించిన "అరైవ్ - అలైవ్" రోడ్డు సేఫ్టీ అవగాహన కార్యక్రమానికి ములుగు డి.ఎస్.పి కిషోర్ కుమార్, ఆర్ ఙ బి ఈ ఈ శ్యాంసింగ్, మున్సిపల్ కమిషనర్ రమేష్ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డి.ఎస్.పి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించడం, ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపు చేయడం "అరైవ్ అలైవ్" కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత కమిటీలు స్థానిక సమస్యలను గుర్తించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటాయని పేర్కొన్నారు. ప్రజల సురక్షిత ప్రయాణం కోసం జిల్లా పోలీసు శాఖ నిరంతరం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణపై వివరిస్తూ, ప్రతి ప్రమాదం ఒక కుటుంబానికి తిరిగిరాని నష్టం కలిగిస్తుందని, అందువల్ల ప్రతి వాహనదారుడు బాధ్యతతో ట్రాఫిక్ నియమాలను పాటించాల్సిన అవసరం ఉందని సూచించారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ విధానాలపై అవగాహన కల్పిస్తూ, ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు.ఆర్ ఙబి ఈ ఈ శ్యాంసింగ్ మాట్లాడుతూ వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, నిర్దేశిత వేగ పరిమితులను పాటించాలని, హెల్మెట్ సీట్ బెల్ట్ వినియోగాన్ని తప్పనిసరి చేయాలని సూచించారు.ములుగు సి ఐ సురేష్ మాట్లాడుతూ పాదచారు లకు రహదారులపై ప్రాధాన్యత ఇవ్వడం, ట్రాఫిక్ సంకేతాలను కచ్చితంగా పాటించడం అవసరమని తెలిపారు. ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో వెంటనే స్పందించి, గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందిస్తూ సమీప ఆసుపత్రికి తరలించేలా సహకరించాలని యువతకు పిలుపునిచ్చారు. ములుగు ఎస్ ఎస్హెచ్ఓ ఉపేందర్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రమాదాలకు గురయ్యే ప్రదేశాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, పాఠశాల స్థాయిలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, యువతను వాలంటీర్గా భాగస్వామ్యం చేయడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు.అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వినోద్ మాట్లాడుతూ రాత్రి సమయంలో రిఫ్లెక్టివ్ స్టికర్లు వినియోగం, ట్రాక్టర్లు వ్యవసాయ వాహనాలపై సురక్షిత చర్యలు పాటించడం వంటి కీలక అంశాలపై అవగాహన కల్పించారు.అనంతరం డీఎస్పీ రోడ్డు భద్రత పై ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ములుగు సీఐ సురేష్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వినోద్, ఎస్సైలు చంద్రశేఖర్, శ్రీనివాస్, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## గోవిందరావుపేట గ్రామ పంచాయితీ అధికారుల, పాలక వర్గ నిర్లక్ష్యం వల్ల 5 ఏండ్ల పసికందు మృతి బాధాకరం


**కుటుంబానికి ప్రభుత్వం బాధ్యత వహించాలి**
**న్యాయ విచారణ చేసి బాధ్యులను శిక్షించాలి**
**ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు**





**ములుగు జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 13 (పీపుల్స్ న్యూస్):** గోవిందరావుపేట మండల కేంద్రంలోని తారకరామ కాలనీలో నివసిస్తున్న ఇరుగు శ్రావణ్ కుటుంబాన్ని పరామర్శించిన కాకులమర్రి లక్ష్మణ్ బాబు అంగన్వాడి కేంద్రంలో చిన్నపిల్లలకు ఇచ్చే బాలామృతం( సత్తు పిండి ) లో ఇంద్రన్ గోళికలు కలిపి కోతులను చంపడం కొరకు గోవిందరావుపేట యు పి ఎస్ వెనకాల అంగన్వాడి కేంద్రం, నర్సరీ ప్రాంతంలో గోవిందరావుపేట గ్రామపంచాయితీ పాలకవర్గం పెట్టిన విష హారం తిని ఇరుగు అశ్విని నందన్ అనే నాలుగు సంవత్సరంల బాలుడు తీవ్ర అస్వస్థకు గురవడం జరిగినది.వెంటనే వరంగల్ లోని ఎంజిఎం హాస్పిటల్ కు తరలించారు అక్కడ వైద్యులు సేవలందిస్తున్నటువంటి సమయం లో రాత్రి పిల్లవాడు మరణించడం అత్యంత దారుణమైన సంఘటన చాలా బాధాకరం ఆ తల్లిదండ్రులు బాలుడి ను తలుచుకొని అత్యంత బాధాకరం తో ఏడుస్తుంటే ఆ తల్లిదండ్రు లను చూస్తే నాకు బాధ వేసింది. అశ్విన్ నందన్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు కోతులను చంపడం కూడా నేరమే వాటిని బోను ద్వారా బంధించి అడవులలో సురక్షితంగా వదలాలనే పరిజ్ఞానం కూడా లేకపోవడం చాలా దారుణమైన విషయమని ఇలాంటి సంఘటనలు సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందని ఆ బాలుడి కుటుంబానికి అధికారులు ఏం సమాధానం చెప్తారని ఈ సందర్భంగా కాకుల మర్రి లక్ష్మణ్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు బాలామృతం ఎలా వచ్చింది ఆ విష గుళికలు ఎక్కడివి అవి వాళ్ళ దగ్గరికి ఎట్లా వచ్చాయి అనే దానిమీద మంత్రి సీతక్క తన శాఖ కాబట్టి జిల్లా అధికారులు నిజం తేల్చి ఆ బాలుడి కుటుంబానికి న్యాయం చేయాలని లక్ష్మణ్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. తప్పులు జరిగినప్పుడు దాన్ని పాజిటివ్ గా తీసుకొని ఎక్కడ తప్పు జరిగిందని పరిశీలించాల్సింది పోయి మా మీదే విమర్శలు చేయడం విడ్డూరంగా ఉంది. ప్రజల కు కష్టాలు బాధలో ఉన్నప్పుడు వాళ్ళని పరామర్శించడం మా బాధ్యత దానిని కూడా రాజకీయం చేస్తున్నారని అనటం సరైన పద్ధతి కాదని రాజకీయం చేయాల్సిన అవసరం మాకు లేదని మీ బెదిరింపులకు భయపడేది లేదని కాకులమర్రి లక్ష్మణ్ బాబు అన్నారు ఇప్పటికైనా మంత్రి సీతక్క తమ శాఖలో జరిగిన దాన్ని పరిశీలించుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నాను. ఈ కార్యక్రమంలో గోవిందరావుపేట మండల పార్టీ అధ్యక్షులు లకావత్ నరసింహ నాయక్ సీనియర్ నాయకులు పెండె హేమాద్రి మాజీ ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి మహిళా అధ్యక్షురాలు బత్తుల రాణి పోరిక కిరణ్ కుమార్ గోవిందరావు పేట గ్రామ అధ్యక్షుడు అక్కినపల్లి రమేష్ కాకులమర్రి ప్రదీప్ రావు అజ్మీర సురేష్ సర్పంచ్ బానోత్ సీతారాం మాజీ సర్పంచ్ మోహన్ రాథోడ్ సన్నగుండ్ల వెంకటేశ్వర్లు ఎండి ఫక్రుద్దీన్ ఎండి బాబర్ కంపాటి కృష్ణారెడ్డి కందాల ఇంద్రారెడ్డి బొల్లం శివ గూడూరు శ్రీనివాస్ రావు మడికొండ రమేష్ చల్ల పాండు మునగాల వెంకన్న జన్ను కరుణాకర్ తదితర బీఆర్ఎస్ పార్టీ నాయకులు పరామర్శించిన వారిలో ఉన్నారు..

## అరైవ్ అలైవ్ క్యాంపెయిన్ - లో రహదారి భద్రతపై అవగాహన సదస్సు








**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, ఏప్రిల్ 13 (పీపుల్స్ న్యూస్) :** అరైవ్ అలైవ్ క్యాంపెయిన్ లో భాగంగా అమీర్ పేట లోని కమ్మ సంఘం ఫంక్షన్ హాల్ లో సోమవారం రోడ్డు భద్రతా కమిటీలు ఏర్పాటు చేసి, అమీర్ పేట్, ఎల్లారెడ్డి గూడా పంజాగుట్ట ప్రజలకు ట్రాఫిక్ రూల్స్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనడిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్-1) మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు అత్యంత అప్రమత్తత అవసరమని చెప్పారు. సీట్ బెల్ట్ ప్రాముఖ్యతను వివరించారు. ఎడమ వైపు నుండి ఓవర్‌టేక్ చేయడం ప్రమాదకరమని సూచించారు. రోడ్ సేఫ్టీ కమిటీ మెంబర్స్ కు అవగాహన కల్పించడంతో పాటు కొన్ని సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి హామీ ఇచ్చారు. ఖైరతాబాద్ జోన్ ట్రాఫిక్ ఏసిపి ఎస్. మోహన్ కుమార్ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనంపై వెళ్లే రైడర్ , వెనుక కూర్చునే వారు (పిలియన్ రైడర్) తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. డ్రైవింగ్ చేసే సమయంలో ఫోన్ వంటి సాంకేతిక పరధ్యానాలకు లోనుకావద్దని విద్యార్థులకు హితవు పలికారు.ఈ కార్యక్రమంలో పంజాగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీ రామ్ ప్రసాదరావు, ఎస్సైలు ఆంజనేయులు, మోజి రామ్, గణేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# జగన్‌వి.. శవ రాజకీయాలు.. మంత్రి అచ్చెన్నాయుడు సెటైర్లు



**అమరావతి, ఏప్రిల్13 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు () సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్ తన తండ్రి శవం పక్కన ఉండగానే ముఖ్యమంత్రి కుర్చీ కోసం సంతకాలు సేకరించిన ఘనుడని సెటైర్లు గుప్పించారు. ఆయన శవ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. (సోమవారం) మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో అచ్చెన్నాయుడు మీడి యాతో మాట్లాడారు. జగన్ రెడ్డి చరిత్ర ఈ రాష్ట్రానికి వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు.ఆ నాడు జగన్‌కు ఉన్న అధికార దాహం చూసే, ప్రజలు గత ఎన్నికల్లో 11 సీట్లు ఇచ్చి వైసీపీ అడ్రస్ గల్లంతు చేశారని అచ్చెన్నాయుడు విమర్శించారు. జనం ఆయనను ఛీత్కరించుకున్నా.. ఇంకా సిగ్గులేకుండా అమరావతిపై అబద్ధాలు, మావిగన్ అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తారా..? అని ధ్వజమెత్తారు. అమరావతిని అక్షయపాత్రగా మార్చి తమ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే.. జగన్ అండ్ కో అవినీతికి అది కామధేనువులా కనిపించడం మీ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శిం చారు. ప్రజలు పెట్టిన వాత ఇంకా పచ్చిగానే ఉందని, అది మర్చిపోయి మాట్లాడితే మళ్లీ అదే పడుతుందని అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

# వైఎస్ వివేకా హత్యకేసులో ట్విస్ట్.. మరోసారి తెలంగాణ హైకోర్టులో సునీతారెడ్డి పిటిషన్

మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యకేసులో మరో ఆసక్తికర పరిణామం జరిగింది. వివేకా కుమార్తె సునీతారెడ్డి మరోసారి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. వివేకా హత్యకేసులో సీబీఐ తదుపరి దర్యాప్తును కొనసాగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ కేసులో తదుప దర్యాప్తు అంశంపై సుప్రీం కోర్టులో విచారణ జరిగింది.. అనంతరం దర్యాప్తునకు సంబంధించిన అంశం సీబీఐ కోర్టుకు చేరింది. సీబీఐ కోర్టు సునీత రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేసింది. వివేకా హత్యకేసులో ఏ2గా ఉన్న సునీల్ యాదవ్ సోదరుడు కిరణ్ యాదవ్, వైఎస్ భాస్కరరెడ్డి సోదరుడు ప్రకాష్ రెడ్డి మనవడు అర్జున్‌రెడ్డిల మధ్య కాల్ డేటాను విశ్లేషించాలని ఆదేశించింది. ఈ కేసులో వారి పాత్రపై దర్యాప్తు చేయాలని సీబీఐకి కోర్టు 2025 డిసెంబర్‌లో ఉత్తర్వులు జారీ చేసిన సంగతి



తెలిసిందే.కోర్టు ఉత్తర్వులతో సీబీఐ దర్యాప్తు చేసి కిరణ్ యాదవ్, అర్జున్‌రెడ్డి పాత్ర లేదని మార్చిలో అనుబంధ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. అయితే సీబీఐ కోర్టు ఇచ్చిన ఉత్తర్వ?ల్ని సునీతారెడ్డి తెలంగాణ హైకో?టులో సవాల్ చేశారు.. మరోసారి పిటిషన్ దాఖలు చేశారు. వివేకా హత్యకేసులో తాను కొన్ని సందేహాలను వ్యక్తం చేశానని.. అయితే సీబీఐ దర్యాప్తులో వాటికి సమాధానం లేదన్నారు. ఈ కేసులో కొన్ని అనుమానాస్పద అంశాలను విస్మరించార ని. అయితే కొన్ని కోణాల్లో విచారణ పూర్తిగా జరగలేదన్నారు. ఈ కేసులో పలువురి పాత్రపై తనకు సందేహాలు ఉన్నాయని.. అందుకే తదుపరి దర్యాప్తు కొనసాగించేలా సీబీఐని ఆదేశించాలని పిటిషన్‌లో సునీతారెడ్డి కోర్టును కోరారు. సీబీఐ కోర్టు జారీ చేసిన ఉత్తర్వుల్ని రద్దు చేసి.. వివేకా హత్యకేసులో సందేహాలుగా ఉన్న కోణాలలో తదుపరి దర్యాప్తు కొనసాగించేలా సీబీఐని ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ చేయనుంది. సునీతారెడ్డి పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుదన్నది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ తెలంగాణ హైకోర్టు మరోసారి సీబీఐ విచారణకు ఆదేశిస్తే వైఎస్ వివేకానందరెడ్డి కేసు మరో మలుపు తిరుగుతుంది అంటున్నారు..

# ఏపీలో కొత్తగా 30 ఇండస్ట్రియల్ క్లస్టర్లు

ఆంధ్రప్రదేశ్ మీదుగా కేంద్రం మూడు ఇండస్ట్రియల్ కారిడార్లను అభివృద్ధి చేస్తోంది. విశాఖపట్నం-చెన్నై, చెన్నై-బెంగళూరు, హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్లు ఉన్నాయి. విశాఖపట్నం-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ మొదటి దశ పనులు ముగింపు దశకు చేరాయి. చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో నోడ్‌లను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. హైదరాబద్-బెంగళూరు కారిడార్ పరిధిలోని అనంతపురం, కర్నూలు జిల్లాలో పారిశ్రామిక నోడ్‌లను అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే ఈ మూడు కారిడార్ల వెంట 20 ఇండస్ట్రియల్ కస్టర్లను ప్రభుత్వం అభివృద్ధం చేసింది. వీటితో పాటుగా మరో 30 క్లస్టర్లను అభివృద్ధి చేయాలని టార్గెట్ పెట్టుకుంది.ఈ మూడు ఇండస్ట్రియల్ కారిడార్ల వెంట 30 ఇండస్ట్రియల్ కస్లర్టలను అభివృద్ధి చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న 20 క్లస్టర్లకు ఈ 30 కలిపితే 50 క్లస్టర్లు అందుబాటులోకి వస్తాయని




చెబుతున్నారు. కొత్తగా తెరపైకి తీసుకొచ్చిన ఈ 30 క్లస్టర్ల కోసం అధికారులు దాదాపు 1.31 లక్షల ఎకరాల భూమిని కూడా గుర్తించినట్లు తెలుస్తోంది. ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన క్లస్టర్లు.. శ్రీకాకుళం జిల్లాలో 2, విశాఖపట్నం జిల్లాలో 4, కృష్ణాలో 1, గుంటూరు జిల్లాలో 1, నెల్లూరు జిల్లాలో 3, తిరుపతి జిల్లాలో 5, చిత్తూరు జిల్లాలో 4, అనంతపురం జిల్లాలో 3, శ్రీసత్యసాయి జిల్లాలో 1, కడప జిల్లాలో 3, కర్నూలు జిల్లాలో 1, ప్రకాశం జిల్లాలో 2 ఉన్నాయి. ఈ ఇండస్ట్రియల్ క్లస్టర్లను పొరుగు రాష్ట్రాల్లోని ప్రధాన రాష్ట్రాలకు కనెక్ట్ చేసేలా ప్లాన్ చేస్తోంది.రాష్ట్రంలో ఈ మూడు ఇండస్ట్రియల్ కారిడార్ల వెంట దాదాపు 74,583 ఎకరాల ముంపు భూముల్ని గుర్తించి వాటిలో 27వేల ఎకరాలను సేకరించారు. తీర ప్రాంతం వెంట దాదాపు 56,608 ఎకరాలు అందుబాటులో ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది.. ఇప్పటికే 36వేల434 ఎకరాలను సేకరించింది. ముంపు ప్రాంతాల్లో 15.. తీర ప్రాంతం వెంట మరో 15 క్లస్టర్లు ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ భూముల్ని ఇండస్ట్రియల్ క్లస్టర్ల కోసం ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. ప్రధానంగా మారిటైంకు సంబంధించిన పరిశ్రమల్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ క్లస్టర్ల ఏర్పాటుపై ప్రతిపాదనల్ని కేంద్రానికి పంపారు.. కేంద్రం అవసరమైన నిధులు కేటాయించనుండగా.. కొంత వాటాను ఏపీ ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది.

# దళిత డ్రైవర్ హత్య కేసు.. కోర్టుకు ఎమ్మెల్సీ అనంతబాబు

**రాజమండ్రి, ఏప్రిల్ 13:** దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసుకు సంబంధించి వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు రాజమండ్రి జిల్లా కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసులో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీ దుర్గ ఏ2 నిందితురాలిగా ఉన్నారు. ఆమెను కేసు నుంచి తొలగించాలని కోరుతూ రాజమండ్రి జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ మేరకు ఈరోజు రాజమండ్రి జిల్లా కోర్టులో వాదనలు, ప్రతివాదనలు జరగనున్నాయి. బాధితుల తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముప్పాళ్ల సుబ్బారావు వాదనలు వినిపించనున్నారు. 2022లో దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసు సంచలనం సృష్టించింది. ఎమ్మెల్సీ అనంతబాబు ఏ1 నిందితుడిగా ఉండగా, ఆయన భార్య లక్ష్మీ దుర్గను ఏ2గా సిట్ తన సప్లిమెంటరీ చార్జ్‌షీట్‌లో చేర్చింది. హత్య తర్వాత ఆధారాలను ధ్వంసం చేయడం,



శవాన్ని డోర్ డెలివరీ చేయడంలో ఆమె పాత్ర ఉందని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆమెపై నాన్ బెయిలబుల్ వారెంట్ కూడా జారీ అయింది. లక్ష్మీ దుర్గ తనపై వచ్చిన ఆరోపణ లను ఖండిస్తూ కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాల మేరకు లక్ష్మీ దుర్గ సిట్ విచారణకు హాజరయ్యారు. తాజాగా.. ఈ కేసు నుంచి లక్ష్మీ దుర్గను తొలగించాలంటూ రాజమండ్రి జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై వాదనలు జరగనున్నాయి. కోర్టు తీర్పుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది

# విజయవాడ కలెక్టరేట్‌లో హైడ్రామా

**విజయవాడ, ఏప్రిల్13 :**

విజయవాడ కలెక్టరేట్‌లో భూసేకరణ విభా గంలో జరిగిన ఘటన తీవ్ర కలకలం రేపింది. పరిహారం కోసం వచ్చిన ఓ వృద్ధురాలు ఆగ్రహంతో ఉద్యోగులపై కారం చల్లిన సంఘటన చర్చనీయాంశమైంది. విజయవాడ కలెక్టరేట్‌లో భూసేకరణ విభాగానికి చెందిన కార్యాలయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. నందిగామ మండలం అనాసాగరం గ్రామానికి చెందిన వెలగపూడి లక్ష్మీ తులసి అనే వృద్ధురా లు తన భూమి పరిహారం కోసం కార్యాల యానికి వచ్చారు. అయితే అధికారులు సరైన స్పందన ఇవ్వలేదని భావించిన ఆమె ఒక్కసా రిగా ఆగ్రహానికి లోనై అక్కడి ఉద్యోగులపై కారం చల్లినట్లు సమాచారం. దీంతో ఉద్యోగు లు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. బాధితురాలు లక్ష్మీ తులసి తెలిపిన వివరాల ప్రకారం.. 2003లో రహదారి విస్తరణ కోసం తన భూమిని తీసుకున్నారు. ఇప్పటివరకు పరిహారం అందలేదని ఆరోపించారు. సుమారు




2 సెంట్ల 20 గజాల భూమి రోడ్డు విస్తరణలో పోయిందని తెలిపారు. దానికి రూ.24 లక్షలు పరిహారం రావాల్సి ఉందని చెప్పారు.భూసేకరణ విభాగం అధికారులు బాధితురాలిని పిలిపించి మాట్లాడారు. రికార్డులను పరిశీలించిన అనంతరం, ఈ భూమి పరిహారం వ్యవహారం జాతీయ రహదారుల సంస్థకు సంబంధించినదని తెలిపారు. అందువల్ల తమ పరిధిలోకి ఈ కేసు రాదని, సంబంధిత జాతీయ రహదారుల సంస్థ అధికారులను సంప్రదించాలని సూచించారు.

# డీ-రెగ్యులేషన్ ఫేజ్-3పై ముందస్తు చర్చలు..

**అమరావతి, ఏప్రిల్13 :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం) సచివాలయంలో స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని కేంద్ర ప్రతినిధి బృందంతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చి ంచారు. కేంద్ర ప్రతిపాదిత డీ-రెగ్యులేషన్ ఫేజ్ -2 విధానాలపై సీఎం సమీక్షించారు. పరిశ్ర మల ఏర్పాటులో వేగం, అనుమతుల్లో సులబ తరం, అనవసరపు పర్మిషన్ల నియంత్రణపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ప్రతిపాదనలను సీఎం ముందు స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ ఉంచారు. స్టీల్ సెక్రటరీ ప్రతిపాదనలపై రాష్ట్రానికి చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారులతోనూ సీఎం సమీక్షించారు. 800కు పైగా ఉన్న నిబంధనలను 100లోపునకు తీసుకురావాలని సీఎస్ సహా



వివిధ శాఖల ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు.పర్మిషన్లు, లైసెన్సులను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేయాలి..పర్మిషన్లు, లైసెన్సులను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేయాలని సీఎం చంద్రబాబు మార్గనిర్దేశం చేశారు. ప్రజల భద్రత, పర్యావరణం వంటి అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. వేధింపులు లేకుండా థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. అటవీ చట్టాలను వీలైనంత మేరకు సరళీకరిం చాలని కేంద్ర బృందానికి సూచించారు. ఫైర్ సేఫ్టీకి సంబంధించి నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్ర నిబంధనలు పెట్టాలని ఆదేశించారు. డబుల్ లైసెన్సింగ్ తరహా పద్ధతులను తప్పించాలని దిశానిర్దేశం చేశారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే జీవిత కాలం చెల్లుబాటు కావాలని సూచించారు. మే నెలాఖరులోగా డీరెగ్యులేషన్ ఫేజ్-2 అమల్లోకి వచ్చేలా చూడాలని.. ఆ మేరకు ఆర్డినెన్సులు తీసుకురావాలని దిశానిర్దేశం చేశారు.దరఖాస్తు ప్రక్రియను ఆన్‌లైన్ చేయాలి.దరఖాస్తు నుంచి అనుమతుల వరకూ మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రజలకు సేవలు అందించడం కోసం స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానాన్ని అవలంబిస్తున్నట్లు సీఎం స్పష్టం చేశారు. డీ-రెగ్యులేషన్ ఫేజ్-3ను చేపడుతున్నారా అని స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్‌ను అడిగారు. జూన్ నుంచి ఫేజ్-3పై పని చేస్తామని సందీప్ పౌండ్రిక్ చెప్పారు. ఫేజ్-3లో టెక్నాలజీ అనుసంధానం, ఏఐ టూల్స్ వినియోగానికి పెద్దపీట వేయాలని స్టీల్ సెక్రటరీకి సీఎం సూచించారు. డేటా లేక్, రియల్ టైం డేటా, సీఎఫ్ఎంఎస్, అవేర్-2.0, వాట్సాప్ గవర్నెన్స్ వంటి వ్యవస్థలను తాము వినియోగిస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# రామతీర్థం ఘటనలో కీలక పరిణామం - ధ్వంసమైన పురాతన విగ్రహాలు గోదావరిలో నిమజ్జనం

**విజయనగరం జిల్లా:** ఉత్తరాంధ్రలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రామతీర్థంలో ధ్వంసమైన పురాతన రాముడి విగ్రహంతో పాటు సీతాదేవి, లక్ష్మణుడి విగ్రహాలను నిమజ్జన (జలాధివాసం) చేయనున్నారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం రామతీర్థంలోని నీలాచల పర్వతం (బోడి కొండ)పై వెలిసిన కోదండ రామస్వామి ఆలయంలో ఆరేళ్ల కిందట దుండగుల దాడిలో ఈ పురాతన విగ్రహాలు ధ్వంసమైన విషయం తెలిసిందే. ధ్వంసమైన రాముడి విగ్రహంతో పాటు సీతాదేవి, లక్ష్మణుడి విగ్రహాలను వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం నేడు (సోమవారం) సాయంత్రం 4.48 గంటలకు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కోటిపల్లిలోని గోదావరి తీరంలో నిమజ్జనం చేయనున్నారు. రామతీర్థంలోని ఆలయంలో రాముడి విగ్రహాన్ని వైఎస్సార్సీపీ హయాంలో 2020 డిసెంబరు 28న అర్ధరాత్రి దుండగులు ధ్వంసం చేశారు. దీనిపై కేసులు నమోదై, న్యాయస్థానంలో విచారణ కొనసాగుతోంది. అనంతరం టీటీడీ ఎస్వీ శిల్ప ఉత్పత్తి కేంద్రంలో తయారు చేయించిన నూతన విగ్రహాలను రామతీర్థంలో



పునఃప్రతిష్ఠించారు. ఆగమశాస్త్రం ప్రకారం ధ్వంసమైన విగ్రహాలు ఏ ఆలయంలోనూ ఉంచకూడదు. అయితే, కేసు విచారణలో భాగంగా రాముడి ప్రతిమ శిరస్సు భాగం న్యాయస్థానానికి పోలీసులు సమర్పించారు. రెండు భాగాలు ఉంటేనే నిమజ్జనం చేయడం కుదురుతుంది.రామతీర్థం ఘటనలో కీలక పరిణామం -ధ్వంస మైన విగ్రహాల నిమజ్జనానికి వారం కిందట అనుమతిచ్చింది. దీంతో నిమజ్జనాన్ని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించాలని దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశించారు. ప్రత్యేకంగా వాహనంలో ఊరేగింపుగా : ఈ నేపథ్యంలో విగ్రహాలను రామతీర్థం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన వాహన ంలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. రామ తీర్థం నుంచి విజయనగరం పైడితల్లి అమ్మవారి ఆలయం, తర్వాత సింహా చలం, అనకాపల్లి నూకాంబిక, అన్నవ రం వీరవెంకట సత్యనారాయణ, పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి, ద్రాక్షారామ ఛాయా సోమేశ్వరస్వామి ఆలయాల మీదుగా వీటిని తీసుకెళ్లి, మధ్యాహ్నం 3.45 గంటలకు చేరుకుంటారు. సాయంకాలం 4.48 గంటలకు విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేస్తారు.రామతీర్థంలో నీలాచలం కొండపై దుండగుల ధ్వంసం చేసిన శ్రీ కోదండ రామస్వామి వారి శిలా విగ్రహం శిరస్సు, ఇతర విగ్రహాల తరలింపు, వీడ్కోల కార్యక్రమానికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరయ్యారు. విగ్రహాలను దర్శించుకుని పూజాది కార్యక్రమాలతో వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటూ నెల్లిమర్ల, ఎచ్చెర్ల ఎమ్మెల్యేలు లోకం నాగమధవి, ఈశ్వరరావు, పలువురు కూటమి నేతలు, పెద్దఎత్తున స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.200 ఆలయాల్లో విధ్వంసం : ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి మాట్లాడుతూ, భారత దేశంలో కుల, మతాలకు అతీతంగా ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలుంటాయన్నారు. అన్ని మతాల వారు, ఒకరినొకరు గౌరవించుకుం టారని తెలిపారు. అలాటింది వైఎస్సార్సీపీ హయాంలో రాష్ట్రంలో 200 ఆలయాల్లో విధ్వంసం జరిగిందన్నారు. రామతీర్థంలోని శ్రీరాముడి శిరచ్ఛేదన ఘటన దేశ వ్యాప్తంగా భారతీయులను కలచివేసిందన్నారుఅలాంటి ఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి కొండపల్లి తెలిపారు. అదేవిధంగా, ఆలయాల అభివృద్ధి, పునరుద్ధరణకూ చర్యలు చేపట్టామ న్నారు. ఈ కార్యక్రమాలతో పాటు, వైఎస్సార్సీపీ హయాంలో ధ్వంసం అయిన విగ్రహాలు, ఇతరత్రా వాటిని శాస్త్రోక్తంగా నిమజ్జనం చేస్తున్నామన్నారు. అందులో భాగంగా సీఎం చంద్రబాబు సూచనల మేరకు రామతీర్థంలోని సీతారాముల విగ్రహాలను గోదావరి నదిలో నిమజ్జన కార్యక్రమం చేపట్టామని తెలిపారు.

# ముగిసిన దుర్గగుడి పాలకమండలి సమావేశం.. 37 అంశాలపై చర్చ

**విజయవాడ, ఏప్రిల్ 13:** దుర్గగుడి పాలక మండలి సమావేశం ముగిసింది. ఈ సమా వేశంలో 37 అంశాలపై ప్రధానంగా చర్చ జరిగి ంది. అనంతరం దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ మీడియాతో మాట్లాడుతూ.. భక్తుల కు కల్పించాల్సిన మెరుగైన సౌకర్యాలపై ప్రధా నంగా చర్చించామని తెలిపారు. ఆలయంతో పాటు క్యూలైన్లలోనూ భక్తుల కోసం టీవీలు పెట్టి అమ్మవారి పూజా కార్యక్రమాలు వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయిం చామన్నారు. టీవీలు ఇచ్చేందుకు దాతలు ముందుకొచ్చారని వెల్లడించారు. ఉద్యోగుల ఆరోగ్యరీత్యా ఓ హాస్పిటల్‌తో ఎంవోయూ చేసుకోబోతున్నామని చెప్పారు. కనకదుర్గా నగర్‌లో మరుగుదొడ్ల గంజాయి బ్యాచ్ వాడుతున్నారని తెలిసిందని.. ఇకపై అలా జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోబోతున్నా మని తెలిపారు. అమ్మవారికి 234 ఎకరాలు ఉన్నాయని. కొన్ని చోట్ల కౌలు జరగడం లేదని.. మరికొన్ని చోట్ల అన్యాక్రాంతమైనట్లు గుర్తించామన్నారు. వాటిపైన ఏం చేయాలనే అంశంపై చర్చించామని దుర్గగుడి చైర్మన్ రాధా కృష్ణ పేర్కొన్నారు.అన్నివిధాలుగా దుర్గగుడి అభివృద్ధి: ఈవోఇంద్రకీలాద్రిపై భక్తులకు



క్యూలైన్లలో ఇబ్బందులు తెలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నిర్ణయించామని ఈవో శీనానాయక్ తెలిపారు. దుర్గగుడి అన్నివిధాలా అభివృద్ధి చెందాలన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని నిర్ణయించినట్లు చెప్పారు. భూములను కౌలుకు ఇవ్వాలని నిర్ణయించామ న్నారు. జూన్ నాటికి లడ్డూపోటు, అన్నదానం ప్రారంభిస్తామన్నారు. మాస్టర్ ప్లాన్‌కు అను గుణంగానే ఇంద్రకీలాద్రిపై అభివృద్ధి పనులు జరుగుతున్నాయని శీనానాయక్ వెల్లడించారు.

# బంగాల్ ఎన్నికల ఫలితాన్ని డిసైడ్ చేసే స్థానాలివే! మరి హాట్ సీట్లలో గెలుపెవరిదో



**బంగాల్:** బంగాల్‌లో మొత్తం 294 అసెంబ్లీ స్థానాలు ఉన్నప్పటికీ, ఎన్నికల ఫలితాన్ని 65 నుంచి 70 సీట్లే డిసైడ్ చేయనున్నాయి. 2021 ఎన్నికల్లో అతి స్వల్ప ఆధిక్యాలు వచ్చిన స్థానాలు, ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భారీగా ఓటర్ల పేర్ల తొలగింపు జరిగిన సీట్లు అత్యంత కీలకంగా మారనున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఎవరు ఏర్పాటు చేస్తారు అనేది 11 జిల్లాల్లోని ఈ 70 స్థానాలే నిర్ణయించనున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ పోటీచేసే భవానీపుర్, బీజేపీ కీలక నేత సువేందు అధికారి పోటీచేసే నందిగ్రామ్ కూడా ఈ సీట్ల జాబితాలో ఉన్నాయి. 2021 పోల్స్‌లో ఈ 70 సీట్లలో అభ్యర్థులు 1,000 నుంచి 8,000 ఓట్ల స్వల్ప తేడాతో అతి కష్టం మీద గెలిచారు. చివరకు 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ ఈ అసెంబ్లీ సీట్లలో ఓట్ల ఆధిక్యం సగటున 8,000 నుంచి 15,000 ఓట్లకే పరిమితమైంది. తాజాగా ఎస్ఐఆర్ ప్రక్రియలో ఈ స్థానాల్లో గత ఎన్నికల మెజారిటీ ఓట్లను మించిన రేంజులో ఓటర్ల పేర్లు డిలీట్ అయ్యాయి. ఈ నేపథ్యంలో కీలకమైన 65 నుంచి 70 సీట్లలో ఎలాంటి ఫలితాలు వస్తాయి? అత్యధికంగా ఓటర్ల పేర్లు గల్లంతైన స్థానాలేవి? ఈ పరిణామాలు టీఎంసీ, బీజేపీలలో ఎవరికి కలిసొస్తాయి? ఈ కథనంలో తెలుసుకుందాం. ఆ సీట్లలో బీజేపీ జం టీఎంసీ 2021 బంగాల్ ఎన్నికల్లో టీఎంసీ 213 అసెంబ్లీ సీట్లు సాధించి అధికార పీఠాన్ని కైవసం చేసుకుంది. బీజేపీ 77 సీట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఈ ఎన్నికల్లో టీఎంసీ అంతకంటే ఎక్కువ సీట్లను సాధిస్తుందని సీఎం మమతా బెనర్జీ విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఈసారి బీజేపీ 170కిపైగా సీట్లను సాధిస్తుందని పార్టీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ధీమాగా చెబుతున్నారు. 2021 ఎన్నికల్లో స్వల్ప తేడాతో అభ్యర్థులు గెల్చిన సీట్లు, ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్ల పేర్ల తొలగింపు భారీగా జరిగిన సీట్లపై ఈ రెండు పార్టీలు ప్రత్యేక ఫోకస్ పెడుతున్నాయి. సర్వశక్తులతో ఆయాచోట్ల హోరాహోరీగా తలపడుతున్నాయి. ఉత్తర 24 పరగణాలలోని మతువా ప్రాంతం, మైనారిటీలు అధికంగా ఉన్న ముర్షిదాబాద్, మాల్దా వంటి ప్రాంతాల్లోని అసెంబ్లీ సీట్లలో రసవత్తర పోరు జరుగుతోంది. 27.16 లక్షల ఓటర్ల పేర్ల తొలగింపుఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ఏప్రిల్ 7 వరకు బంగాల్ రాష్ట్రవ్యాప్తంగా 90.83 లక్షలకుపైగా ఓటర్ల పేర్లను తొలగించారు. ఇది 2025 అక్టోబర్‌లో ఎన్నికల సంఘం గుర్తించిన ఓటర్లలో దాదాపు 11.85 శాతానికి సమానం. వీటిలో దాదాపు 27.16 లక్షల ఓటర్ల పేర్ల తొలగింపులు కేవలం అడ్ జుడికేషన్ (న్యాయ పరిశీలన) కేటగిరీ నుంచే వచ్చాయి. అనుమానాస్పదంగా ఉన్న, సరైన పత్రాలు లేని దాదాపు 60 లక్షల మంది ఓటర్ల పేర్లను అడ్ జుడికేషన్ అనే ప్రత్యేక కేటగిరీ కింద ఉంచారు. న్యాయ అధికారులు ఈ 60 లక్షల మంది దరఖాస్తులను, పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. న్యాయ పరిశీలన పూర్తయిన తర్వాత, సుమారు 32.68 లక్షల మందిని అర్హులైన ఓటర్లుగా గుర్తించి ఓటర్ల జాబితాలో కొనసాగించారు. కానీ, మిగిలిన 27.16 లక్షల మంది ఓటర్ల పత్రాలు చెల్లుబాటు కాకపోవడంతో లేదా అనర్హులుగా తేలడంతో వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. ఎస్ఐఆర్‌తో ప్రభావితమైన 70 సీట్లుఓటర్ల పేర్ల తొలగింపుల్లో ఎక్కువ భాగం బంగాల్‌లోని 11 జిల్లాల్లో ఉన్న 70 అసెంబ్లీ స్థానాల పరిధిలో జరిగినట్లు తెలుస్తోంది. వీటిలో 25 స్థానాలు కోల్‌కతా మహానగరం, దాన్ని ఆనుకొని ఉన్న ఉత్తర 24 పరగణాలు, హావ్?డా, హుగ్లీ జిల్లాల పరిధిలోనే ఉండటం గమనార్హం. మిగిలిన అసెంబ్లీ స్థానాలు ముర్షిదాబాద్, మాల్దా, బంకురా, పురూలియా జిల్లాలతో పాటు రెండు బర్ధమాన్ జిల్లాలు, రెండు మేదినీపుర్ జిల్లాల పరిధిలో ఉన్నాయి. ఒక్క ఉత్తర 24 పరగణాల జిల్లాలోనే 13 సీట్లు, ముర్షిదాబాద్ జిల్లాలో 10 సీట్లు, బంకురా, పురూలియా జిల్లాల్లో 9 సీట్లు, హావ్?ఢా, హుగ్లీ జిల్లాల్లో 8 సీట్లు, రెండు మేదినీపుర్, రెండు బర్ధమాన్ జిల్లాల్లో మరో 8 సీట్లు ఉన్నాయి.

## బిహార్ నూతన సీఎంగా సామ్రాట్ చౌదరి.



**బిహార్ :** నూతన సీఎంగా బీజేపీ నేత సామ్రాట్ చౌదరి ఎన్నికయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాజ్యసభకు ఎంపికైన నితీష్ కుమార్ తన సీఎం పదవికి రాజీనామా చేయబోతున్నారు. ఆయన తర్వాత ఎన్‌డీయే కూటమి నుంచి బీజేపీ నేత సీఎంగా ఎన్నికవుతారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. నితీష్ తర్వాత బీజేపీ సీనియర్ నేత, ప్రస్తుత డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి సీఎంగా ఎన్నికవుతారు.

నితీష్ కుమార్ మంగళవారం, ఏప్రిల్ 14న ఉదయం 11 గంటలకు క్యాబినెట్ మీటింగ్ నిర్వహించబోతున్నారు. పాట్నాలో జరిగే ఈ సమావేశం అనంతరం ఆయన తన సీఎం పదవికి రాజీనామా చేస్తారు. అనంతరం ఎన్‌డీయే లెజిస్లేటర్ల సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో ఎన్‌డీయే నూతన లెజిస్లేచర్ పార్టీ నేతను ఎన్నుకుంటారు. ఆ నేత బిహార్ సీఎంగా ఎన్నికవుతారు. అయితే, సీఎం పదవికోసం అందరిలోకి ఎక్కువగా వినిపిస్తున్న పేరు సామ్రాట్ చౌదరి. ఆయన బీజేపీలో సీనియర్ నేత. ప్రస్తుత బిహార్ డీసీఎం. 2023లో బిహార్ బీజేపీ అధ్యక్షుడయ్యారు. ఆ తర్వాత కొంతకాలానికి డిప్యూటీ సీఎం అయ్యారు. ఓబీసీలోని కొయేరి సామాజికవర్గానికి చెందిన సామ్రాట్ చౌదరినే బీజేపీ అధిష్టానం సీఎంగా ఎంపిక చేసిందని తెలుస్తోంది. ఇంతకాలం ఎన్‌డీయే కూటమిలో కీలకంగా ఉన్న జేడీయూ అధినేత నితీష్ కుమార్ సీఎంగా కొనసాగారు. ఆయన రాజ్యసభకు వెళ్తుండటంతో ఇప్పుడు రాష్ట్రానికి బీజేపీ తరఫున సీఎం పదవి చేపడుతారు.

మంగళవారం బీజేఎల్పీ సమావేశం కూడా జరగనుంది. ఈ సమావేశంలో సామ్రాట్ చౌదరి ఎంపికను ప్రకటించే అవకాశం ఉంది. ఈ ప్రక్రియకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పరిశీలకుడిగా వ్యవహరిస్తున్నారు. పార్టీ నుంచి సామ్రాట్ విషయంలో ఎలాంటి అభ్యంతరాలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆయనదే. ఏప్రిల్ 14న నితీష్ గవర్నర్‌కు రాజీనామా సమర్పిస్తే.. 15న సామ్రాట్ చౌదరి సీఎం పదవి చేపడతారు. ఈ కార్యక్రమం చాలా ఘనంగా జరగనుంది. దీనికి ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా హాజరవుతారు.

## సిమెంట్ మిక్సర్ వెహికల్‌ను ఢీకొన్న ఈకో వ్యాన్.. 11 మంది మృతి



**మహారాష్ట్ర :** మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న ఒక సిమెంట్ మిక్సర్ వాహనాన్ని ప్రయాణికులతో వెళ్తున్న ఈకో వ్యాన్ ఢీకొన్న ఘటనలో 11 మంది మరణించారు. మరికొందరు గాయపడ్డారు. ఈ ఘటన థానే జిల్లా, కల్యాణ్-ముర్బాద్ నేషనల్ హైవే 61పై, గోవిలి గ్రామ సమీపంలోని రైతా బ్రిడ్జి వద్ద సోమవారం ఉద యం జరిగింది. 10.45 గంటల సమయంలో ఈకో వ్యాన్ కొంతమంది ప్రయాణికులతో కల్యాణ్ నుంచి ముర్బాద్ వెళ్తోంది. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న సిమెంట్ మిక్సర్ వాహనాన్ని వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో ఐదుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మరణించారు. మిగతా ఆరుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఇంకా పలువురు గాయపడ్డారు. ఘటన సమాచారం అందుకున్న స్థానికులు, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రుల్ని సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఎనిమిది మంది పురుషులు ఉన్నారు. వీరిలో ఇద్దరు కాలేజీ విద్యార్థులు కూడా ఉన్నారు. ఘటన జరిగిన ప్రదేశంలో దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి. రెండు వాహనాలు ఒకదానిలోకి ఒకటి చొచ్చుకుపో యాయి. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు గుజరాత్‌లో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మరణించారు. రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న యాత్రికులపైకి ఓ ట్రక్కు అదుపుతప్పి దూసుకెళ్లింది. ఈ ఘటన లో ఏడుగురు అక్కడికక్కడే మరణించారు.

# మహిళా రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదు రాజకీయ లబ్ధి కోసమే మోదీ సర్కార్ అలా చేస్తోంది



**కర్ణాటక:** మహిళా రిజర్వేషన్ల చట్టం గురించి చర్చి ంచేందుకు ఏప్రిల్ 15న తమ పార్టీ ఒక అఖిల పక్ష సమావేశం నిర్వహిస్తుందని కాంగ్రెస్ అధ్య క్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఈ బిల్లుపై సంబంధిత వర్గాలన్నింటితోనూ సమగ్ర సంప్ర దింపులు జరపడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల చట్టా నికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. అయితే జాతీయ స్థాయిలో దీని ప్రభావం విస్తృతంగా ఉన్నందున, మహిళా రిజర్వేషన్ల చట్టం అమలుపై విస్తృత చర్చలు జరగాల్సిన అవసరం ఉందని అభిప్రా యపడ్డారు. మహిళా రిజర్వేషన్ల చట్టానికి తమ పార్టీ వ్యతిరేకం కాదని వెల్లడించారు. కర్ణాటక లోని బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. "మహిళా రిజర్వేషన్ల చట్టంపై చర్చించేందుకు కేంద్రం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ పార్టీ పాల్గొంటుంది. తగు సూచనలను అందిస్తుంది. కానీ కేంద్రం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడానికి సిద్ధంగా లేదు. అందుకే మేము ఏప్రిల్ 15న అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహి స్తున్నాం. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తూనే ఉంది. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని వ్యతిరేకిస్తున్నామని చేస్తున్న ఆరోపణలు అవాస్తవం. అంతేకాకుండా నారీ శక్తి వందన్ అధినియంకు మేం వ్యతిరేకం కాదు. పార్లమెంట్‌లో ఇది ఏకగ్రీవంగా ఆమో దించిన చట్టం. మోదీ సర్కార్ కేవలం ఈ చట్టం ద్వారా రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తో ంది. మేము ఇప్పటికే పంచాయతీలు, జిల్లా పరిషత్తులు, కార్పొరేషన్లలో ఈ చట్టాన్ని దీనిని అమలు చేశాము. కాబట్టి మాకు ఎవరూ నీతు లు చెప్పాల్సిన అవసరం లేదు. దేశానికి సంబ ంధించిన ఒక నిర్ణయం తీసుకున్నప్పుడు, దానికి విస్తృతమైన పర్యవసానాలు ఉంటాయి.'--మల్లికార్జు న ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడుమోదీ సర్కార్‌పై సోనియా రిజర్వేషన్ల చట్టం కంటే నియోజకవర్గాల పునర్విభజనే అత్యంత ముఖ్యమైన అంశమన్నా రు. నియోజకవర్గాల పునర్విభజన అత్యంత ప్రమాదకరమైనదిగా అభివర్ణించారు. 'తమిళనాడు, బంగాల్‌లో ఎన్నికల ప్రచారం ఉధృతంగా సాగుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని చూస్తోంది. బలవంతంగా ఆమోదింపజేయాలన ుకుంటున్న బిల్లులకు మద్దతు ఇవ్వాలని ప్రధాని మోదీ ప్రతిపక్ష పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ తొందరపా టుకు ఒక కారణం ఉంది. రాజకీయ లబ్ధి పొందడం కోసం, ప్రతిపక్షాన్ని ఆత్మరక్షణలో పడేయడం కోసమే మోదీ ఇలా చేస్తున్నారు. ప్రధాని మోదీ ఎప్పటిలాగే నిజాన్ని దాచిపెడు తున్నారు. మహిళా రిజర్వేషన్ చట్టం సవరణలపై చర్చించడానికి బంగాల్ చివరి దశ ఎన్నికలు (ఏప్రిల్ 29) ముగిసిన తర్వాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ విపక్ష నేతలు ప్రభుత్వానికి ఏకంగా మూడుసార్లు లేఖలు రాశారు. కానీ మోదీ సర్కార్ విపక్షాల అభ్యర్థనను తిరస్కరించింది. అందుకు బదులుగా ప్రధానమంత్రి సంపాదకీయాలు రాయడం, రాజకీయ పార్టీలకు విజ్ఞప్తులు చేయడం, ఇతర సమావేశాలు నిర్వహించడం వంటివి చేస్తున్నారు. నిర్ణయాలు తీసుకునే విషయంలో తన మాటే నెగ్గాలి అన్నట్లు మోదీ వ్యహరిస్తున్నారు. నారీ శక్తి వందన అధినియం సవరణ బిల్లును పార్లమెంట్ స్పెషల్ సెషన్‌లో కాకుండా పార్లమెంట్ వర్షా కాల సమావేశంలోనే తీసుకురావాలని కోరు తున్నాను." అని సోనియా గాంధీ పేర్కొన్నారు.

# పోలింగ్ కేంద్రాల్లో బయోమెట్రిక్స్ అమలుపై పిల్- కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు



ఎన్నికల నిర్వహణ విషయంలో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. దొంగ ఓట్లను అరి కట్టేందుకు పోలింగ్ కేంద్రాల్లో ఫింగర్ ప్రింట్, ఐరిస్ బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థను అమలు చేయాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణను చేపట్టేందుకు సోమవారం సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ మేరకు కేంద్రం, ఎన్నిక సంఘానికి నోటీసులు జారీ చేసింది. జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీతో కూడిన ధర్మాసనం ఆ అంశం పై విచారణ చేపట్టింది. అయితే ప్రస్తుత జరుగుతున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ఈ విధానం అమలు చేయలేమని స్పష్టం చేసింది. తదుపరి పార్లమెంట్ లేదా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందు ఈ విధానాన్ని అమలు చేయాలా అనే అంశాన్ని పరిశీలించాల్సి ఉందని ధర్మాసనం పేర్కొంది. ఈ విధానం అమలు చేయాలంటే నిబంధనల్లో మార్పులు అవసరమవుతాయని, అలాగే ప్రభుత్వ ఖజానాపై భారీ ఆర్థిక భారం పడుతుందని తెలిపింది. ఈ అంశంపై తమ స్పందన తెలియజేయాలంటూ కేంద్రం, ఈసీతో పాటు పలు రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. నిష్పాక్షిక ఎన్నికల కోసం బయోమెట్రిక్‌ఈ పిటిషన్‌ను న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేశారు. ఓటింగ్ ప్రక్రియలో అవినీతి, అనుచిత ప్రభావం, నకిలీ, డూప్లికే టు ఓట్లు వంటి సమస్యలు ఇంకా కొనసా గుతున్నాయని పిటిషన్?లో పేర్కొన్నారు. ఇవి ఎన్నికల స్వచ్ఛత, విశ్వసనీయతను దెబ్బతీ స్తున్నాయని చెప్పారు. ఆర్టికల్ 324 కింద ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పూర్తి అధికారాలు ఈసీకి ఉన్నాయని తెలిపారు. ఈ అధికారం ఈసీకి ఉందని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో బయోమెట్రిక్ ధృవీకరణ ఉంటే నిజమైన ఓటర్లు మాత్రమే ఓటు వేయగలరని చెప్పారు. దీంతో ఒక పౌరుడు-- ఒక ఓటు అనే సూత్రం కచ్చితంగా అమలు అవుతుందని వాదించారు. ఈ విధానాన్ని ముఖ్యంగా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అమలు చేయాలని ఈసీఐని ఆదేశించాలని సుప్రీంకోర్టును కోరారు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఓటర్ ఐడీ కార్డులు, మాన్యువల్ వెరిఫికేషన్ విధానాల్లో పాత ఫోటోలు, డేటా పొరపాట్లు, రియల్ టైమ్ ధ్రువీకరణ లేకపోవడం వంటి లోపాలు ఉన్నాయని పిటిషన్‌లో అశ్విని కుమార్ పేర్కొన్నారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1950లోని సెక్షన్ 23(4) కింద ఆధార్ ఆధారిత గుర్తింపును ఇప్పటికే చెల్లుబాటు అయ్యే గుర్తింపు రుజువుగా గుర్తించారని తెలిపారు. అదే తరహాలో పోలింగ్ కేంద్రాలలో బయోమెట్రిక్ ధృవీకరణను అమలు చేయవచ్చని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో వేలిముద్ర, ఐరిస్ ఆధారిత బయోమెట్రిక్?ను అమలు చేయాలని కోరుతూ, 2026 మార్చి 28వ తేదీన సీఈసీ, ఎన్నికల కమిషనర్లకు ఒక వినతి పత్రం సమర్పించినట్లు పిటిషనర్ పేర్కొన్నారు. అయితే దీనిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఈ పిల్?ను దాఖలు చేశారు.'బయోమెట్రిక్ హాజరు వ్యవస్థ అమలు చట్టబద్ధమే'

## టీఎంసీలో చేరిన నేతాజీ మునిమనుమడు



**న్యూఢిల్లీ:** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ మునిమనుమడు చంద్ర కుమార్ బోస్ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ చేరారు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఆయన టీఎంసీలో చేరడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయన 2023లో సైద్ధాంతిక వైరుధ్యాల కారణంగా బీజేపీ నుంచి వైదొలిగారు. బీజేపీ విభజన రాజకీయాల వల్లే..టీఎంసీలో చేరిన అనంతరం చంద్ర కుమార్ బోస్ మాట్లాడుతూ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆదర్శాలను బీజేపీ నీరుగార్చిందని విమర్శించారు. ఎంతో జాగ్రత్తగా పరిశీలించి, నిశితంగా విశ్లేషించిన తరువాతే తాను టీఎంసీలో చేరాలనే నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. 'మళ్లీ తప్పు చేయదలచుకోలేదు. రాజకీయ పార్టీలను ఎంతో జాగ్రత్తగా పరిశీలించి ఒక అవగాహనకు వచ్చాను. సమ్మిళిత, సెక్యులర్ రాజకీయాలకు టీఎంసీ కట్టుబడి ఉంది. నా ఐడియాలజీ కూడా అదే' అని ఆయన వివరించారు. చంద్ర కుమార్ బోస్ 2016లో బీజేపీలో చేరారు. శరత్ చంద్ర బోస్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ అనుసరించిన సెక్యులర్ విలువలకు బీజేపీ కట్టుబడి ఉంటుందనే నమ్మకంతోనే ఆ పార్టీలో తాను చేరానని, అయితే రాజ్యాంగంలో పొందుపరిచిన ఆశయాలకు భిన్నంగా బీజేపీ విధానాలు ఉన్నట్టు తాను గ్రహించానని చెప్పారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన బీజేపీ రాజ్యాంగ సూత్రాలు, విధానాలను దూరంగా పెట్టి విభజన ధోరణిలో ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. 2016, 2019 ఎన్నికల్లో బీజేపీ టిక్కెట్టుపై చంద్రకుమార్ బోస్ పోటీ చేశారు. అయితే రెండుసార్లూ ఆయన ఓటమి పాలయ్యారు. భారత స్వాతంత్ర్య ఉద్యమ ప్రధాన స్ఫూర్తిని బీజేపీ విస్మరించిందని బోస్ ఆరోపిస్తున్నారు.

## హోర్ముజ్ జలసంధిలో చిక్కుకున్న భారత నౌకలు



**ఇరాన్ :** హోర్ముజ్ జలసంధి అంశం ఇప్పుడు ప్రపంచాన్ని కలవరపెడుతోంది. ఒకపక్క ఈ జలసంధిని దిగ్బంధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో ఇక్కడ చిక్కుకుపోయిన నౌకల విషయంలో ఉత్కంఠ నెలకొంది. ఇండియాకు సంబంధించి ఇటీవల కొన్ని వచ్చాయి. అయినప్పటికీ, ఇంకా 15 ఇండియన్ నౌకలు ఈ జలసంధిలోనే చిక్కుకుపోయాయి. హోర్ముజ్ జలసంధి పశ్చిమ దిశలోని చెక్ పాయింట్ వద్ద 15 భారత నౌకలు నిలిచిపోయాయి. ఇరాన్‌తో చర్చలు విఫలమవ్వడంతో హోర్ముజ్‌ను అమెరికా దిగ్బంధించే పనిలో ఉంది. మొత్తం జలసంధిని తన వాణిజ్య, యుద్ధ నౌకలతో దిగ్బంధించాలని అమెరికా భావిస్తోంది. సోమవారం నుంచి తమ చర్యలు ప్రారంభమవుతాయని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. గల్ఫ్ దేశాల చుట్టూ ఉన్న ఇరాన్ పోర్టులన్నింటినీ దిగ్బంధిస్తామని తెలిపింది.

# కష్టకాలంలో భారత్ మాకు అండగా నిలిచింది




**అమెరికా-ఇజ్రాయెల్ :** యుద్ధ సమయంలో భారత ప్రభుత్వం, ఇక్కడి ప్రజలు తమకు మద్దతుగా నిలిచారని ఇరాన్ పేర్కొంది. భారత్ చూపిన ఆదరణపై హర్షం వ్యక్తం చేసింది. అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో మరణించిన ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించి 40 రోజులు పూర్తయిన సందర్భంగా దిల్లీలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఇరాన్ సుప్రీం లీడర్ అధికారిక ప్రతినిధి అబ్దుల్ మజిద్ హకీమ్ ఇలాహి కీలక కామెంట్స్ చేసారు. యుద్ధం సమయంలో భారత్ చూపిన సానుభూతికి కృతజ్ఞతలు తెలిపారు. న్యాయం వైపు నిలబడే విషయంలో భారతీయులు ఎప్పుడూ ముందుంటారని మజిద్ హకీమ్ ఇలాహి కొనియాడారు. అయతుల్లా అలీ ఖమేనీని ఇలాహి 'అమరవీరుడు'గా అభివర్ణించారు. ఖమేనీ తన జీవితాన్ని అణ గారిన వర్గాల కోసం అంకితం చేశారన్నారు. "భారత్ మాకు మద్దతుగా నిలించింది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. అయతుల్లా మరణానికి నేటితో 40 రోజులు పూర్తయిన సందర్భంగా జరిగిన ఈ సభలో ప్రభుత్వ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారందరికీ మేము కృతజ్ఞులు'- అబ్దుల్ మజిద్ హకీమ్హోర్ముజ్ జలసంధిపై కూడా అబ్దుల్ మజిద్ హకీమ్ ఇలాహి మాట్లాడారు. ఈ జలసంధి ఏ ఒక్క దేశానికో పరిమితం కాదని ఆయన స్పష్టం చేశారు. ఇది ప్రపంచ దేశాలన్నింటికీ చెందుతుందన్నారు. అలాగే, హోర్ముజ్ జలసంధిని దగ్బంధించాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలను ఆయన తోసిపుచ్చారు. ఫిబ్రవరి 28న అమెరికా- ఇజ్రాయెల్ దళాలు జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణించారు. దశాబ్దాలుగా ఇరాన్ రాజకీయాలను శాసిస్తున్న నేతను కోల్పోవడం ఆ దేశానికి తీరని లోటుగా మారింది. ఆయన మరణం తర్వాత పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొంది.

# అంబేద్కర్ ఆశయాలకు పట్టం కట్టాలి !



అంబేద్కర్ మహాశయుడు ఈ దేశం గురించి గొప్పగా కలలు కన్నారు. తన దేశాన్ని ఉన్నతంగా చూడాలను కున్నారు. అస్పృశ్యతను పూర్తిగా నిర్మూలించడంతో పాటు, అందరికీ విద్య దక్కాలన్న ఆశయం ఆయనది. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా, రాజ్యాంగ నిర్మాతగా భారతీయుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహనీయుడు డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్. అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ.. దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అంబేద్కర్. దేశంలో అన్ని మతాలు, తెగలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాలు తదితర వర్గాలకు సమ న్యాయం జరిగేలా, వారి హక్కులకు భంగం వాటిల్లకుండా ఉండేందుకు, సర్వసత్తాక సౌర్వభౌమాధి కారాన్ని దక్కించుకొనేందుకు వీలుగా అంబేద్కర్ రాజ్యంగాన్ని రూపొందించారు. వివిధ రకాల భాషలు, ఆచారాలు, మతాలూ ఉన్నటువంటి ఈ దేశంలో ఆయన ముందు చూపుతో రాసిన రాజ్యాంగం అనుసరించి ఇప్పుడు మన దేశం నడుస్తుంది అంటే ఆయన గొప్పతనం ఏంటో అర్థం అవుతుంది. ఆయన కేవలం దళితుల కోసమో లేక వాళ్ళ రిజర్వేషన్ ల కోసమో మాత్రమే కృషి చేయలేదు. ఆడవాళ్ళకి మగవాళ్ళకి సమానమైన జీతాలు ఉండాలని, ఆడవాళ్ళకి ప్రెగ్నెన్సీ టైం లో లీవ్స్ ఇవ్వాలని, పని గంటల సమయాన్ని 12 నుండి 8 గంటలు చేయాలనీ, స్త్రీలకూ ఆస్తి హక్కు ఇవ్వాలని ఇలా ఎన్నో అంశాలలో ఈయన కృషి చేసారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని యావత్ భారతావని ఆయన ఆశయాలపై ఇప్పటికైనా అధ్యయనం చేయాలి. ఎంతసేపు అంబేద్కర్ పేరు చెప్పి విగ్రహాలు పెట్టడం, సభలు పెట్టడం కాదు. ఆయన దేశానికి అందించిన విలువైన సూచనలు పాటించలి. ఆయన కోరుకున్న సమాజం కోసం పాలకులు ఆలోచన చేయాలి. అందుకు నడుం బిగించాలి. జయంతి సభల్లో ఉపన్యాసాలు ఇవ్వడం మానాలి. ఒకానొక సమయంలో అంటరానితనం పేరు తో అట్టడుగు వర్గాల ప్రజల పరిస్థితి ఏవిధంగా ఉండేదన్నది ఆయన జీవితమే పెద్ద ఉదాహరణ. అప్పటి వరకు మూగ బోయిన అణగారిన ప్రజలకు గొంతుకయ్యాడు. అయితే కొందరు రాజకీయంగా ఆయనను ఎదగకుండా చేశారు. స్వాతంత్ర్యం రాగానే నెహ్రూ బదులు అండేబ్కర్‌ను ప్రధానిని చేసివుంటే మనదేశ రాత మరోలా ఉండేది. కానీ నెహ్రూ, గాంధీల కుట్రలకు ఆయన బలయ్యారు. భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఆర్థిక నిపుణుడు, దళితో ద్ధారకుడు, మహా మేధావి, బహుముఖ ప్రజ్ఞాశాలి, ఇలా ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే. అందుకే నేమో ఆయనను ఆనాటి నేతలు దూరం పెట్టారు. ఈనాటి నేతలు విగ్రహాలు పెట్టి, కేవలం చెక్క భజనలు చేస్తున్నారు. కానీ ఆయన స్వప్నించిన భారతాన్ని ఆవిష్కృతం చేసే ప్రయత్నాలు చేయడం లేదు. 1891 వ సంవత్సరం ఏప్రిల్ 14 వ తేదీన రాంజీ మాలోజి సక్పాల్ ,భీమాబాయ్ దంపతులకు మధ్యప్రదేశ్ లోని మావ్ గ్రామంలో మహర్ కులంలో అంబేద్కర్ జన్మించారు. అప్పట్లో ఈ కులం వారిని అంటరానివారిగా పరిగణించేవారు. దళితుడు అనే కారణంతో ఈయన చిన్న వయసు నుండే ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. చిన్నప్పుడు వాళ్ళ అన్నయ్యతో కలిసి వేరే ఊరుకి నడిచి వెళ్తుంటే బాగా దాహం వేయడంతో దగ్గరలో ఉన్న ఒక ఇంటికి వెళ్లి తాగడానికి నీటిని అడిగితే అంబేద్కర్ మహర్ కులానికి చెందిన వారు అని తెలిసి నీళ్లు ఇవ్వకపోగా, పక్కనే ఉన్న మురికి గుంటలో నీటిని తాగమని తిట్టి పంపించారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాంటి అనేక అవమానాలను అంబేద్కర్ ఎదుర్కొన్నారు. అందుకే ఇలాంటి వ్యవస్తను నిరసించాడు. అలాగని మిగతా కులాల వారిని ఏనాడూ ఆయన ఈసడించుకోలేదు. ఇది వ్యవస్తాగతమైన లోపంగా గుర్తించారు. తన ఆలోచనలను రాజ్యాంగ రచనలో చూపారు. భారత దేశం ఉన్నతంగా ఉండాని కోరుకున్నాడు. దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించారు. ఇదే విషయాన్ని నిర్మొహమాటంగా చెప్పారు. కానీ వారెవ్వరూ అంబేద్కర్‌ను లెక్కచేయలేదంటే, ఆయన పట్ల వారికి గల ప్రేమానురాగాలు ఏపాటివో వేరుగా చెప్పాల్సిన పనిలేదు. అమెరికాలో మొదటి సారిగా అంబేద్కర్ స్వేచ్ఛ అంటే ఏంటో చూసారు. అప్పుడు భారత దేశంలో ఉన్నట్టుగా కుల, జాతి వివక్షత లేదు. అందరికి సమానమైన గౌరవం, అవకాశాలు దక్కేవి. 1917 లో అంబేద్కర్ వెనక్కి వచ్చి ఒప్పందం ప్రకారం బరోడా సంస్థానంలో రక్షణశాఖలో ఉద్యోగంలో చేరారు.క్కడ ఆయనకి ఒక గొప్ప అధికారిగా ఉద్యోగం దక్కింది కానీ ఈయన నిమ్న కులస్తుడు కావడంతో ఆయన కింద ఉండే ఉద్యోగులు కూడా ఆయనని గౌరవించే వారు కాదు. ఏదైనా ఒక ఫైల్ ఇవ్వాలంటే దూరం నుండే ఆయన టేబుల్ మీదకు విసిరేసేవారు. చదవాలన్న, పని చేయాలన్న, ఉండడానికి ఇల్లు కావాలన్నా, చివరికి నీళ్లు తాగాలన్న కూడా కులం అడ్డు వచ్చేది. ఉద్యోగం చేసుకుంటూనే 1927 నుండి అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేయడం మొదలు పెట్టాడు. ఇలా మహద్ లో దళితుల మహా సభని ఏర్పాటు చేసారు. దేశంలో నలుమూలల నుండి కొన్ని వేళ మంది దళితులు ఆ సభకు హాజరయ్యారు. అప్పటివరకు దళితులు మహద్ లోని చెరువులో నీటిని తాగడానికి అనుమతి ఉండేది కాదు. కానీ అంబేద్కర్ ఆ సభలో దానికి వ్యతిరేకంగా పోరాడి ఆ చెరువులో నీటిని తాగడానికి అనుమతి వచ్చేలా చేసారు. కొల్హాపూర్ మహారాజ్ సాహు మహరాజ్ అస్పృశ్యత , అంటరానితనాన్ని నివారించడానికి కృషి చేస్తున్నారు అని తెలుసుకుని ఆయన సహకారంతో మూగ వాళ్ళకి నాయకుడు అనే అర్థం వచ్చేలా 'మూక్ నాయక్' అనే పత్రికను అలాగే బహిష్కృత్ భారత్, జనతా , ప్రబుద్ధ భారత్ అనే పత్రికలూ నడిపారు. ళితులకు బడులలోకి, గుడులలోకి వెళ్ళడానికి అనుమతి పొందేలా ఉద్యమాలు చేపట్టి విజయం సాధించారు. ఆయన అంత స్థాయికి ఎదిగారు అంటే కారణం చదువు. ఠాబట్టే ఆయన అందరికి చదువు అందాలని కృషి చేసారు. అయితే సంపద కోసమో, అధికారం కోసమో పోరాటం చేయలేదు అట్టడుగు వర్గాల స్వేచ్ఛ కోసం ఆయన పోరాడేవారు. శోధించు, సమీకరించు, పోరాడు అనే సిద్దాంతంతో బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం, కులమాత బేధాలు లేని సమాజం కోసం కృషి చేసేవారు.స్వాతంత్రం వచ్చిన తరువాత అంబేద్కర్ కి కేంద్ర మండలిలో మొట్ట మొదటి న్యాయశాఖ మంత్రి గా పదవి వచ్చింది. అంతేకాదు భారత దేశపు రాజ్యాంగాన్ని రాసే అవకాశం దక్కింది. అయితే రాజ్యాంగం రచించడానికి నియమించిన సభ్యులలో ఒకరు రాజీనామా చేయడం, మరొకరు మరణించడం, కొంతమంది అమెరికాలో ఉండిపోవడం, మరికొంతమంది రాష్ట్ర రాజకీయాలలో నిమగ్నులవడం ఇలా రకరకాల కారణాల వలన భారత రాజ్యాంగం రచించే బాధ్యతంతా అంబేద్కర్ మీద పడింది. దాంతో ఆయన రాత్రీపగలు అనే తేడా లేకుండా నిరంతరం రాజ్యాంగ రచనలోని ఉండేవారు. తరువాత కొద్ది రోజులకి అనారోగ్యం కారణంగా 1956 డిసెంబర్ 6 వ తేదీన అంబేద్కర్ మరణించారు. ఆయన మరణించినగాని ఆయన కృషి ఇప్పటికీ ఎంతో మంది జీవితాలలో వెలుగుని నింపుతుంది. ఒకవేళ ఆయన పూనికుని ఉండకపోతే ఈనాటికి బడుగు బలహీన వర్గాల జీవితాలు ఇంకా అలాగే ఉండిపోయే వేమో.


---

# మరోమారు ఎదురు కాల్పులు

**మహిళా మావోయిస్టు నాయకురాలు మృతి**

**అడవుల్లో కొనసాగుతున్న కూంబింగ్**





**రాయ్‌పూర్,ఏప్రిల్13:** ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మహిళా మావోయిస్టు కమాండర్ రూపీ మృతి చెందారు. కాంకేర్ జిల్లాలోని ఛోటే బెట్టియా అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రూపీపై రూ.5 లక్షల బహుమతి ప్రకటించబడినట్లు అధికారులు తెలిపారు. మావోయిస్టులు ఉన్నారనే విశ్వసనీయ సమాచారం ఆధారంగా భద్రతా దళాలు ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టగా, ఈ సందర్భంగా ఇరుపక్షాల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి.ఎన్‌కౌంటర్ అనంతరం రూపీ మృతదేహంతో పాటు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు భద్రతా దళాలు వెల్లడించాయి. ఆ ప్రాంతంలో మరికొందరు మావోయిస్టులు దాగి ఉన్నారనే అనుమానంతో విస్తృతంగా గాలింపు కొనసాగుతోంది. గత నెలలో కూడా ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు హతమైన సంగతి తెలిసిందే. ఎన్‌కౌంటర్ సమయంలో సుమారు పదిమంది మావోయిస్టులు అక్కడి నుంచి అడవుల్లోకి పారిపోయినట్లు సమాచారం. వారు దట్టమైన అటవీ ప్రాంతాన్ని ఉపయోగించి తప్పించుకున్నారని భద్రతా బలగాలు భావిస్తున్నాయి. వారిని గుర్తించి పట్టుకోవడానికి ప్రత్యేక బలగాలు రంగంలోకి దిగాయి. ఎన్‌కౌంటర్ అనంతరం ప్రాంతాన్ని పూర్తిగా చుట్టుముట్టి కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది. భద్రతా బలగాలు అడవిలో గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. మరి కొంతమంది మావోయిస్టులు అటవీలో దాగి ఉండవచ్చనే అనుమానంతో ఆపరేషన్‌ను భద్రతా బలగాలు కొనసాగిస్తున్నాయి. మావోయిస్టుల కదలికలపై గత కొంతకాలంగా భద్రతా బలగాలు నిఘా పెంచాయి. వారికి వచ్చిన సమాచారం ఆధారంగా ఈ ఆపరేషన్‌ని చేపట్టినట్లు తెలుస్తోంది. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో ఈ ఆపరేషన్ జాగ్రత్తగా కొనసాగుతోంది. ఈ ప్రాంతం గతంలో కూడా మావోయిస్టు కార్యకలా పాలకు కేంద్రంగా ఉంది. తరచూ భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరుగుతు న్నాయి. మావోయిస్టులు ఉద్యమం ప్రభావం ఈ ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతోండటంతో భద్రతా సవాళ్లు నెలకొన్నాయి. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో సమీప గ్రామాల్లో భద్రతను పోలీసులు కట్టుదిట్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అటవీ ప్రాంతానికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులకు హెచ్చరికలు జారీ చేశారు. మిగిలిన మరికొంతమంది మావోయిస్టులను పట్టుకోవడానికి డ్రోన్ సర్వైలెన్స్, ప్రత్యేక కూంబింగ్ బలగాలు ఉపయోగిస్తున్నట్లు సమాచారం. ఈ ఆపరేషన్ మరికొన్ని గంటలు లేదా రోజులు కొనసాగవచ్చని భద్రతా వర్గాలు చెబుతున్నాయి. మాచపల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మహిళా మావోయిస్టు మృతి చెందడం, పలువురు తప్పించుకోవడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న కూంబింగ్ ఆపరేషన్‌లో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

---

# వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు

**• మరోమారు పిటిషన్ దాఖలు చేసిన సునీత**



**హైదరాబాద్,ఏప్రిల్13:** మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తు వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో తదుపరి దర్యాప్తును కొనసాగించేలా కేంద్ర దర్యాప్తు సంస్థకు ఆదేశాలు ఇవ్వాలంటూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను వివేకా కూతురు సునీతా రెడ్డి దాఖలు చేశారు. ఈ కేసులో కొన్ని కోణాలపై సీబీఐ పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయలేదని, పలు అనుమానాలకు సమాధానాలు రాలేదని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అందువల్ల మరింత సమగ్ర తదుపరి దర్యాప్తు జరపాలని హైకోర్టును కోరారు. ఈ కేసు ఇప్పటికే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తులో ఉంది. గతంలో సీబీఐ కోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం కొన్ని వ్యక్తుల మధ్య జరిగిన ఫోన్ కాల్ డేటా సహా పలు సాంకేతిక ఆధారాలను పరిశీలించి దర్యాప్తు చేపట్టింది. తదుపరి దర్యాప్తులో కొందరి పాత్ర లేదని పేర్కొంటూ సీబీఐ కోర్టుకు ఛార్జ్‌షీట్ కూడా దాఖలు చేసింది. అయితే ఈ దర్యాప్తుపై పిటిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సునీతా రెడ్డి తన పిటిషన్‌లో పలు కీలక విషయాలను పేర్కొన్నారు. పలు సందేహాలకు సీబీఐ దర్యాప్తులో సమాధానం రాలేదని తెలిపారు. కొన్ని కోణాల్లో విచారణ పూర్తిగా జరగలేదని అన్నారు. ఈ కేసులోని కొన్ని అనుమానాస్పద అంశాలను విస్మరించారని అభ్యంతరం వ్యక్తం చేశారు. అందువల్ల సీబీఐ కోర్టు ఉత్తర్వులను రద్దు చేసి, కేసులో ఇంకా స్పష్టత లేని అంశాలపై మరింత దర్యాప్తు చేయాలని ఆదేశించాలంటూ ఆమె హైకోర్టును అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరుగుతోంది.

# ఒంటరి వృద్ధురాలిపై దాడి

**• రోకలిబండతో బాదిన దుండుగులు • బంగారం దోచుకుని పరార్**

**కామారెడ్డి,ఏప్రిల్13:** కామారెడ్డి జిల్లాలోని భిక్కనూరు మండల కేంద్రంలో జరిగిన దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఇంట్లోకి చొరబడి ఓ వృద్ధురాలిపై రోకలిబండతో దాడి చేసి, ఆమె బంగారు ఆభరణాలను అపహరించిన ఘటన ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు మండల కేంద్రంలో నివసిస్తున్న ఓ వృద్ధురాలు తన ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. ఆ సమయంలో ఆమెపై అకస్మాత్తుగా దాడికి పాల్పడ్డారు. దాడికి రోకలి బండను ఉపయోగించినట్లు సమాచారం. ఈ దాడిలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. దాడి సమయంలో ఆమె అరుస్తూ సహాయం కోరినప్పటికీ, దుండగులు ఆమె బంగారు ఆభరణాలను బలవంతంగా లాక్కొని పరారయ్యారు. వాటి విలువ ఎంతన్నది పూర్తిగా నిర్ధారణ కాలేదు. ఈ ఘటనలో వృద్ధురాలి తలకు తీవ్ర గాయాలైనట్లు వైద్యులు తెలిపారు. రక్తస్రావం అధికంగా ఉండటంతో స్థానికులు వెంటనే స్పందించి ఆమెను సమీప ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఈ దారుణ ఘటనతో భిక్కనూరు ప్రాంత ప్రజల్లో భయాందోళన నెలకొంది. వృద్ధురాలిపై ఇంతటి క్రూరమైన దాడి జరగడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుండగులు ముందుగా ఇంటి పరిస్థితిని గమనించి, ఎవరు లేని సమయం చూసి లోపలికి చొరబడినట్లు పోలీసులు భావిస్తున్నారు.

మంగళవారం,
ఏప్రిల్ 14, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



## ఘోర రోడ్డు ప్రమాదం ముగ్గురు మృతి

**– వికారాబాద్ జిల్లాలో ఘటన**



**పెద్దేముల్ ఏప్రిల్ 14 ) :** ఘోర రోడ్డు ప్రమాదం అతివేగంతో స్కూటీని ఢీకొన్న లారీ.. ముగ్గురు దుర్మరణం, వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల పరిధిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటన ఒకే కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. తల్లిదండ్రులతో పాటు వారి కుమార్తె, కుడా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జహీరాబాద్‌కు చెందిన కవిరాజ్ (40), పావని (35) దంపతులు తమ కుమార్తె కీర్తన (11), కుమారుడు కార్తీక్ (13)తో కలిసి ఆదివారం రుక్మాపూర్‌కు వెళ్లారు. వచ్చే నెల మే 1న పావని సోదరుడి వివాహం జరగాల్సి ఉండటంతో, వేడుక ఏర్పాట్ల కోసం వీరు అక్కడికి వెళ్లారు. సాయంత్రం పనులు ముగించుకుని తిరిగి స్కూటీపై జహీరాబాద్‌కు బయలుదేరారు. తట్టెపల్లి గ్రామ శివారులోకి రాగానే, ఎదురుగా అతివేగంగా వచ్చిన లారీ స్కూటీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి కవిరాజ్, పావని, కీర్తన తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. కుమారుడు కార్తీక్ అదృష్టవశాత్తు స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుండి బయటపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, బాలుడిని చికిత్స నిమిత్తం తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ మహమ్మద్ షరీఫ్‌పై కేసు నమోదు చేసి, లారీని స్వాధీనం చేసుకున్నట్లు పెద్దేముల్ ఎస్సై ప్రశాంత్ వర్ధన్ తెలిపారు.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత..

**– కుల్కచర్ల ఎస్ఐ రమేష్ కుమార్,**



**కుల్కచర్ల ఏప్రిల్ 14 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కుల్కచర్ల మండల కేంద్రంలో అరైవ్ అలైవ్" కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కుల్కచర్ల ఎస్సై రమేష్ కుమార్, ఈ కార్యక్రమంలో పాల్గొని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులకు క్రాస్ లైన్, పై అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం ఈ కార్యక్రమన్ని ఉద్దేశించి ఎస్ఐ రమేష్ కుమార్, మాట్లాడుతూ.. ప్రతి ప్రాణం విలువైందని, రోడ్డు ప్రమాదాల వల్ల ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయి. కేవలం నిబంధనలు అమలు చేయడం మాత్రమే కాకుండా, ప్రజల్లో మార్పు వచ్చినప్పుడే ప్రమాదాలను అరికట్టగలమని ఆయన పేర్కొన్నారు. కేవలం అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ చేసే సమయంలో మొబైల్ ఫోన్ వాడటం వంటి చిన్నపాటి నిర్లక్ష్యాలే పచ్చని కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిలిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడమే "అరైవ్ అలైవ్" ప్రధాన ఉద్దేశమని ఎస్సై తెలియజేశారు. క్షేత్రస్థాయిలో ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ సమన్వయంతో పని చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణి స్త్రీలు పౌష్టిక ఆహారం తీసుకోవాలి

**– బిఆర్ఎస్ కౌన్సిలర్ మీదిగడ్డ శ్రీనివాస్**



**పరిగి టౌన్ ఏప్రిల్ 15 :** గర్భిణీ మహిళలు, బాలింతలు, సరైన పౌష్టిక ఆహారం తీసుకోవాలని గర్భిణీ స్త్రీలకు ,బాలింతలకు సూచించిన బిఆర్ఎస్ కౌన్సిలర్స్, సోమవారం పరిగి పట్టణ మున్సిపల్ పరిధిలోని 14, 15 వ వార్డులలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 15వ వార్డు కౌన్సిలర్ మీది గడ్డ శ్రీనివాస్, 14వ వార్డు కౌన్సిలర్ ఆనెం సరిత వెంకటేష్, ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు, చిన్న పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందించాలని అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు ప్రభుత్వ పౌష్టికాహారం సరుకులు మధ్యాహ్న భోజనం ఆటపాటల ద్వారా విద్యా బోధన అందిస్తారన్నారు. గర్భిణీ మహిళలు ప్రతి రోజు ఆకుకూరల తోపాటు, కూరగాయలు, పండ్లు, వంటి సరైన పౌష్టిక ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం తల్లిదండ్రులకు శిశు పోషణ పై అవగాహన కల్పించారు, ఈ కార్యక్రమంలో, 14, 15, వ వార్డుల ప్రజలు, బాలింతలు గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ చరిత్రలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పాత్ర అపారమైనది

**డా. బి. ఆర్. అంబేద్కర్ ప్రతిభ పురస్కార్ అవార్డ్ గ్రహీత ఎరవెల్లి జగన్.**



**కూకట్ పల్లి,ఏప్రిల్ 13 (పీపుల్స్ న్యూస్):** భారతదేశ సామాజిక, రాజకీయ చరిత్రలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పాత్ర అపారమైనదని డా. బి. ఆర్. అంబేద్కర్ ప్రతిభ పురస్కార్ అవార్డ్ గ్రహీత, తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులు, జేఎన్టీయూ హెచ్ యూనివర్సిటీ హైదరాబాద్. ఎరవెల్లి జగన్ అన్నారు. రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డా. బి. ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన జీవితాన్ని స్మరించుకోవడం మాత్రమే కాకుండా, ఆయన ఆలోచనలను సమాజ నిర్మాణంలో ఎలా అన్వయించుకోవాలో ఆలోచించడం అత్యవసరమన్నారు. ఆయన కేవలం రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాదు; సమాజంలోని అసమానతలను సవాలు చేసిన సంస్కర్త అని అన్నారు. కుల వ్యవస్థ నిర్మూలన దిశగా నిజమైన ప్రయత్నం అవసరమన్నారు. అంబేద్కర్ ప్రధాన పోరాటం కుల వ్యవస్థకు వ్యతిరేకంగానే సాగిందన్నారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం హామీ ఇస్తుందన్నారు. వాస్తవ పరిస్థితులు చూస్తే, ఇది పుస్తకాల్లోనే పరిమితమైపోయిందనే అనిపిస్తోంది. రాజ్యాంగం సమానత్వాన్ని హామీ ఇచ్చినా, సమాజంలో కుల ఆధారిత విభజనలు ఇంకా పూర్తిగా తొలగిపోలేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వివాహాలు, సామాజిక సంబంధాలు ఇప్పటికీ కులాన్ని ఆధారంగా చేసుకోవడం ఒక వాస్తవం. అదే సమయంలో, రాజకీయాల్లో కుల సమీకరణలు ప్రాధాన్యత పొందడం మరొక స్పష్టమైన ఉదాహరణ అన్నారు. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో హోటల్లో రెండు గ్లాసుల పద్ధతి, చిన్నపాటి పట్టణాల్లో రూమ్ లు అద్దెకు ఇచ్చే విషయంలో కుల వివక్ష స్పష్టంగా తెలుస్తుందన్నారు. కుల నిర్మూలన కోసం చట్టపరమైన చర్యలతో పాటు సామాజిక చైతన్యం పెంపు అవసరమన్నారు. మతం సమానత్వానికి దారి చూపే సాధనం కావాలన్నారు. అంబేద్కర్ చివరకు బౌద్ధంను స్వీకరించడం ఆయన ఆలోచనలకు ప్రతీక. మతం వ్యక్తి స్వేచ్ఛను, సమానత్వాన్ని బలపరచాలి కానీ విభజనకు కారణం కాకూడదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో, మతం పేరుతో వివక్ష లేదా విభేదాలు చోటు చేసుకునే సందర్భాలు కనిపిస్తుంటాయి. మరోవైపు, మతాచరణలో విమర్శనాత్మక ఆలోచన తగ్గిపోవడం కూడా గమనించదగిన విషయమన్నారు. రిజర్వేషన్లు సమాన అవకాశాలకు సాధనం. రిజర్వేషన్ విధానం సామాజిక న్యాయం సాధనలో ఒక ముఖ్యమైన పాత్ర పోషించింది. అంబేద్కర్ దీన్ని సమాన అవకాశాల కోసం ఒక సాధనంగా ప్రతిపాదించారు. అయితే, ఈ వ్యవస్థ సమర్థవంతంగా అమలు కావడం కూడా అంతే ముఖ్యమైనది. కొంతమంది నిజంగా అర్హులైన వారికి ప్రయోజనం చేరకపోవడం, మరోవైపు కొన్ని వర్గాల్లో దీని మీద అధిక ఆధారపడటం వంటి అంశాలు చర్చకు వస్తున్నాయన్నారు. రిజర్వేషన్లను సమాజంలో సమానత్వాన్ని పెంపొందించే విధంగా, సమర్థంగా అమలు చేయడం అవసరమన్నారు. అంబేద్కర్ జీవితంలో విద్యకు ఉన్న ప్రాధాన్యం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన సాధించిన విజయాల వెనుక ఉన్న ప్రధాన శక్తి విద్యే. ఇప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కొరత, నాణ్యమైన విద్య అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. మరోవైపు, ఉన్నత విద్య ఖర్చులు పెరగడం వల్ల మధ్యతరగతి, పేదవర్గాలపై భారమవుతోంది. ఈ పరిస్థితుల్లో, అందరికీ సమానంగా నాణ్యమైన విద్య అందించే విధానాలపై దృష్టి పెట్టడం అవసరం. పాలకులు విధానాలు ప్రకటిస్తారు, కానీ అమలు విషయంలో విఫలమవుతున్నారు. బలహీన వర్గాలు ఇంకా వెనుకబడి ఉన్నాయి. ప్రజలు అవగాహన పెంచుకోవాలి -- హక్కులు తెలిసి, ప్రశ్నించే ధైర్యం ఉండాలన్నారు. సమాజంగా మనం ముందుకు సాగాలంటే, ఆయన ఆలోచనలను కేవలం మాటల్లో కాకుండా ఆచరణలోకి తీసుకురావాలి. అదే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు.

# కల్తీ వ్యాపారుల పట్ల చట్టప్రకారం కఠినంగా వ్యవహరించాలి






**హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్.**






**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, ఏప్రిల్ 13 (పీపుల్స్ న్యూస్) :** ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే కల్తీ వ్యాపారుల పట్ల చట్టప్రకారం కఠినంగా వ్యవహరించాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ వీసీ సజ్జనర్ ఆదేశించారు. కల్తీ నివారణ కోసం బేగం బజార్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెచ్-ఫాస్ట్ కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించి, అక్కడి పనితీరును సమీక్షించారు. పర్యటనలో భాగంగా కార్యాలయం లోని రిసిప్షన్, ఇన్‌స్పెక్టర్, ఎస్సైల గదులతో పాటు లాకప్‌లు, మహిళా సిబ్బంది విశ్రాంతి గదులను పరిశీలించారు. అనంతరం క్షేత్రస్థాయి సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై, విధుల్లో వారు ఎదుర్కొంటున్న సవాళ్లు, ఆటంకాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తా మని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. ఫిబ్రవరి నెల నుంచి ఇప్పటివరకు హెచ్-ఫాస్ట్ బృందాలు నగరవ్యాప్తంగా 117 కేసులు నమోదు చేసి, సుమారు 129.34 టన్నుల కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. అత్యంత తక్కువ సమయంలోనే ఈ విభాగం దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం అభినందనీయమని, ఇది సిబ్బంది సామూహిక కృషి ఫలితమేనని కొనియాడారు. "ఆహార కల్తీ అనేది సమాజానికి పట్టిన చీడ పురుగు. ఇది పౌరుల ఆయుష్షును హరిస్తోంది. హైదరాబాద్‌ను కల్తీ రహితంగా మార్చే ప్రక్రియను ఒక పవిత్రమైన మహా యజ్ఞంలా భావించి, సిబ్బంది అంతా అంకితభావంతో పనిచేయాలి" అని పిలుపునిచ్చారు.

ఫుడ్ సేఫ్టీ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. విధుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 108 మంది పోలీస్ సిబ్బందికి ఈ సందర్భంగా సీపీ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ గారు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఇదే సమయంలో సిబ్బందికి కీలక సూచనలు చేస్తూ.. ఎవరూ కూడా అక్రమ కార్యకలాపాలకు పాల్పడవద్దని, క్రమశిక్షణ తప్పితే కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. కల్తీపై జరుగుతున్న ఈ పోరాటంలో ప్రజలు కూడా పోలీసులకు సమాచారం అందించి సహకరించా లని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీపీ టాస్క్ ఫోర్స్, హెచ్-ఫాస్ట్ హెడ్ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, , అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాసరావు, వివిధ జోన్ల ఇన్‌స్పెక్టర్లు , ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# యుక్త వయస్సులో మద్యం అధికంగా సేవిస్తే.. తరువాతి కాలంలో ఇబ్బందే..

మద్యం సేవించడం ఆరోగ్యానికి హానికరమని అందరికీ తెలిసిందే. కాలేయ సమస్యలు, గుండె వ్యాధులు, వ్యసనం వంటి అనేక సమస్యలకు ఇది కారణమవుతుంది. అయితే తాజా పరిశోధన ప్రకారం యుక్త వయస్సులో ఒత్తిడిని తగ్గించుకోవడానికి మద్యం సేవించడం మధ్య వయస్సులో మెదడు పనితీరుపై తీవ్ర ప్రభావం చూపవచ్చని వెల్లడైంది. అల్కహాల్ క్లినికల్ అండ్ ఎక్స్‌పెరిమెంటల్ రీసెర్చ్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనాన్ని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్ అంహెర్స్ట్ పరిశోధకులు నిర్వహించారు. దీని ప్రకారం యువ దశలో ఒత్తిడి కారణంగా మద్యం సేవించిన వారు, తరువాత కాలంలో పూర్తిగా మానేసినా కూడా మెదడు పనితీరులో మార్పులు కొనసాగుతాయని తేలింది. దీర్ఘకాలంలో మెదడుపై ప్రభావం..ఈ పరిశోధనకు నేతృత్వం వహించిన బయాలజీ ప్రొఫెసర్ ఎలీనా వాజీ మాట్లాడుతూ మద్యం, ఒత్తిడి కలిసి మెదడులో నిర్ణయాలు తీసుకునే విధానాన్ని ప్రభావితం చేస్తాయని తెలిపారు. ముఖ్యంగా యువ దశలో మెదడు ఇంకా అభివృద్ధి చెందుతున్న సమయంలో ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుందని పరిశోధకులు పేర్కొన్నారు. ఒత్తిడిని తగ్గించుకోవడానికి చాలామంది మద్యం సేవిస్తారు. తాత్కాలికంగా ఇది ఉపశమనాన్ని ఇస్తుంది. అయితే దీర్ఘకాలంలో మెదడు సహజంగా ఒత్తిడిని నియంత్రించే సామర్థ్యాన్ని ఇది దెబ్బతీస్తుంది. ఫలితంగా ఒక దుష్చక్రంగా ఏర్పడుతుందని, ఎక్కువగా మద్యం సేవించడం, దానివల్ల తప్పు నిర్ణయాలు తీసుకోవడం, మరింత ఒత్తిడి పెరగడం, మళ్లీ మద్యం వైపు మళ్లడం వంటివి జరుగుతాయని



నిపుణులు చెబుతున్నారు. ఎలుకలపై ప్రయోగాలు..ఈ అధ్యయనంలో ఎలుకలపై ప్రయోగాలు చేశారు. యువ దశలో వాటికి అధిక మద్యం, దీర్ఘకాలిక ఒత్తిడిని కలిపి ఇచ్చి, తరువాత కొన్ని నెలల పాటు మద్యం పూర్తిగా నిలిపివేశారు. అయినప్పటికీ మధ్య వయస్సుకు సమానమైన దశలో ఆ ఎలుకలు కొత్త పరిస్థితులకు తగినట్లు ఆలోచించడంలో ఇబ్బంది పడ్డాయి. అంటే కాగ్నిటివ్ ఫ్లెక్సిబిలిటీ తగ్గిపోయింది. ఈ ప్రభావాలకు ప్రధాన కారణం మెదడులోని లోకస్ కోరూలియస్ అనే భాగంలో వచ్చిన మార్పులు. సాధారణంగా ఇది ఒత్తిడిలో పనిచేసి తరువాత ప్రశాంత స్థితికి వస్తుంది. కానీ మద్యం, ఒత్తిడి ప్రభావంతో ఇది ఎప్పుడూ అధికంగా పనిచేస్తూ ఉంటుంది. దీంతో నిర్ణయాలు తీసుకోవడంలో, పరిస్థితులకు అనుగుణంగా మారడంలో సమస్యలు వస్తాయి. ప్రత్యేక చికిత్సలు అవసరం..ఇంకా ఈ పరిస్థితిలో ఆక్సిడేటివ్ స్ట్రెస్ అనే సెల్ స్థాయి నష్టం కూడా పెరుగుతుంది. ఇది అల్జీమర్స్ వంటి వ్యాధులతో సంబంధం ఉన్న ఒక సూచిక. దీని వల్ల మెదడు కోలుకోవడంలో ఇబ్బంది ఏర్పడుతుంది. అంతేకాకుండా ఇంతకు ముందు మద్యం ఎక్కువగా తీసుకున్న వారు మళ్లీ ఒత్తిడిలో పడినప్పుడు మద్యం వైపు తిరిగి వెళ్లే ప్రమాదం కూడా ఎక్కువగా ఉంటుందని పరిశోధకులు తెలిపారు. మధ్య వయస్సులో జీవన ఒత్తిడులు పెరిగే సమయంలో, ఈ ప్రభావాలు మరింత స్పష్టంగా కనిపిస్తాయి. కొత్త పరిస్థితులకు తక్షణంగా స్పందించలేకపోవడం, ఆలోచనా సామర్థ్యం తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి డిమెన్షియా ప్రారంభ దశలకు దగ్గరగా ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. యువ దశలో మద్యం, ఒత్తిడి కలయిక మెదడుపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతుందని ఈ అధ్యయనం స్పష్టం చేసింది. ఒకసారి ఈ మార్పులు జరిగితే, మద్యం మానేయడం మాత్రమే
సరిపోదు. మెదడు పనితీరును మెరుగుపరచడానికి ప్రత్యేక చికిత్సలు అవసరమవుతాయని పరిశోధకులు సూచిస్తున్నారు.

# అయ్యప్ప స్వామి అన్న సేవా మండపానికి లంకిశెట్టి దంపతుల భారీ విరాళం

**నిర్మాణ నిధికి రూ. లక్ష నగదు అందజేత**

**వేద మంత్రాల సాక్షిగా అన్నదాన సత్రం నిర్మాణానికి శంకుస్థాపన**




**మచిలీపట్నం,**
నగరంలోని చెమ్మనిగిరిపేట శివాలయంలో కొలువై ఉన్న బంగారు అయ్యప్ప స్వామి దేవస్థాన ప్రాంగణంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న శ్రీ అయ్యప్ప స్వామి అన్న సేవా మండపానికి ప్రముఖ న్యాయవాది, మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, 15వ డివిజన్ మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ దంపతులు తమ ఉదారతను చాటుకున్నారు. ఆదివారం జరిగిన భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా వారు రూ. లక్ష నగదును సేవా ట్రస్టుకు విరాళంగా అందజేశారు. ఆదివారం ఉదయం శివాలయం వెనుక వైపున ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో, పూర్వ అర్చకులు మురళి స్వామి నేతృత్వంలో వేదమంత్రాల మధ్య అత్యంత వైభవంగా శంకుస్థాపన మహోత్సవం నిర్వహించారు. శ్రీ అయ్యప్ప స్వామి అన్న సేవా ట్రస్ట్ సభ్యులు దేసు సత్య వెంకట రాంబాబు, దేసు సత్య వెంకటరమణమూర్తి, కొత్తగుండు శివప్రసాద్, నగరపు మల్లేశ్వరరావు, జొన్నలగడ్డ సత్యనారాయణ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అన్నదానమే పరమావధివచ్చే ఏడాది అయ్యప్ప దీక్షల సమయంలో దాదాపు లక్ష మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేయాలనే సంకల్పంతో ఈ అన్న సేవా మండపాన్ని నిర్మిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ బృహత్ కార్యానికి లంకిశెట్టి బాలాజీ దంపతులు అందించిన చేయూత పట్ల ట్రస్ట్ సభ్యులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాదిరెడ్డి అంజిబాబుతో పాటు పలువురు పుర ప్రముఖులు, అయ్యప్ప స్వామి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిన్నారి ఊపిరి తీసిన ఉయ్యాల

**దుంబ్రిగుడ :**




అల్లూరి జిల్లా దుంబ్రిగుడ మండలం సాగర పంచాయతీ మారుమూల కొదోంజొల గ్రామానికి చెందిన సోకేలి మాధవి(11) అనే చిన్నారి ఆదివారం ఉదయం 11గంటలకు ఉయ్యాల ఊగుతూ ఇరుక్కుపోయి మృతి చెందింది. తల్లి మూడు నెలల పసికందును చిన్నారి చేతిలో పెట్టి లాలించాలని గెడ్డకు వెళ్లింది. ఈ క్రమంలో తమ్ముడిని లాలించి నిద్రబుచ్చి ఉయ్యాల ఊగుతూ ప్రమాదవశాత్తు ఇరుక్కపోయి మృతి చెందిందని చిన్నారి తండ్రి లొకిరాం బోరున విలపించారు వ్యవసాయ పనులు కావడంతో గ్రామంలో ఆ సమయంలో ఎవరు లేకపోవడంతో చిన్నారిని కాపాడలేని పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు తెలిపారు. మృతి చెందిన చిన్నారి కొసొంగుడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో అయిదో తరగతి చదువుతోంది. చిన్నారి మృతితో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకుంది

# ప్రతి సమస్య పరిష్కారం అవుతుంది మున్సిపల్ కమిషనర్ అనూష



**కందుకూర్ అర్బన్ ఎంబీసీ**
ప్రతి సమస్య పరిష్కారం అవుతుందని మున్సిపల్ కమిషనర్ అనూష పేర్కొన్నారు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ నిర్వహించారు ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని పలు వార్డు నుండి సమస్యల పరిష్కారానికి కార్యాలయానికి వచ్చి ఫైజ్లు కమిషనర్ కు అర్జీలు అందజేశారు ఈ సందర్భంగా వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ సంబంధిత మున్సిపల్ అధికారులు ఉద్యోగులను విచారణ జరిపి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు ఇదే సందర్భంలో ప్రజలతో మాట్లాడుతూ ఏ సమస్య ఉన్న ప్రజలు నేరుగా తన్ను సంప్రదించాలని సూచించారు కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు

# గురుకులంలో సీట్ సాధించిన దుగ్గిరాల లక్ష్మీ పూర్ణిమకు అభినందనలు

**- అంబేద్కర్ చిత్ర పఠము బహుకరణ**



**ఉలవపాడు** మండలం బద్దిపూడి గ్రామము,మండల ప్రాథమిక పాఠశాల పి.యం. లో చదువుతూ ఆంధ్రప్రదేశ్ డా బి ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల సింగరాయకొండలో 5వ తరగతికి ప్రవేశం సాధించిన విద్యార్థిని దుగ్గిరాల లక్ష్మీ పూర్ణిమ అభినందిస్తూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు డా బి ఆర్ అంబేద్కర్ చిత్ర పఠముతో పాటు పుస్తకాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆ ప్రధానోపాధ్యాయిని తాటితోటి వరలక్ష్మి మాట్లాడుతూ తమ విద్యార్థిని సాధించిన ఈ విజయాన్ని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఏ లక్ష్యాన్నైనా సాధించగలరని తెలిపారు. న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను గుర్తుచేస్తూ, విద్య ద్వారానే వ్యక్తి అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. విద్యార్థులు అంబేద్కర్ మార్గంలో నడుచుకుని ఉన్నత స్థానాలకు చేరాలని సూచించారు. ఈ సందర్భంగా లక్ష్మీ పూర్ణిమ తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, తనకు ప్రోత్సాహం అందించిన గురువులకు మరియు తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఘనంగా నారి శక్తి వందన్ అధినియం 2023(స్త్రీ శక్తి ) అవగాహన కార్యక్రమం

**అరకు లోయ**



కమీషనర్ హయ్యర్ ఎడ్యుకేషన్ వారి ఆదేశాల మేరకు అరకులోయ మహిళా డిగ్రీ కళాశాలలో నారీ శక్తి వందన్ అధినియం 2023 అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథి అయిన ప్రిన్సిపల్ పట్టాసి చలపతిరావు మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు 2023 భారత రాజకీయాల్లో మహిళల ప్రస్తుత ప్రాతినిధ్య పరిస్థితిని మరియు కొత్తగా వచ్చిన 33% రిజర్వేషన్ చట్టం యొక్క ఉద్దేశాలను వివరించారు లోక్ సభ మరియు రాష్ట్ర అసెంబ్లీలో మహిళలు మూడో వంతు సీట్లు చట్టబద్ధంగా కేటాయించబడతాయి ఈ చట్టంలో కొత్త జనాభా గణన మరియు నియోజకవర్గాల పునర్విభజన తర్వాత మాత్రమే ఇది అమల్లోకి వస్తుందని తెలియజేశారు 15 ఏళ్ల కాలపరిమితి ఉంటుంది అవసరమైతే పార్లమెంట్లో పొడిగించవచ్చు మహిళలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలని ధ్యేయంతో మహిళల యొక్క గౌరవం హక్కులు సమానత్వాన్ని ఎప్పుడు కాపాడుతూ సమాజంలో లింగ వివక్ష ను నిర్మూలించే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని స్త్రీ శక్తి ప్రతిజ్ఞను చేయించారు విక్షిత్ భారత్ 2047 మరియు స్వర్ణాంధ్ర 20047 లక్ష్యాల సాధనలో మహిళల యొక్క పాత్రను గుర్తించి వారి శక్తిని సమాజాభివృద్ధికి వినియోగించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ద్వారా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది కళాశాల అధ్యాపకుల ద్వారా విద్యార్థులకు ఎస్సే రైటింగ్ ,డిబేట్ ,ఇంట్రాక్టివ్ ప్రశ్న జవాబుల సెషన్ కళాశాల అధ్యాపకుల ద్వారా అవగాహన కార్యక్రమాలు అలాగే విజేతలకు ప్రశంసా పత్రాలు బహుమతి ప్రధానం జరిగినది ఈ కార్యక్రమంలో కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ప్రతినిధులు డాక్టర్ స్వర్ణలత ,అన్నపూర్ణ సంధ్య ,రోజా రాణి ,లాలి కుమారి విద్యారాణి,శ్రావణి ,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బాలరాజు డాక్టర్ మురళి ,ప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు

# చెత్తరహిత స్వచ్ఛ మచిలీపట్నం నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ స్వచ్ఛ సైనికులుగా ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డీకే బాలాజీ పిలుపునిచ్చారు.








**కృష్ణజిల్లా మచిలీపట్నం** ఆదివారం ఉదయం తెల్లవారుజామునే జిల్లా కలెక్టర్ వినూత్నంగా స్వచ్ఛత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నూతనంగా రూపొందించిన స్వచ్ఛ ఆయుధం చేతబూని నగరంలోని 16వ డివిజన్ రామానాయుడు పేటలో ఐదు రోడ్ల సెంటర్ వరకు స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమంలో భాగంగా చెత్తాచెదారాలను, ప్లాస్టిక్ కవర్లను ఏరివేశారు. వారికి తోడుగా ఆ ప్రాంతంలో నివసించే ప్రజలు వసుధ జీవవైవిధ్య బృందం మణిరత్నం నాయకత్వంలో వాలంటీర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి స్వచ్ఛ ఆయుధంతో చెత్త ఏరివేసే కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆ ప్రాంతంలో కలెక్టర్ పర్యటిస్తూ రహదారి పైన గాని, ఇరువైపులా గాని చెత్తాచెదారాలు ఎక్కడపడితే అక్కడ వేయరాదని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అక్కడి ప్రజలకు సూచించారు

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మచిలీపట్నం నగరాన్ని స్వచ్ఛ మచిలీపట్నం గా తీర్చిదిద్దాలని సంకల్పించామన్నారు.

ఈ దిశలో ప్రధానంగా పరిశీలిస్తే చెత్త ఎక్కడబడితే అక్కడ ఉంటున్నట్లు గమనించడం జరిగిందన్నారు అది ఉండకుండా చేయాలంటే రోజు పారిశుధ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి చెత్త తొలగించి, మురికి కాలువలో పూడిక తీయాలంటే ఇబ్బంది కలుగుతుందన్నారు. ఈ పరిస్థితులను అధిగమించేందుకు కొందరు స్వచ్ఛంద కార్యకర్తలను చైతన్యపరిచి వాళ్ళ ప్రాంతాల్లో స్వచ్ఛ ఆయుధం ద్వారా చెత్తాచెదారాలను ఏరివేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారుఈ కార్యక్రమానికి స్వచ్ఛ సైనికులు అని పేరు పెట్టామన్నారు. ఆ ప్రకారంగా నేడు రామానాయుడు పేటలో నివసించే వారితో కలిసి స్వచ్ఛ ఆయుధంతో చెత్తను ఏరివేసే కార్యక్రమం చేపట్టామన్నారు గతంలో చేతులతో చెత్తను తీసేటప్పుడు వంగి తీయడం వలన చాలా సమస్య ఏర్పడేదని, ప్రస్తుతం మనిషి నిలుచునే ఎక్కువ చెత్తను సులభంగా ఏరివేసేందుకు పట్టకార లాగా ఉండే ఈ స్వచ్ఛ ఆయుధం ఎంతగానో బాగుందన్నారునగరంలోని ప్రజలు స్వచ్ఛ సైనికులుగా తరలివచ్చి ప్రతిరోజు ఉదయమే ఒక అర్ధగంట కేటాయించి చెత్తను ఏరివేస్తే వారు నివసించే చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవచ్చన్నారు.మొదట్లో చెత్త కొంత ఎక్కువగా ఉన్న ఆ తర్వాత ఏ రోజు చెత్త ఆరోజు తీసివేయడం వలన పెద్దగా పని ఉండదన్నారు.ఆ ప్రకారం గా పారిశుద్ధ్య కార్మికులతో ప్రజలందరూ పాల్గొని చెత్త రహిత మచిలీపట్నం గా తీర్చిదిద్దేందుకు ముందుకు రావాలన్నారు స్వచ్ఛ సైనికులను గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టామని ఇందులో ప్రజలందరూ తమ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకునే దిశగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.ఆ క్రమంలో వసుధ జీవవైవిధ్య బృందం కార్యకర్తలు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. వారు తనతో కలిసి రామానాయుడు పేటలో రహదారి మొత్తం పరిశుభ్రం చేయడం జరిగిందన్నారు. వాళ్లు వారి నివసించే ప్రాంతాన్ని దత్తత తీసుకొని ఇకపై ప్రతిరోజు ఉదయమే వారి ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుతామని ముందుకు వచ్చారన్నారు. ఇదేవిధంగా ప్రజలందరూ వారు నివసించే ప్రాంతాలను దత్తత తీసుకొని అక్కడ ప్రతిరోజు ఉదయం ఒక అరగంట వారి ప్రాంతాన్ని పరిశుభ్రం చేయాలన్నారు.ఉదయాన్నే పని చేయడం వలన అందరికీ కొంత వ్యాయామం చేయడంతో పాటు సూర్యకిరణాలు తగిలి విటమిన్ డి ఉచితంగా లభించి ఆరోగ్యంగా ఉంటామన్నారు. మనం ఆరోగ్యంగా ఉండటమే కాకుండా మనం నివసించే మచిలీపట్నం నగరం కూడా ఆరోగ్యంగా ఉంచుకునే అవకాశం వచ్చిందన్నారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట మునిసిపల్ సహాయ కమిషనర్ గోపాలరావు, వసుధ జీవవైవేద్య బృందం నాయకులు మణిరత్నం, వారి కార్యకర్తలు, మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది, స్వచ్ఛ సర్వేక్షన్, స్వర్ణ వార్డు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉప్పల్ కాంగ్రెస్ లో చేరికలు.



**ఉప్పల్ /:** ఉప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి సమక్షంలో ఆదివారం కాంగ్రెస్ లో భారీ సంఖ్యలో చేరారు.పార్టీలో చేరిన వారికి పరమేశ్వర్ రెడ్డి, పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు.రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన నడుస్తుందని, సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల అమలుతో అన్ని పార్టీల దృష్టి కాంగ్రెస్ వైపు మళ్లిందన్నారు.కాంగ్రెస్ పార్టీ లో చేరిన వారిలో న్యూ శాంతినగర్ అధ్యక్షులు లక్ష్మయ్య ,జనరల్ సెక్రటరీ సైదులు , ఉపాధ్యక్షులు పరశురామ్ , జాయింట్ సెక్రటరీ ప్రభాకర్ , శ్రీకాంత్ , మాజీ అధ్యక్షులు లకన్, గంట చంద్రశేఖర్ రెడ్డి , మెంబెర్స్ మత్స్యగిరి , యాదగిరి , ఉదయ్ , నర్సింహా , మల్లయ్య , కృష్ణ , దర్శన్ , ఉప్పలయ్య , మారయ్య, రాజు, సోమయ్య , సాయికుమార్ , సత్తయ్య , శివ , జనార్దన్, కిష్టయ్య, సుదర్శన్, పూరషోత్తం ఉన్నారు.ఈ కార్యక్రమం లో ఏ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగంపల్లి రామకృష్ణ, తుమ్మల దేవిరెడ్డి , వెంకటేష్ గుప్తా, అలుగుల అనీల్ కుమార్,జనగాం రామకృష్ణ ,అల్వల భాస్కర్ , నోముల సురేష్ , మోహన్ నాయక్,రంగుల శేఖర్, శివ,ధనలక్ష్మి,భవాని ,మమత, రాణి ఉప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఐరన్ వోర్ ఇనుప ఖనిజాల నిక్షేపాలను జిందాల్ అనే కార్పోరేట్ సంస్థకు అప్పగించడం తగదు.




**సిపిఎం ఉలవపాడు వలేటివారిపాలెం ప్రాంతీయ కమిటీ డిమాండ్.**

**ఉలవపాడు** సిపిఎం ఉలవపాడు, వలేటివారిపాలెం ప్రాంతీయ కమిటీ సమావేశం కామ్రేడ్. దువ్వూరి. జాన్ అధ్యక్షతన ఈరోజు కందుకూరులో జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ యం. రమేష్ పాల్గొని మాట్లాడారు.ఆయన మాట్లాడుతూ వలేటివారిపాలెం మండలం లోని అయ్యవారిపల్లి వద్ద కొండలలో ఉన్న సహజ సంపద అయిన ఐరన్ వోర్ నిక్షేపాలను జిందాల్ అనే కార్పొరేట్ కంపేని కి ఇవ్వటం తగదని పేర్కొన్నారు. ప్రభుత్వమే వీటిని నిర్వహించాలని, సహజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పాలని నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని యం. రమేష్ కోరారు. వలేటివారిపాలెం మండలంలోని అయ్యావారిపల్లి, చుండి, మాలకొండ, లింగసముద్రంలోని ఎర్రారెడ్డిపాలెం కొండలలో ఉన్న మ్యాగ్న టైట్ ఇనుప ముడిఖనిజాన్ని,గనులను విశాఖ స్టీల్ ప్లాంట్ కి కేటాయించాలని, ప్రభుత్వమే నోటిఫికేషన్ వేయాలని కోరారు. వలేటివారిపాలెం లింగసముద్రం ప్రాంతాలను యువతకి తద్వారా ఉపాధి అవకాశాలు కలుగుతాయని, కార్పొరేట్ సంస్థ అయినా జిందాల్ అప్ప చెప్పడం వలన నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలందరి సమీకరించి రాబోయే కాలంలో ఉద్యమం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ సమావేశంలో వలేటివారిపాలెం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్, కమిటీ సభ్యులు ఎస్.డి. గౌస్ భాషా, కత్తి. సుజాత, ఏలూరి. నాగార్జున, సాదు. చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

# అక్కడి శివుడి దర్శనం ఏడాదికి 5 రోజులే- అది కూడా ప్రాణాలే పణంగా పెట్టి వెళ్తేనే!



: సాధారణంగా గుడి అంటే ఎప్పుడు తెరిచే ఉంటుంది, కదా? కానీ ఒక శివాలయం మాత్రం సంవత్సరంలో కేవలం 5 రోజులు మాత్రమే తెరుచుకుంటుంది! ఆ 5 రోజులు పూజలు అయ్యాక, మళ్లీ తలుపులు మూసేస్తారు. మళ్లీ శివయ్య దర్శనం కావాలంటే ఏడాది ఆగాల్సిందే. ఇంతకు ఈ గుడి ఎక్కడుంది? ఆ విశేషాలేమిటో ఈ కథనంలో తెలుసుకుందాం.

**మహా సాహసయాత్ర**

ఏడాదిలో 5 రోజులే దర్శనం! పొరపాటున ఈ 5 రోజుల్లో వెళ్లలేకపోతే మళ్లీ ఏడాది కాలం ఎదురు చూడాల్సిందే! ఎందుకంటే ఈ గుడికి వెళ్లడం అంటే మామూలు యాత్ర కాదు, చాలా పెద్ద సాహసం. అక్కడికి వెళ్లాలంటే గుండె చేతిలో పట్టుకుని అడుగులు వేయాలి. దారిలో చాలా ప్రమాదాలు ఉంటాయి. ఈ దేవాలయాన్ని చేరుకోవడానికి దేవుడిపై భక్తి ఒక్కటే ఉంటే సరిపోదు గుండె నిండా ధైర్యం కూడా ఉండాలి. మరి, ఇంత ముఖ్యమైన ఆ గుడి ఎక్కడుంది?

**అతి ప్రాచీన సలేశ్వరం గుడి**

సలేశ్వరం గుడి శ్రీశైలానికి దగ్గరలో ఉన్న అతి ప్రాచీన శివాలయం. ప్రకృతి రమణీయత మధ్య వెలసి, పురాతన చరిత్ర ఉన్న ఈ పుణ్యక్షేత్రం దట్టమైన నల్లమల అడవుల్లో ఉంది. ఈ శివయ్య దర్శనం అతి దుర్లభమని అంటారు.

**5 రోజులే దర్శనం!**

సలేశ్వరంలో పరమేశ్వరుడు లోయలో ఉన్న ఒక గుహలో శివలింగ రూపంలో ఉంటారు. ఈ ఆలయం ప్రతి సంవత్సరం చైత్ర పౌర్ణమికి రెండు రోజుల ముందు, రెండు రోజుల తరువాత, మొత్తం 5 రోజులు మాత్రమే తెరచి ఉంచుతారు. ఈ 5 రోజులు మాత్రమే శివయ్యను దర్శించుకోవడానికి భక్తులను అనుమతిస్తారు.

**5 రోజులు మాత్రమే ఎందుకు?**

ఈ ప్రాంతం ఎక్కువగా పులులు సంచరించే ప్రదేశం కాబట్టి అడవి నియమాలను అనుసరించి మామూలు రోజుల్లో ఎవరికీ అనుమతి ఉండదు. అందుకే సంవత్సరంలో ఈ 5 రోజులు మాత్రమే భక్తులు వెళ్లడానికి అనుమతిస్తారు. ఈ ఏడాది మార్చి 30 నుంచి ఏప్రిల్ 3 వరకు సలేశ్వరం ఆలయం భక్తుల కోసం తెరచి ఉంటుంది. సలేశ్వరం శివాలయంలో స్థానికంగా ఉండే చెంచులు పూజారులుగా వ్యవహరిస్తారు.

**అత్యంత ప్రమాదంతో కూడిన దారి**

శ్రీశైలం నుంచి సలేశ్వరం దాదాపు 25 కి.మీ. దూరం ఉంటుంది. అయితే ఇందులో కేవలం 20 కి.మీ. మాత్రమే వాహనంలో వెళ్లగలం. అక్కడి నుంచి 5 కి.మీ.లు కచ్చితంగా నడవాలి. ఈ ప్రయాణం అత్యంత ప్రమాదకరం. లోతైన లోయలోకి దిగడం, కొండలు అధిరోహించడంతో మిగిలిన మార్గమంతా ఎంతో కష్టతరంగా ఉంటుంది.

**ప్రమాదాల దారి**

సలేశ్వరంకు చేరుకునే దారి చాలా ప్రమాదకరం. కొన్ని చోట్ల ఒక్క కాలు మాత్రమే పట్టేంత సన్నని దారి ఉంటుంది. ఒక్క అడుగు తప్పినా, యాత్రికులు లోతైన లోయలోకి పడిపోతారు. అందుకే చాలా జాగ్రత్తగా, తలుచుకుంటూ వెళ్లాలి. సలేశ్వరం శివయ్య దర్శనానికి వెళ్లే భక్తులు శ్రమ తెలియకుండా ఉండటానికి "వస్తున్నాం వస్తున్నాం లింగమయ్యో" అంటారు. దర్శనమయ్యాక తిరిగి వెళ్ళేటప్పుడు "పోతున్నాం పోతున్నాం లింగమయ్యో" అని అనుకుంటూ శివయ్య మీద తమ భక్తిప్రపత్తులు చాటుకుంటారు.

**సలేశ్వరంలో చూడదగ్గ అద్భుతాలు**

సలేశ్వరం శివయ్య దర్శనం కోసం వెళ్లే భక్తులకు ఎన్నో కష్టాలకు ఓర్చి, ప్రమాదకర దారిని దాటి లోపలికి వెళ్లగానే కనిపించే సుందరమైన దృశ్యాలు వారు పడ్డ కష్టాన్ని మరిపిస్తాయి. ఎత్తైన కొండల నుంచి కిందకు పడే జలపాతం చూడటానికి చాలా అందంగా ఉంటుంది. ఈ నీరు చుట్టూ ఉన్న ఎన్నో ఔషధాలు, వనమూలికల చెట్ల మీదుగా ప్రవహించి వస్తుంది కాబట్టి, ఈ నీటిలో స్నానం చేస్తే ఆరోగ్యానికి మంచిదని నమ్ముతారు. అందుకే సలేశ్వరం కొండకు మరణించిన వారిని కూడా తిరిగి బ్రతికించే శక్తి ఉందని అంటారు.

**చల్లని గుండం**

జలపాతం కిందకు జాలువారే ప్రదేశంలో ఉన్న చల్లని గుండంలోని నీరు ఎప్పుడు నిలిచి ఉంటుంది. ఆ గుండంలోని నీరు చాలా చల్లగా, స్వచ్ఛంగా ఉంటుంది.

**సలేశ్వరం ఎలా చేరుకోవాలి?**


హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే దారిలో మన్ననూర్ అనే ఊరు వస్తుంది. మన్ననూర్ దాటాక, కొద్ది దూరం వెళ్తే సలేశ్వరం అని బోర్డు కనిపిస్తుంది. అక్కడ నుంచి 10 కి.మీ.లు లోపలికి వెళ్తే అక్కడ వాహనాలు ఆపే చోటు బేస్ క్యాంప్ ఉంటుంది. అక్కడి నుంచి 5 కి.మీ.లు నడిస్తే గుడి దగ్గరకు చేరుకోవచ్చు. మార్చి 30, సోమవారం నుంచి భక్తులను దర్శనానికి అనుమతించనున్నారు. ఈ 5 రోజులలో ఒకసారి ఆ లింగమయ్య స్వామిని దర్శించుకోవడానికి మనం కూడా ప్రయత్నించి తిరుగులేని మధురానుభూతిని సొంతం చేసుకుందాం.

**ఓం నమః శివాయ!**

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# రావిచెట్టు, తులసి, నవగ్రహాలకు ప్రదక్షణలు- ఇలా చేస్తే అనేక లాభాలు!







జాతకరీత్యా శని దోషాలు ఉన్నా లేకపోయినా ప్రతి శనివారం కొన్ని ప్రత్యేక పరిహారాలు పాటించడం వల్ల జీవితం ఎలాంటి ఒడుదొడుకులు లేకుండా సాఫీగా సాగి పోతుందని పండితులు చెబుతున్నారు. హిందూ ధర్మశాస్త్రం ప్రకారం దైవానికి, పవిత్ర మొక్కలకు ప్రదక్షిణలు చేయడం సంప్రదాయం. ఇందులో ఇటు ఆధ్యాత్మిక శక్తితో పాటు అటు ప్రకృతి పరిరక్షణ అనే సూత్రం కూడా ఇమిడి ఉంది. ప్రతి శనివారం ముఖ్యంగా కొన్ని దైవ స్వరూపాలకు, పవిత్ర మొక్కలకు ఈ విధంగా ప్రదక్షిణాలు చేస్తే జీవితంలో ఉన్న అన్ని చికాకులు పోతాయి. అవేంటో ఈ కథనంలో తెలుసుకుందాం.శనివారం విష్ణు స్వరూపంశని ారం సాక్షాత్తు శ్రీ మహావిష్ణువు అంశం అయిన శ్రీ వేంకటేశ్వర స్వామికి ఎంతో ఇష్టమైన రోజు. అయితే ఈ రోజు కొన్ని పనులు చేస్తే గ్రహ దోషాలు తొలగి పోవడంతో పాటు మనం తెలిసి తెలియక చేసిన పాపాలు కూడా నశిస్తాయి. అలాగే సకల సంపదలు, సుఖసంతోషాలు సొంతమవుతాాయని జ్యోతిష్య శాస్త్ర పండితులు చెబుతున్నారు. అవేంటో చూద్దాం.ఏడుకొండల వెంకన్నకు ఏడు ప్రదక్షిణాలుఏడుకొండల వేంకటేశ్వర స్వామికి ప్రతి శనివారం 7 ప్రదక్షిణాలు చేస్తే ఎంత కష్టమైన పని అయినా సులభంగా పూర్తవుతుందని విశ్వాసం. ఇలా ప్రతి శనివారం చేసేవారి అదృష్టానికి తిరుగుండదు.రావి చెట్టురావి చెట్టుకి ప్రతి శనివారం మూడు ప్రదక్షిణాలు చేయడం లక్ష్మీ ప్రదం. రావిచెట్టు కింద నువ్వుల నూనెతో దీపారాధన చేస్తే ముక్కోటి దేవతల ఆశీర్వాదం దక్కుతుందని నమ్మకం. అందుకే ప్రతి శనివారం రావిచెట్టు భద్రప్రదం.హనుమం తుడుశనివారం కేవలం గోవిందుడికే కాదు హనుమంతుడికి కూడా ఎంతో ఇష్టమైన రోజు. అయితే జీవితంలో ఎందుకు అనుభవిస్తున్నామో తెలియని బాధలు, తీరని కోరికలు, అనారోగ్య సమస్యలు కనుక వేధిస్తుంటే హనుమంతుడికి 11 ప్రదక్షిణాలు చెయ్యాలి. ఇలా ఆంజనేయస్వామికి ప్రదక్షిణాలు చేయడం వల్ల హనుమ అనుగ్రహంతో కార్యసిద్ధి, శత్రుజయం కలుగుతాయి. అదృష్టం మీ వెంటే ఉంటుంది.నవగ్రహాలకు ప్రదక్షిణాలుమన పురాణాల ప్రకారం నవగ్రహాలు అత్యంత శక్తివంతమైనవి. గ్రహదోషాలతో ఇబ్బందులు పడే వారు ప్రతి శనిఎజీవితంలో ఉన్న అన్ని చికాకులు పోతాయి. అవేంటో ఈ కథనంలోం నవగ్రహాలకు 9 ప్రదక్షిణాలు చేయడం వల్ల అనేక సమస్యలు తొలగుతాయి. విద్య, వ్యాపారం, ఆర్థిక సమస్యలు, అనారోగ్య సమస్యలు, కుటుంబ కలహాలు వంటి ఈతి బాధల నుంచి ఉపశమనం లబిప్రదక్షిణాలు శివమహాపురాణం ప్రకారం శివుడికి సోమవారంతో పాటు శనివారం కూడా ప్రీతికరం. శనివారం శివునికి ప్రదక్షిణాలు చేస్తే సకల గ్రహ దోషాలు తొలగుతాయని విశ్వాసం. ఎందుకంటే నవగ్రహాలనే కవచంగా ధరించిన భోళా శంకరుని ఆశ్రయిస్తే ఎంతటి గ్రహ మొక్కసనాతన ధర్మం పాటించే ప్రతి ఇంట్లో తులసి మొక్క తప్పకుండా ఉంటుంది. హిందూ ధర్మ శాస్త్రం ప్రకారం తులసి మొక్కని పూజిస్తే ఈ జన్మలో ఉన్న పాపాలే కాకుండా ఏడేడు ఏ ఇంట తులసి మొక్క నిత్యం పూజలందుకుంటుందో ఆ ఇంటికి ఎప్పుడు రక్షగా తులసీదేవి తల్లి వలే కాపాడుతుంది. అందుకే ప్రతి శనివారం తులసి మొక్కకు 3 ప్రదక్షిణాలు చేస్తే ఎంతటి గ్రహదోషాలైనా తొలగుతాయని పరిహారాలు పాటించి సుఖమయంగా జీవితాన్ని గడుపుదాం.ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా వ్యక్తిగత విషయం.

# తెల్ల వెంట్రుకలతో బాధపడుతున్నారా? – ఈ ఇంటి చిట్కాలు పనికొస్తాయట!



: ప్రస్తుతం చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ బాధిస్తున్న సమస్యల్లో జుట్టు తెల్లబడటం ఒకటి. ఇందుకు పోషకాహార లోపం, వాతావరణ కాలుష్యంతోపాటు ఇంకా చాలా రకాల కారణాలే ఉన్నాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ఇంట్లో లభ్యమయ్యే కొన్ని పదార్థాలను వినియోగించడం ద్వారా ఈ సమస్యను కొంత వరకు అరికట్టవచ్చని చెబుతున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!ఉసిరి రసం : ఉసిరికాయల నుంచి తీసిన రసాన్ని తాగడం ద్వారా జుట్టు తెల్లబడకుండా ఉండటమే కాదు, జుట్టు రాలడం, చివర్లు చిట్లడం వంటి సమస్యలు సైతం తగ్గుముఖం పడతాయంటున్నారు నిపుణులు. ఈ రసం వల్ల ఆరోగ్య సంబంధిత సమస్యల నుంచి సైతం చక్కని ఉపశమనం లభిస్తుందని చెబుతున్నారు. జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడం, నెరవడాన్ని నివారించడం, జుట్టు రాలడాన్ని అరికట్టడం వంటి అనేక చికిత్సా ప్రయోజనాలకు ఉసిరి ప్రసిద్ధి చెందిందని జీశీబతీఱశ్రీ శీట ాాఎబతీజవఝ ఖఅఎ ×త్వవస్త్రతీఫ్వస వీవసఱఅఝశ్రీ ాఎఅవవఅఎవం ప్రచురించింది. స్వేచ్ఛగా జీవించేందుకే ఎక్కువ ప్రాధాన్యం – "జెన్? జెడ్" కొత్త బాటలు ఇవే!డికాక్షన్?తో : ఉసిరికాయల్ని నీటిలో నానబెట్టాలి. తర్వాత అందులో చెంచా యూకలిప్టస్ ఆయిల్ (నీలగిరి తైలం) కలిపి రాత్రంతా పక్కన పెట్టుకోవాలి. మరుసటి ఉదయాన్నే ఈ మిశ్రమంలో కొద్దిగా నిమ్మరసం, పెరుగు, ఒక గుడ్డు కూడా వేసుకుని బాగా కలుపుకోవాలంటున్నారు నిపుణులు. దీన్ని తలకు ప్యాక్?లా వేసుకుని 15–20 నిమిషాల పాటు ఆరనివ్వాలట. తర్వాత గోరువెచ్చని నీటితో హెడ్?బాత్ చేయాలని సూచిస్తున్నారు. ఈ విధంగా తరచూ చేయడం వల్ల మంచి ఫలితం కనిపిస్తుందని సలహా ఇస్తున్నారు.పెరుగుతో : కొద్దిగా కరివేపాకులను తీసుకుని మెత్తగా చేసుకోవాలట. అందులో, పావుకప్పు పెరుగు వేసి బాగా కలుపుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ మిశ్రమాన్ని జుట్టుకు కుదుళ్ల నుంచి చివర్ల వరకు బాగా పట్టించాలని అంటున్నారు. 15 నిమిషాల నుంచి అరగంట ఆరనిచ్చిన తర్వాత తలస్నానం చేయాలని సలహా ఇస్తున్నారు. ఇది మన పూర్వికుల నుంచి పాటిస్తున్న చక్కని పద్ధతి అని వివరిస్తున్నారు. జామ ఆకులతో : కొన్ని జామ ఆకులు తీసుకుని.. వాటిని మెత్తని ముద్దలా చేసుకోవాలి. దీన్ని కేశాలకు అప్లై చేసుకుని కాసేపు ఆరనిచ్చి తర్వాత తలస్నానం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.కొబ్బరినూనె : కొద్దిగా కొబ్బరినూనె తీసుకుని అందులో చెంచా నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో కేశాలను బాగా మర్దన చేసుకోవాలంటున్నారు నిపుణులు. 15 –30 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలని చెబుతున్నారు. కొబ్బరి నూనె, నిమ్మరసం మిశ్రమం జుట్టుకు పోషణను అందించడానికి, స్కాల్ప్‌ను ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుందని ాాజూజూశ్రీఱఎఫ్ఱశీఅం ప్రచురించింది.ఇవి కూడా :ఆముదాన్ని కురులకు పట్టించి మృదువుగా మర్దన చేయాలి. 30 నిమిషాల పాటు ఆరనిచ్చి తర్వాత శుభ్రం చేసుకోవాలి. వేపనూనెను కూడా ఇందుకు ఉపయోగించవచ్చు.ఉసిరిపొడి, బాదం నూనె, శీకాకాయ ఇవన్నీ జుట్టు ఆరోగ్యానికి మేలు చేసేవే అని నిపుణులు చెబుతున్నారు.అయితే, ఈ టిప్స్ సహజసిద్ధమైనవే అయినప్పటికీ, వ్యక్తిగతంగా ఎవరికి వారు తమ జుట్టు తత్వానికి సరిపడతాయో లేదో పరిశీలించుకోవాలని నిపుణులు చెబుతున్నారు. అవసరమైతే ఆయా పదార్థాలను వాడే ముందు సంబంధిత వైద్యులను సంప్రదించి, సందేహాలను నివృత్తి చేసుకోవడం మంచిదంటున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# ఇలాంటి బంధాలను వదులుకుంటేనే మంచిదట - నిపుణుల సూచనలు ఇవే!



బ్రేకప్', 'విడాకులు' పదం ఏదైనా భాగస్వామితో బంధాన్ని తెంచుకున్నామని తెలియజేసేవి. ఇలా ఒక బంధం నుంచి బయటికి వచ్చినప్పుడు తీవ్రమైన భావోద్వేగాలకు లోనవడం సాధారణమే. అయితే, మనకు వేదన మిగిల్చి, మన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే బంధాల నుంచి బయటికొచ్చాక బాధపడాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. పైగా ఇలాంటి బంధాలను తెంచుకోవడం వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయని అంటున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!తప్పు లేకపోయినా ఎందుకు మాట పడాలి? : 'నీకు ఏ పనీ చేతకాదు', 'చేసే పనైనా సరిగ్గా చేయవు' ఇలాంటి నిరుత్సాహపూరిత మాటలు చాలా మంది దంపతులు అనుకున్నప్పుడు వింటుంటాం. ఈ క్రమంలో కొంతమంది అప్పటికి అలా మాట్లాడినా, తర్వాత తమ తప్పు తెలుసుకొని భాగస్వామికి క్షమాపణ చెబుతారట. మరికొందరు మాత్రం అదే పనిగా భాగస్వామిని విమర్శిస్తూనే ఉంటారు. ఒక్కోసారి ఈ విమర్శల వల్ల బాధితులు ఆత్మన్యూనతకు గురయ్యే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. కాబట్టి, అలాంటి వ్యక్తులకు దూరమవడం మంచిదేనంటున్నారు. దీని వల్ల తప్పు లేకపోయినా పదేపదే మాటలు పడాల్సిన అవసరం ఉండదని చెబుతున్నారు. తద్వారా కోల్పోయిన ఆత్మవిశ్వాసాన్ని తిరిగి పెంపొందించుకోవచ్చని తెలియజేస ్తున్నారు."కర్లీ హెయిర్?"తో ఇబ్బంది పడుతున్నారా? – ఈ టిప్స్? పాటిస్తే బెటర్!?అసూయ పడుతున్నారా? : మీరు ఉన్నత స్థాయికి వెళ్లే కొద్దీ మీ భాగస్వామి మీపై అసూయ పడచ్చు. తద్వారా తమనెక్కడ వదిలి వెళ్తారోనని వారు అనుక్షణం అభద్రతకు లోనై మిమ్మల్ని ఇబ్బంది పెట్టవచ్చని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల మీరు కెరీర్‌తోపాటు వ్యక్తిగతంగానూ పలు సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. కాబట్టి, మీ భాగస్వామిని మార్చుకోగలిగితే సరే సరి, లేదంటే అలాంటి వారికి దూరంగా ఉంటేనే మంచిదని సూచిస్తున్నారు.అనుమానం : ప్రతి చిన్న విషయానికీ భాగస్వామిని అనుమానించే వారు కొంతమంది ఉంటారు. దీనివల్ల సంసారంలో కలతలు తప్ప సంతోషాలకు చోటు ఉండదంటున్నారు నిపుణులు. కాబట్టి, అలాంటి వాళ్లతో ఉంటూ ఆత్మాభిమానాన్ని చంపుకోనవసరం లేదని సూచిస్తున్నారు. అలాంటి అనుబంధం నుంచి బయటికొచ్చి మిమ్మల్ని మీరు నిరూపించుకోగలిగితే, ఏదో ఒక రోజు వాళ్లే తమ తప్పు తెలుసుకొని మిమ్మల్ని క్షమాపణ కోరచ్చని పేర్కొంటున్నారు.ఆ హక్కు వారికి లేదు : కొంతమంది జీవితాల్లో చేసే పని, వేసుకునే దుస్తులు, తయారయ్యే విధానం.. వంటి విషయాల్లోనూ నిబంధనలు ఉంటాయి. ఇలాంటి భాగస్వామిని ఎదుర్కోవడం ప్రతీ క్షణం సవాలే అని నిపుణులు చెబుతున్నారు. అదే ఆ బంధం నుంచి తప్పుకుంటే మీకు నచ్చినట్లుగా మీరు నడుచుకోవచ్చని అంటున్నారు. చక్కటి కెరీర్‌కూ బాటలు వేసుకోవచ్చని సూచిస్తున్నారు. ఏ విషయంలోనైనా మీ స్వేచ్ఛను హరించే హక్కు, మీపై కట్టుబాట్లు విధించే అధికారం ఎవరికీ లేదని పేర్కొంటున్నారు.ఎతారట. మరికొందరు మాత్రం అదే పనిగా భాగస్వామిని విమర్శిస్తూనే ఉంటారు. ఒక్కోసారి ఈ విమర్శల వల్ల బాధితులు ఆత్మన్యూనతకు గురయ్యే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. కాబట్టి, అలాంటి వ్యక్తులకు దూరమవడం మంచిదేనంటున్నారు. దీని వల్ల తప్పు లేకపోయినా పదేపదే మాటలు పడాల్సిన అవసరం ఉండదని చెబుతున్నారు. తద్వారా కోల్పోయిన ఆత్మవిశ్వాసాన్ని తిరిగి ె ం పొ ం ది ం చ ు కో వ చ ్చ ని తెలియజేస్తున్నారు."కర్లీ హెయిర్?"తో ఇబ్బంది పడుతున్నారా? – ఈ టిప్స్? పాటిస్తే బెటర్!?అసూయ పడుతున్నారా? : మీరు ఉన్నత స్థాయికి వెళ్లే కొద్దీ మీ భాగస్వామి మీపై అసూయ పడచ్చు. తద్వారా తమనెక్కడ వదిలి వెళ్తారోనని వారు అనుక్షణం అభద్రతకు లోనై మిమ్మల్ని ఇబ్బంది పెట్టవచ్చని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల మీరు కెరీర్‌తోపాటు వ్యక్తిగతంగానూ పలు సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. కాబట్టి, మీ భాగస్వామిని మార్చుకోగలిగితే సరే సరి, లేదంటే అలాంటి వారికి దూరంగా ఉంటేనే మంచిదని సూచిస్తున్నారు.అనుమానం : ప్రతి చిన్న విషయానికీ

ఒకసారి అనుబంధంలో దెబ్బతిన్నాక, దానిపై నమ్మకం కోల్పోవడం మానవ స్వభావం. అయితే, ఈ సమయంలో మిమ్మల్ని మీరుగా గు గుర్తుచేసుకోవద్దని చెబుతున్నారు. దీని నుంచి బయటపడి భవిష్యత్తుపై దృష్టి పెడితే ఇటు వ్యక్తిగతంగా, అటు వృత్తిపరంగా ఉన్నతి సాధించచ్చని తెలియజేస్తున్నారు.వీటితో పాటు స్వీయ ప్రేమను పెంచుకుంటే లైఫ్?లో ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా సులభంగా అధిగమించచ్చని సలహా ఇస్తున్నారు. అయితే, గత అనుభవాల నుంచి బయటపడే క్రమంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా మానసిక నిపుణుల సహాయం తీసుకోవడం మంచిదట.



# అంపైర్ తీరు పట్ల రోహిత్ శర్మ తీవ్ర అసహనం

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 కీలక దశకు చేరుకుంది. ఆదివారంతో ప్రతి జట్టు కూడా నాలుగేసి మ్యాచ్‌లను ఆడేశాయి. ఇక ఆదివారం డబుల్ హెడర్స్ జరిగింది. మధ్యాహ్నం జరిగిన పోరులో లక్నో సూపర్ జెయింట్స్‌పై గుజరాత్ టైటాన్స్ నెగ్గగా.. రాత్రి జరిగిన హై స్కోరింగ్ పోరులో ముంబై ఇండియన్స్‌పై ఆర్సీబీ ఘనవిజయం సాధించింది. ముంబై ఇండియన్స్‌కు ఇది హ్యాట్రిక్ ఓటమి కావడం విశేషం. ఇక మ్యాచ్ సమయంలో రోహిత్ శర్మకు కోపం వచ్చింది. అది కూడా అంపైర్‌పై. తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. ఆ తర్వాత మ్యాచ్ ఆడుతూ గాయపడ్డాడు కూడా. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ 20 ఓవర్లలో 4 వికెట్లకు 240 పరుగులు చేసింది. అనంతరం ముంబై ఇండియన్స్ ఛేజ్‌కు దిగే సమయంలో అంపైర్లు బ్యాటర్ల బ్యాట్‌లను చెక్ చేశారు. ఈ క్రమంలో రోహిత్ శర్మ బ్యాట్‌ను చెక్ చేసే సమయంలో చెకింగ్ పరికరం బ్యాట్ మధ్యలో స్ట్రక్ అయ్యింది. ఆ పరికరం.. బ్యాట్ ఒక ఎండ్ నుంచి మరొక ఎండ్‌కు ఆగకుండా వెళ్లాలి. కానీ, రోహిత్ శర్మ బ్యాట్‌ను చెక్ చేసే సమయంలో చెకింగ్ పరికరం ఇరుక్కుపోయింది. పలుమార్లు అంపైర్ బలంగా పరికరాన్ని నెట్టే ప్రయత్నం చేశాడు. అయినప్పటికీ అది వెళ్లలేదు. దాంతో అసహనానికి గురైన రోహిత్ శర్మ.. మీరు తప్పుగా పెడుతున్నారంటూ అంపైర్‌కు సూచించాడు. చివరకు డ్రెస్సింగ్ రూం నుంచి తిలక్ వర్మ వచ్చి చెకింగ్ పరికరంతో బ్యాట్‌ను చెక్ చేయగా.. అప్పుడు పరికరం ఒక ఎండ్ నుంచి మరొక ఎండ్‌కు వెళ్లి వచ్చింది. ఈ క్రమంలో తిలక్ వర్మ కూడా అంపైర్‌కు ఏదో చెబుతాడు. బహుశా ఎందుకు ఆ పరికరం ఇరుక్కుపోయిందనే దానిపై వివరణ ఇచ్చినట్లున్నాడు. అయితే దీనిపై అభిమానుల్లో భిన్నాభిప్రాయాలు వస్తున్నాయి. పక్కన ఉన్న రికెల్టన్ బ్యాట్‌ను చెక్ చేసినపుడు చెకింగ్ పరికరం సులభంగా కదిలింది కదా.. రోహిత్ బ్యాట్ విషయంలో ఎందుకు కదల్లేదంటూ కామెంట్స్ పెడుతున్నారు. రూల్స్ అందరికీ ఒకేలా ఉండాలంటున్నారు. రోహిత్ బ్యాట్ విషయంలో ఏదైతే జరిగిందో అది వేరే ప్లేయర్‌కు జరిగి ఉంటే బ్యాట్ మార్చాలని అంపైర్లు తెగేసి చెప్పేవారని కానీ, అక్కడ రోహిత్ కాబట్టి అతడు ఏమన్నా పడాల్సి వస్తుందని కొందరు కామెంట్స్ చేస్తున్నారు.

# మహిళల టీ20 వరల్డ్ కప్ రికార్డ్ స్థాయిలో ప్రైజ్‌మనీ




మహిళల క్రికెట్ చరిత్రలో మరో అద్భుతమైన ఫైట్ జరగనుంది. కేవలం 60 రోజుల్లో ఇంగ్లాండ్, వేల్స్ వేదికలుగా ప్రారంభం కానున్న ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026 కోసం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (×జజ) ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. ఈసారి టోర్నీలో పాల్గొనే జట్ల కోసం రికార్డ్ స్థాయిలో ప్రైజ్ మనీని ప్రకటించింది. మహిళల క్రీడలకు ఆదరణ పెరుగుతున్న తరుణంలో, పురుషుల క్రికెట్‌తో సమానంగా పెట్టుబడులు పెట్టాలనే ఉద్దేశంతో ఐసీసీ ఈ అడుగు వేసింది. ప్రైజ్ మనీ పెంచడమే కాకుండా, టోర్నీని మరింత విస్తృతం చేస్తూ జట్ల సంఖ్యను కూడా పెంచడం విశేషం. ఈ నిర్ణయం మహిళా క్రికెటర్ల ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేయడమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఈ క్రీడకు కొత్త ఊపునివ్వబోతోంది. ఐసీసీ ప్రకటించిన వివరాల ప్రకారం, 2026 మహిళల టీ20 ప్రపంచకప్ మొత్తం ప్రైజ్ పూల్ విలువను 8,764,615 డాలర్లకు (సుమారు రూ. 73.4 కోట్లు) పెంచారు. ఇది 2024 ఎడిషన్‌తో పోలిస్తే 10 శాతం ఎక్కువ. గతంలో 10 దేశాలు పాల్గొన్న టోర్నీలో 7,958,077 డాలర్ల ప్రైజ్ మనీ ఉండేది. ఇప్పుడు జట్ల సంఖ్య 12కి పెరగడంతో బహుమతి మొత్తాన్ని కూడా ఐసీసీ భారీగా పెంచింది. క్రికెట్ రంగంలో మహిళా అథ్లెట్ల ప్రభావం పెరుగుతోందని, అందుకే పెట్టుబడులను కూడా అదే స్థాయిలో పెంచుతున్నామని ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ మెగా టోర్నీలో ట్రోఫీని ముద్దాడే జట్టుకు భారీ నగదు బహుమతి దక్కనుంది. విజేతగా నిలిచిన టీమ్ 2,340,000 డాలర్ల (సుమారు రూ. 19.5 కోట్లు) ప్రైజ్ మనీని సొంతం చేసుకుంటుంది. అలాగే రన్నరప్‌గా నిలిచిన జట్టుకు 1,170,000 డాలర్లు (సుమారు రూ. 9.7 కోట్లు) అందజేస్తారు. సెమీఫైనల్‌లో ఓడిపోయిన రెండు జట్లకు చెరో 675,000 డాలర్లు (సుమారు రూ. 5.6 కోట్లు) దక్కుతాయి. ప్రతి గ్రూప్ స్టేజ్ మ్యాచ్ గెలిస్తే అదనంగా 31,154 డాలర్లు (సుమారు రూ. 26 లక్షలు) ఇస్తారు. టోర్నీలో పాల్గొనే ప్రతి జట్టుకు కనీసం రూ. 2 కోట్ల ప్రైజ్ మనీని ఐసీసీ గ్యారెంటీ ఇచ్చింది. ఐసీసీ తీసుకుంటున్న ఇలాంటి నిర్ణయాలు మహిళా క్రికెట్ ఎదుగుదలకు ఎంతో అవసరం. ఆర్థికంగా బలోపేతం చేయడం ద్వారా మరికొంత మంది యువతులకు ఈ క్రీడ వైపు వచ్చేలా ప్రోత్సహించవచ్చు. మహిళల టీ20 ప్రపంచకప్ చరిత్రలో మొదటిసారిగా 12 జట్లు తలపడబోతున్నాయి. గతంలో కేవలం 10 జట్లు మాత్రమే మెగా టోర్నీలో పోటీ పడేవి. జట్ల సంఖ్య పెరగడం వల్ల టోర్నీ మరింత రసవత్తరంగా మారనుంది. ఆతిథ్య దేశం ఇంగ్లాండ్‌తో పాటు శ్రీలంక, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇండియా, ఐర్లాండ్, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, పాకిస్థాన్, స్కాట్లాండ్, దక్షిణాఫ్రికా అలాగే వెస్టిండీస్ జట్లు ఈ పోరులో నిలవనున్నాయి. మొత్తం 24 రోజుల పాటు జరిగే ఈ టోర్నీలో 7 వేదికల్లో 33 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఇది మహిళల క్రికెట్‌ను మరింత గ్లోబల్ స్పోర్ట్‌గా మార్చుడానికి దోహదపడుతుందని ఐసీసీ భావిస్తోంది. వరల్డ్ కప్ ప్రైజ్ మనీ ప్రకటనతో పాటే ఐసీసీ ట్రోఫీ టూర్ కూడా వైభవంగా మొదలైంది.

# కొత్త వివాదంలో చిక్కుకున్న యుజ్వేంద్ర చాహల్



టీమిండియా లెగ్ స్పిన్నర్, ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ తరఫున ఐపీఎల్ 2026లో ఆడుతున్న యుజ్వేంద్ర చాహల్ ఓ కొత్త వివాదంలో చిక్కుకున్నాడు. బోల్డ్ నటిగా పేరు తెచ్చుకున్న తానియా ఛటర్జీ.. చాహల్ తనకు ఇన్‌స్టాగ్రామ్‌లో పర్సనల్ మెసేజ్ పంపాడంటూ సంచలన ఆరోపణలు చేసింది. దీనికి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ వీడియోలో ఆమె తన ఫోన్‌ను మీడియా ప్రతినిధులకు చూపిస్తూ.. చాహల్ తన ఫోటోకు స్పందిస్తూ .."ఆప్ క్యూట్ హో" (మీరు చాలా క్యూట్‌గా ఉన్నారు) అని మెసేజ్ చేసినట్లు పేర్కొంది. ఉల్లు, గందీ బాత్ వంటి ఓటీటీ సిరీస్‌ల ద్వారా పాపులర్ అయిన తానియా ఛటర్డీ.. ఈ విషయాన్ని కెమెరాల ముందు బయటపెట్టారు. చాహల్ పంపిన మెసేజ్ ను తాను చాలా ఆలస్యంగా చూశానని.. అందుకే చాహల్‌కు రిప్లై ఇవ్వదని తానియా వివరించారు. ఈ సమయంలో కెమెరామెన్లు ఆమెను ఆటపట్టిస్తుండగా.. తానియా సిగ్గుపడుతూ కనిపించారు. అయితే ఈ ఆరోపణలపై యుజ్వేంద్ర చాహల్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక వివరణ ఇవ్వలేదు. ఈ వార్త బయటకు రాగానే నెటిజన్లు రెండు వర్గాలుగా విడిపోయి కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. కొందరు యుజ్వేంద్ర చాహల్ ప్రవర్తనను తప్పుబడుతూ విమర్శలు గుప్పిస్తుంటే.. మరికొందరు మాత్రం ఇది కేవలం పబ్లిసిటీ కోసమే చేస్తున్న చౌకబారు పని అని కొట్టిపారేస్తున్నారు. ప్రస్తుతం ఏఐ కాలంలో ఇలాంటి ఫేక్ చాట్‌లు సృష్టించడం పెద్ద కష్టమేమీ కాదని.. వార్తల్లో నిలవడానికి నటి ఇలాంటి పనులు చేస్తోందని చాహల్ అభిమానులు మండిపడుతున్నారు. గతంలో ధనశ్రీ వర్మతో విడిపోయిన తర్వాత యుజ్వేంద్ర చాహల్ వ్యక్తిగత జీవితం తరచుగా వార్తల్లో నిలుస్తూనే ఉంది. వ్యక్తిగత జీవితంలో వివాదాలు ఉన్నప్పటికీ.. మైదానంలో యుజ్వేంద్ర చాహల్ పంజాబ్ కింగ్స్ తరఫున కీలక పాత్ర పోషిస్తున్నారు.



# టీ20లో విరాట్ కోహ్లీ రికార్డ్

విరాట్ కోహ్లీ ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో రికార్డులు సృష్టిస్తున్నాడు. ముంబై ఇండియన్స్ జట్టుపై ముంబై వేదికగా ఆడుతూ అరుదైన ఘనత సాధించాడు. ముంబై ఇండియన్స్ పై వెయ్యి పరుగులు చేసిన మొదటి క్రికెటర్‌గా కోహ్లీ చరిత్రలో నిలిచాడు. ఛాంపియన్స్ లీగ్ టీ20, ఇండియన్ ప్రీమియర్ లీగ్ రెండింటిలోనూ కలిపి ముంబై జట్టుపై కింగ్ కోహ్లీ వెయ్యి పరుగులు పూర్తి చేశాడు. ఈ ఘనత సాధించిన ఏకైక క్రికెటర్‌గా నిలిచాడు. వాంఖడే మైదానంలో ఆదివారం రాత్రి జరుగుతున్న మ్యాచ్‌లో 20 పరుగులు చేయడంతో కోహ్లీ ఈ ఘనత సాధించాడు. ఈ విషయంలో అతను భారత బ్యాటర్లు కేఎల్ రాహుల్, శిఖర్ ధావన్‌లను అధిగమించాడు. ఈ జాబితాలో ఏబీ డివిలియర్స్, డేవిడ్ వార్నర్ ఎక్కువ దూరంలో లేరు. విరాట్ రికార్డు మాత్రం చారిత్రాత్మకమైనది. ఎందుకంటే అతను ఒకే జట్టు తరఫున ఆడుతూ ప్రత్యర్థి జట్టుపై ఏకంగా వెయ్యి పరుగులు పూర్తి చేశాడు. కేఎల్ రాహుల్ ముంబైకి వ్యతిరేకంగా వెయ్యి పరుగులు చేయడానికి కేవలం 23 పరుగుల చేరువలో ఉన్నాడు. అయితే కోహ్లీ మాత్రం ఒకే జట్టుకు ఆడుతూ ఈ ఫీట్ నమోదు చేసిన ఏకైక క్రికెటర్. ముంబై: రన్ మేషిన్ విరాట్ కోహ్లీ 2026లో రికార్డులు సృష్టిస్తున్నాడు. ముంబై ఇండియన్స్ జట్టుపై ముంబై వేదికగా ఆడుతూ అరుదైన ఘనత సాధించాడు. ముంబై ఇండియన్స్ పై వెయ్యి పరుగులు చేసిన మొదటి క్రికెటర్‌గా కోహ్లీ చరిత్రలో నిలిచాడు. ఛాంపియన్స్ లీగ్ టీ20, ఇండియన్ ప్రీమియర్ లీగ్ రెండింటిలోనూ కలిపి ముంబై జట్టుపై కింగ్ కోహ్లీ వెయ్యి పరుగులు పూర్తి చేశాడు. ఈ ఘనత సాధించిన ఏకైక క్రికెటర్‌గా నిలిచాడువాంఖడే మైదానంలో ఆదివారం రాత్రి జరుగుతున్న మ్యాచ్‌లో 20 పరుగులు చేయడంతో కోహ్లీ ఈ ఘనత సాధించాడు. ఈ విషయంలో అతను భారత బ్యాటర్లు కేఎల్ రాహుల్, శిఖర్ ధావన్‌లను అధిగమించాడు. ఈ జాబితాలో ఏబీ డివిలియర్స్, డేవిడ్ వార్నర్ ఎక్కువ దూరంలో లేరు. విరాట్ రికార్డు మాత్రం చారిత్రాత్మకమైనది. ఎందుకంటే అతను ఒకే జట్టు తరఫున ఆడుతూ ప్రత్యర్థి జట్టుపై ఏకంగా వెయ్యి పరుగులు పూర్తి చేశాడు. కేఎల్ రాహుల్ ముంబైకి వ్యతిరేకంగా వెయ్యి పరుగులు చేయడానికి కేవలం 23 పరుగుల చేరువలో ఉన్నాడు. అయితే కోహ్లీ మాత్రం ఒకే జట్టుకు ఆడుతూ ఈ ఫీట్ నమోదు చేసిన ఏకైక క్రికెటర్. ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలో విరాట్ కోహ్లీ 4 వేర్వేరు జట్లపై వెయ్యికి పైగా పరుగులు చేశాడు.

# కెప్టెన్సీ నాకు కొత్త కాదు: ఇషాన్ కిషన్



కెప్టెన్సీ తనకు కొత్త కాదని సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ఇషాన్ కిషన్ అన్నాడు. అండర్ 19 స్థాయి నుంచి తాను కెప్టెన్సీ చేస్తున్నానని గుర్తు చేశాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో ఉప్పల్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. టాస్ సందర్భంగా మాట్లాడిన ఇషాన్ కిషన్ తుది జట్టులో రెండు మార్పులు చేసినట్లు వెల్లడించాడు. 'మా తుది జట్టులో రెండు మార్పులు చేశాం. ప్రఫుల్ హింగే జట్టులోకి వచ్చాడు. నేను చాలా కాలంగా కెప్టెన్సీ బాధ్యతలు నిర్వహిస్తున్నాను. గతంలో భారత అండర్-19 జట్టుతో పాటు నా రాష్ట్ర జట్టుకు కూడా కెప్టెన్‌గా వ్యవహరించాను. సారథ్యం ఆట పట్ల మరింత ఏకాగ్రతతో ఉంచడంతో పాటు పరిస్థితులపై మంచి అవగాహన ఉండేలా చేస్తుంది. కెప్టెన్సీ అనేది వ్యక్తిగత ప్రదర్శన కంటే జట్టు ప్రదర్శనకే ప్రాధాన్యతనిస్తుంది. జట్టు కోసం మరిన్ని విజయాలు సాధించడానికి మేం సిద్ధంగా ఉన్నాం.


# ఐపీఎల్ నుంచి రోహిత్ శర్మ ఔట్.. !

ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఆదివారం సాయంత్రం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్ లో ఐదుసార్లు ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్‌కు చేదు జ్ఞాపకాన్ని మిగిల్చింది. డిఫెండింగ్ ఛాంపియన్ బెంగళూరు చేతిలో ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న సంగతి తెలిసిందే. దీంతో ఇప్పటి వరకు 4 మ్యాచ్ లు ఆడిన ముంబై టీం కేవలం ఒక్క మ్యాచ్ లోనే గెలిచి, 3 మ్యాచ్ లు ఓడిపోయింది. ఈక్రమంలో ముంబై జట్టుకు మరో బిగ్ షాక్ తగిలింది. రోహిత్ శర్మకు తొడ కండరాల గాయం (హామ్‌స్ట్రింగ్) కావడం జట్టును మరింత కష్టాల్లోకి నెట్టింది. ఇన్నింగ్స్ ప్రారంభంలో 13 బంతుల్లో 19 పరుగులు చేసిన రోహిత్, క్రీజులో ఉన్నంతసేపు అసౌకర్యంగా కనిపించాడు. ముంబైలోని విపరీతమైన ఉక్కపోతకు తోడు గాయం తీవ్రత పెరగడంతో, ఫిజియోతో చర్చించిన అనంతరం ఆయన మైదానాన్ని వీడాల్సి వచ్చింది. మ్యాచ్ ముగిసిన తర్వాత వెస్టిండీస్ ఆటగాడు షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ మాట్లాడుతూ, రోహిత్ గాయం ఎంత తీవ్రంగా ఉందో ప్రస్తుతానికి ఖచ్చితంగా చెప్పలేమని పేర్కొన్నాడు. ఇది అభిమానుల్లో కొంత ఆందోళన రేకెత్తించింది. అయితే, తాజాగా అందుతున్న నివేదికల ప్రకారం రోహిత్ శర్మకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. సోమవారం నాడు ఆయనకు స్కానింగ్ పరీక్షలు జరుగుతాయని, ఆ ఫలితాల ఆధారంగానే తదుపరి మ్యాచ్‌లలో ఆయన భాగస్వామ్యంపై స్పష్టత వస్తుందని సమాచారం. పంజాబ్‌తో మ్యాచ్‌కు దూరం కానున్నారా: ముంబై ఇండియన్స్ తమ తదుపరి మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌తో తలపడనుంది. అయితే, జట్టు యాజమాన్యం రోహిత్ విషయంలో ఎటువంటి రిస్క్ తీసుకోవాలని అనుకోవడం లేదు.

# హార్దిక్ పాండ్యకు లక్షల్లో జరిమానా..



వాంఖడే స్టేడియంలో ఆదివారం జరిగిన పోరులో ముంబై ఇండియన్స్ జట్టు అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది. ప్రస్తుత సీజన్‌లో 20వ మ్యాచ్‌లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడిన ముంబై, 22 పరుగుల తేడాతో ఓటమిని చవిచూసింది. గతేడాది విజేతగా నిలిచిన బెంగళూరు జట్టు అద్భుత ప్రదర్శనతో ఈ సీజన్‌లో తన మూడవ విజయాన్ని నమోదు చేయగా, ముంబైకి ఇది వరుసగా మూడవ పరాజయం. సొంత మైదానంలో ఎదురైన ఈ ఓటమి జట్టు ప్రతిష్టను మసకబార్చింది. ఈ ఘోర పరాజయం తర్వాత కెప్టెన్ హార్దిక్ పాండ్యాకు మరో చేదు వార్త అందింది. నిర్ణీత సమయంలో ఓవర్లను పూర్తి చేయడంలో విఫలమైనందుకు (స్లో ఓవర్ రేట్) భారత క్రికెట్ నియంత్రణ మండలి అతనిపై కఠిన చర్యలు తీసుకుంది. ఐపీఎల్ క్రమశిక్షణ నియమావళి ప్రకారం, ఒక మ్యాచ్‌లో ఓవర్ల వేగాన్ని పాటించకపోతే జట్టు కెప్టెనే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఈ మేరకు హార్దిక్ పాండ్యాకు 12 లక్షల రూపాయల జరిమానా విధిస్తున్నట్లు నిర్వాహకులు అధికారిక ప్రకటన విడుదల చేశారు. కేవలం ఓటమి మాత్రమే కాకుండా, హార్దిక్ తీసుకున్న కొన్ని నిర్ణయాలు కూడా విమర్శలకు దారితీశాయి. అనుభవజ్ఞుడైన బౌలర్ శార్దూల్ ఠాకూర్‌ను పది ఓవర్ల తర్వాత రంగంలోకి దించడంపై క్రీడా విశ్లేషకులు పెదవి విరుస్తున్నారు. శార్దూల్ తన మొదటి ఓవర్‌లోనే వికెట్ తీసి సత్తా చాటినప్పటికీ, అతనికి ఆలస్యంగా బౌలింగ్ ఇవ్వడం వల్ల ప్రత్యర్థి జట్టు భారీ స్కోరు సాధించే అవకాశం లభించింది. సోషల్ మీడియాలో సైతం అభిమానులు హార్దిక్ కెప్టెన్సీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్రికెట్ నిబంధనల ప్రకారం, పరిమిత ఓవర్ల మ్యాచ్‌ల్లో 20 ఓవర్లను ఒక నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలి. ఒకవేళ నిర్ణీత సమయం దాటినప్పటికీ ఓవర్లు పూర్తి కాకపోతే, అది క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా పరిగణిస్తారు. ఆదివారం నాటి మ్యాచ్ ముగియడానికి సాధారణం కంటే ఎక్కువ సమయం పట్టడంతో ప్రేక్షకులు కూడా ఇబ్బంది పడ్డారు. అందుకే తొలి తప్పుగా పరిగణిస్తూ హార్దిక్‌కు ఈ జరిమానా విధించారు.



# సింగిల్‌గా ఉండటమే ఇష్టం..

## తన రిలేషన్‌షిప్‌పై స్పందించిన రామ్ పోతినేని

టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్లలో ఒకరైన రామ్ పోతినేని తన రిలేషన్‌షిప్ స్టేటస్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, సింగిల్‌గా ఉండటమే తనకు ఇష్టమని స్పష్టం చేశారు. తన ఈ సింగిల్ స్టేటస్ అనేది కావాలని తీసుకున్న నిర్ణయం కాదని, అది తన వ్యక్తిత్వంలో భాగమని తెలిపారు. చిన్నప్పటి నుంచి ఒంటరిగా ఉండటానికి అలవాటు పడ్డానని రామ్ తెలిపారు. ఖాళీ సమయాన్ని పూర్తిగా ఆస్వాదిస్తానని, ఆ ఏకాంతం తనకు ఎంతో ప్రశాంతతను ఇస్తుందని వివరించారు. స్నేహితులతో గడపడం ఇష్టమే అయినా, తన కోసం తాను సమయం కేటాయించుకోవడంలోనే ఎక్కువ ఆనందం ఉంటుందన్నారు. అయితే, తన జీవితంలోకి ఎవరైనా వస్తే వారితో సమయం గడపడానికి సిద్ధమేనని, ఒకవేళ ఎవరూ రాకపోయినా ఒంటరిగా మరింత సంతోషంగా ఉంటానని రామ్ పేర్కొన్నారు. సినిమా రంగంలో ఎప్పుడూ వందలాది మందితో కలిసి పనిచేయాల్సి ఉంటుందని, అంతమంది మధ్యలో కూడా తనకంటూ ఓ ప్రత్యేక ప్రపంచాన్ని సృష్టించుకున్నానని అన్నారు. ముఖ్యంగా లాక్‌డౌన్ సమయంలో దాదాపు ఏడాదిన్నర పాటు ఒంటరిగా ఉన్న విషయాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు.



# మజిల్స్ ఫొటోతో ఫ్యాన్స్‌కు ట్రీట్

టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ తన తర్వాతి సినిమా కోసం పూర్తిగా సిద్ధమవుతున్నారు. దర్శకుడు ప్రశాంత్ నీల్‌తో చేయనున్న భారీ యాక్షన్ చిత్రం కోసం ఆయన కఠోరంగా కసరత్తులు చేస్తున్నారు. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో జిమ్‌లో వర్కౌట్ చేస్తున్న ఫొటోను పంచుకున్నారు. కెమెరాకు వీపు చూపిస్తూ, కండలు తిరిగిన తన శరీరాన్ని ప్రదర్శిస్తున్న ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫొటోకు “కొన్నది కాదు.. కష్టపడి సంపాదించింది“ అని ఎన్టీఆర్ క్యాప్షన్ జోడించారు. దీంతో ప్రశాంత్ నీల్ సినిమాలో ఆయన పాత్ర ఏ స్థాయిలో ఉండబోతుందోనన్న అంచనాలు మరింత పెరిగాయి. ‘డ్రాగన్’ అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉన్న ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్, మలయాళ నటుడు బిజూ మీనన్ కూడా నటించనున్నారని సమాచారం. 1969 కాలంలో భారత్, చైనా, భూటాన్ సరిహద్దుల్లో జరిగే ఎమోషనల్ యాక్షన్ కథాంశంతో ఈ సినిమా ఉండబోతుందని తెలుస్తోంది. త్వరలోనే ఈ చిత్రం కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుంది.

# ‘భరతవర్ష: సాగా ఆఫ్ శూల’...

## గోపీచంద్ కొత్త చిత్రానికి పవర్ ఫుల్ టైటిల్

మాస్ హీరో గోపీచంద్ తన 33వ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమాకు ‘భరతవర్ష : సాగా ఆఫ్ శూల’ అనే శక్తివంతమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ, సోమవారం టైటిల్ గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. ఇందులో గోపీచంద్ మునుపెన్నడూ కనిపించని రీతిలో వారియర్ అవతారంలో ఆకట్టుకున్నారు. భీకర యుద్ధ సన్నివేశాలతో ఈ గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచింది. ఈ చిత్రం 7వ శతాబ్దం నాటి అవిభక్త భారతదేశంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతోంది. చారిత్రక అంశాలకు పౌరాణిక నేపథ్యాన్ని జోడించి దర్శకుడు సంకల్ప్ రెడ్డి దీన్ని రూపొందిస్తున్నారు. గ్లింప్స్‌లో కనిపించిన గ్రాండ్ విజువల్స్, ఉత్కంఠభరితమైన నేపథ్య సంగీతం సినిమా స్థాయిని తెలియజేస్తున్నాయి. గోపీచంద్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస్ చిట్టూరి నిర్మిస్తున్నారు. అనుదీప్ దేవ్ సంగీతం అందిస్తున్నారు.

ఈ సినిమాలో గోపీచంద్‌కు జోడీగా రీతూ వర్మ నటిస్తోంది. గత కొంతకాలంగా సరైన విజయం కోసం ఎదురుచూస్తున్న గోపీచంద్‌కు ఈ భారీ హిస్టారికల్ యాక్షన్ చిత్రం కమ్‌బ్యాక్ ఇస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. విడుదల తేదీని త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నట్లు చిత్రబృందం తెలిపింది.



# మృణాల్.. నువ్వు తెలుగు అబ్బాయిని పెళ్లి చేసుకుని ఇక్కడే స్థిరపడాలి: అల్లు అరవింద్

అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన లవ్ అండ్ యాక్షన్ థ్రిల్లర్ ‘డెకాయిట్’. ఇటీవల విడుదలైన ఈ చిత్రానికి తొలిరోజు మిశ్రమ స్పందన లభించినప్పటికీ, బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధిస్తోంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం సక్సెస్ మీట్‌ను ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి సినీ ప్రముఖులు నాగ్ అశ్విన్, నందిని రెడ్డి, బన్నీ వాసు, స్వప్న దత్‌తో పాటు అల్లు అరవింద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు, ముఖ్యంగా హీరోయిన్ మృణాల్‌ను ఉద్దేశించి అన్న మాటలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఈ వేడుకలో అల్లు అరవింద్ మాట్లాడుతూ చిత్ర బృందాన్ని అభినందించారు. హీరో అడివి శేష్‌పై ప్రశంసలు కురిపిస్తూ, “శేష్ నిజంగానే ఒక డెకాయిట్ లాంటి వాడు. ఎందుకంటే మంచి కథలను వెతికి పట్టుకుని, వాటితో ప్రేక్షకుల మనసులను దోచేస్తున్నాడు“ అని సరదాగా వ్యాఖ్యానించారు. క్రైమ్ కథకు ప్రేమను జోడించి దర్శకుడు షానిల్ డియో సినిమాను అద్భుతంగా తీశారని, తాను చూసిన ఉత్తమ చిత్రాల్లో ఇదొకటిగా నిలుస్తుందని అన్నారు. నిర్మాత సుప్రియ యార్లగడ్డ కష్టాన్ని, ఎడిటర్ పవన్ కల్యాణ్ పనితనాన్ని ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. ఇక, హీరోయిన్ మృణాల్ ఠాకూర్ నటన గురించి మాట్లాడుతూ... ““సీతారామం’లో సీతగా ఎంతగానో ఆకట్టుకుంది. అయితే ‘డెకాయిట్’లో సరస్వతి పాత్రలో అంతకంటే పరిణతి చెందిన నటన కనబరిచింది. భావోద్వేగాలను అద్భుతంగా పలికించింది” అని ప్రశంసించారు. అనంతరం ఆమె వ్యక్తిగత జీవితంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. “నువ్వు తెలుగు అబ్బాయిని పెళ్లి చేసుకుని ఇక్కడే స్థిరపడాలి“ అని ఆమెను ఆశీర్వదించారు. గతంలో లావణ్య త్రిపాఠికి కూడా ఇలాగే చెప్పానని, ఆ తర్వాత ఆమె వరుణ్ తేజ్‌ను వివాహం చేసుకుని తమ ఇంటి కోడలైందని అల్లు అరవింద్ గుర్తుచేశారు. ఆయన మాటలకు మృణాల్ ఠాకూర్ సిగ్గుతో ముసిముసిగా నవ్వడం అక్కడున్న వారిని ఆకట్టుకుంది. ఈ వ్యాఖ్యలతో కూడిన వీడియో క్లిప్పులు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. “అరవింద్ గారి ఆశీర్వాదం ఫలించి లావణ్య మెగా కోడలైంది.. ఇప్పుడు మృణాల్ కూడా తెలుగింటి కోడలు అవుతుందా?“ అంటూ నెటిజన్లు సరదాగా కామెంట్లు చేస్తున్నారు.



# కొత్త లుక్‌లో రామ్ చరణ్...

## ‘ఎస్క్వైర్‘ కవర్‌పై పవర్‌ఫుల్‌గా గ్లోబల్ స్టార్!

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ మరోసారి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ప్రఖ్యాత ‘ఎస్క్వైర్ ఇండియా‘ మ్యాగజైన్ లేటెస్ట్ ఎడిషన్ కవర్ పేజీపై ఆయన మెరిశారు. ఈ సందర్భంగా మ్యాగజైన్, రామ్ చరణ్‌ను “ప్రస్తుత తరాన్ని ప్రభావితం చేస్తున్న గ్లోబల్ ఫోర్స్“ అని, “భారతీయ సినిమాకు ఒక ముఖ్యమైన ముఖచిత్రంగా నిలిచారు“ అని అభివర్ణించింది. “రామ్ చరణ్ సినీ ప్రయాణాన్ని సెలబ్రేట్ చేస్తూ, ఆయన్ను మునుపెన్నడూ చూడని సరికొత్త రూపంలో మా కవర్‌పై ఆవిష్కరిస్తున్నాం“ అని ఎస్క్వైర్ ఇండియా తన కథనంలో పేర్కొంది. ఈ ఫోటోషూట్‌ను ప్రత్యేకంగా హాంకాంగ్‌లో నిర్వహించినట్లు సమాచారం. ప్రస్తుతం రామ్ చరణ్, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ‘పెద్ది’ చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ నుంచి స్వల్ప విరామం తీసుకుని ఆయన హాంకాంగ్‌లో జరిగిన ఈ ఫోటోషూట్‌లో పాల్గొన్నారు. విశేషమేమిటంటే, ‘పెద్ది’ సినిమా కోసం మెయింటైన్ చేస్తున్న హెయిర్‌స్టైల్‌తోనే ఆయన ఈ షూట్‌లో కనిపించారు. దీంతో ఆయన లుక్‌పై అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.




# ‘జన నాయగన్’ లీక్ కేసు.. ఆరుగురి అరెస్ట్

ప్రముఖ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ నటించిన ‘జన నాయగన్’ సినిమాలోని కొన్ని కీలక సన్నివేశాల లీకేజీ కేసులో కీలక పురోగతి లభించింది. ఈ కేసులో ఆరుగురు వ్యక్తులను తమిళనాడు సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం రెండు రోజుల క్రితమే ఆన్‌లైన్‌లో ప్రత్యక్షం కావడం సినీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది.

రూ.500 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలు లీక్ కావడంపై నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ పైరసీ వెనుక 21 మంది హస్తం ఉందని ఆరోపిస్తూ, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు దర్యాప్తు చేపట్టి ఆదివారం ఆరుగురు



నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ లీక్ నిర్మాణ సంస్థ నుంచే జరిగిందా లేక బయటి నుంచి హ్యాకింగ్ ద్వారా జరిగిందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

‘జన నాయగన్’ చిత్రం విడుదలకు ముందే సెన్సార్ వివాదాల్లో చిక్కుకుంది. ఇందులో రాజకీయంగా సున్నితమైన అంశాలు, వివాదాస్పద సన్నివేశాలు ఉన్నాయని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) పలు అభ్యంతరాలు లేవనెత్తడంతో సినిమా విడుదల నిలిచిపోయింది. ఈ నేపథ్యంలోనే సినిమా లీక్ కావడం నిర్మాతలకు మరింత నష్టాన్ని మిగిల్చింది. ప్రస్తుతం ఈ లీక్ వెనుక ఉన్న పూర్తి నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో, పైరసీ లింకులను వెంటనే తొలగించాలని డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను ఆదేశించారు.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com